
కథలు

# ప్రేరణార్ధక కథలు



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో భాగంగా ఈ పుస్తకాన్ని ద్వారకాధీష్ వాస్తు వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో భాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంథాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) ద్వారకాధీష్ వాస్తు వారి వెబ్ సైట్: http://dwarkadheeshvastu.com
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో ద్వారకాధీష్ వాస్తు వారి వెబ్ సైట్ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline/WhatsApp: 9042020123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

ద్వారకాదీష్ వాస్తు వారి వెబ్ సైట్:

**http://dwarkadheeshvastu.com**



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

Visit Dwarkadheeshvastu.com For
FREE Vastu Consultancy, Music, Epics, Devotional Videos
Educational Books, Educational Videos, Wallpapers
****
All Music is also available in CD format. CD Cover can also be print with your Firm Name
****
We also provide this whole Music and Data in PENDRIVE and EXTERNAL HARD DISK.
Contact : Ankit Mishra ( +91-8010381364, dwarkadheeshvastu@gmail.com )

****

# PREM KAHANIYAN

# (Telgu)

****

# విషయ సూచిక


| క్ర.సం | కథపేరు | పుట సంఖ్య |
|---|---|---|
| 1. | తెలివైన వ్యాపారి | .... 5 |
| 2. | చల్ది అన్నం | .... 8 |
| 3. | సాధువుల ఆశ్రయము | .... 10 |
| 4. | మరణించినవారు ఎక్కడకు వెడతారు ? | .... 13 |
| 5. | నలుగురు సాధువులు - ఒక దొంగ | .... 15 |
| 6. | నిజమైన వేషం | .... 20 |
| 7. | రాజమహలులో లోటు | .... 25 |
| 8. | వజ్రం విలువ | .... 27 |
| 9. | దేవతా వస్త్రాలు | .... 32 |
| 10. | నిజమైన ఆభరణం | .... 34 |
| 11. | లోభ ఫలితము | .... 38 |
| 12. | సన్యాసి రాజు అయితే ? | .... 41 |
| 13. | మోక్షాన్ని ఎవరు యిప్పించగలరు ? | .... 43 |
| 14. | పొదుపు మహిమ | .... 45 |
| 15. | గాడిదలను మనుషులుగా మార్చుట | .... 47 |
| 16. | సుఖనిద్ర | .... 49 |
| 17. | అత్తవారింటి పద్ధతి | .... 51 |
| 18. | దుఃఖించడం దేనికి ? | .... 54 |
| 19. | భ్రమ తొలిగిపోయింది | .... 57 |
| 20. | అతిథి సేవా ఫలము | .... 59 |
| 21. | నాలుగు దీవెనలు | .... 62 |
| 22. | గురుసేవాఫలము | .... 64 |
| 23. | అపూర్వమైన సాధన | .... 66 |
| 24. | దుర్లభమైన వస్తువు లభిస్తే ఏంచేయాలి? | .... 69 |
| 25. | నాలుగు సూక్తులు | .... 71 |
| 26. | మాట్లాడితే మరణమే | .... 75 |
| 27. | యదార్థ సంఘటనలు | .... 78 |

॥ శ్రీ హరిః ॥

# తెలివైన వ్యాపారి

రాజస్థాన్‌లో ఒక వ్యాపారి ఉండేవాడు. అతడు ఎడ్లపై "ముల్తానీమట్టి" బస్తాలు వేసుకొని ఢిల్లీవైపు వెళ్తున్నాడు. దారిలోని గ్రామాలలోనే చాలా మట్టి అమ్ముడుపోయింది. ఎడ్ల వీపుపైనున్న బస్తాలు సగం ఖాళీ అయిపోయాయి. అందువల్ల అవి అటుయిటు జారిపోతున్నాయి. పనివాళ్ళు వ్యాపారిని "బస్తాలు కదలకుండా ఉండటానికి ఏం చేద్దా"మని అడిగారు. వ్యాపారి - "ఎడ్లకు ఒకవైపు ముల్తానీమట్టి ఉన్న బస్తాలు వేసి, రెండవవైపు అంతేబరువుగల యిసుక బస్తాలను వేయండి. ఇది రాజస్థాన్ కదా. ఇక్కడ యిసుకకు కొదవ లేదు. అలా చేస్తే ఎద్దులకు రెండువైపులా బరువు సమమవుతుంది" అన్నాడు. పనివాళ్ళు అలానే ఖాళీ అయిన మట్టి బస్తాలలో ఇసుకను నింపి, వాటిని ఎద్దులపై వేసి ప్రయాణం సాగిస్తున్నారు.

వారికి దారిలో ఢిల్లీనుండి తిరిగివస్తున్న ఒక అపరిచిత వ్యక్తి కనిపించాడు. అతడు ఎద్దులపై ఉన్న యిసుక బస్తాలను చూసి - "ఇదేమిటి? ఈ యిసుక బస్తాలను ఏమి చేస్తారు?" అని అడిగాడు. పనివాడు మా ముల్తానీమట్టి సగం అమ్ముడుపోయింది. ఎద్దులకు రెండు ప్రక్కలా బరువును సమం చేయడానికి ఖాళీ అయిన బస్తాలలో ఇసుకను నింపాము" అని వివరించాడు. అది విని ఆ అపరిచితవ్యక్తి - "నువ్వు, నీ యజమాని ఎంత మూర్ఖులు! ఎద్దులచేత అనవసరంగా ఇసుకను మోయిస్తూ, వాటిని హింసిస్తున్నారు. మీ దగ్గర మిగిలిన మట్టినే రెండు సగాలు చేసి, ఎద్దులకు రెండువైపులా కడితే వాటికి ఈ అనవసర భారం మోయవలసిన పని తప్పేదికదా!" అన్నాడు. పనివాడు - "అయ్యా! మీరు చెప్పినది సబబుగానే ఉన్నది. కాని మేము మా యజమాని ఆజ్ఞను పాటించాలి కదా. మీరు మీ సలహాను మా యజమానికి యివ్వండి!" అని చెప్పాడు. ఆ వ్యక్తి అలానే వ్యాపారిని కలిసి తన సలహా చెప్పాడు. వ్యాపారి ఆ అపరిచితుని ఆదరించి, "అయ్యా! మీరెవరు? ఎక్కడివారు? ఎక్కడకు వెడుతున్నారు?" అని అడిగాడు. దానికి ఆ వ్యక్తి - "నేను భివానీ పట్టణానికి చెందినవాడను. సంపాదన

నిమిత్తం ఢిల్లీ వెళ్ళాను. అక్కడ ఉన్న రోజుల్లో ఆరోగ్యం పాడయ్యింది. సంపాదించిన డబ్బంతా ఖర్చు అయిపోయింది. వ్యాపారం దెబ్బతింది. దానితో యిక యింటికి తిరిగి వెళ్ళిపోదామని నిశ్చయించుకుని, అలానే వెళ్ళిపోతున్నాను" అని తనగురించి వివరించి చెప్పాడు. అతని మాటలు విని యజమాని పనివాళ్ళతో - "ఇతని సలహాను పాటించవద్దు. మనం చేయదలుచుకున్నట్లుగానే చేద్దాము. ఇతని ఆలోచన సక్రమంగానే ఉందిగాని, దాని ఫలితం మాత్రం మంచిగా లేదు. ఇతని ఆలోచన ఫలించిఉంటే, ఈ పాటికి యితడు గొప్ప ధనవంతుడు అయివుండేవాడు. మన ప్రణాళిక చూడడానికి తెలివైనదిగా కనబడకపోవచ్చు. కాని అది మనకు ఎన్నో లాభాలను ఆర్జించిపెడుతుంది. ఇప్పటిదాకా నా ఆలోచన ఎప్పుడూ తప్పులేదు" అన్నాడు.

వ్యాపారి ఎద్దులతోనూ, పనివాళ్ళతోనూ ఢిల్లీనగరం చేరుకున్నాడు. అక్కడ కొంత భూమిని కొని, ముల్తానీమట్టిని, ఇసుకను వేరు వేరు దుకాణాలలో అమ్మకానికి ఉంచాడు. కొందరు పనివాళ్ళకు - "ఎద్దులను సమీపంలోని అడవికి తోలుకుపోయి, గడ్డి, నీరు పుష్కలంగా ఉండే ప్రదేశంలో వాటిని మేప"మని ఆదేశమిచ్చాడు. "ఎద్దులను పట్టణంలోనే ఉంచితే, వాటికి గడ్డి కొనడానికే, వచ్చే లాభమంతా సరిపోతుంది కదా" అని ఆలోచించాడు. మట్టి అమ్మకాలు మొదలయ్యాయి.

ఇది యిలా ఉండగా ఢిల్లీ ప్రభువు అనారోగ్యంపాలయ్యాడు. వైద్యులు ఎడారిప్రాంతంలో ఉంటే, ఆ వాతావరణానికి మహారాజు తొందరగా కోలుకునే అవకాశం ఉన్నదని సలహా యిచ్చారు. ఎడారి యిసుకలో రోగనిరోధక శక్తిని పెంచే గుణం ఉన్నదని, అందుచేత మహారాజును ఎడారిప్రాంతమైన రాజస్థాన్‌కు తీసుకువెళ్ళమని సలహా యిచ్చారు. రాజాధికారులు "మహారాజును రాజస్థాన్‌కు పంపడమెందుకు? ఆ ఎడారి యిసుకనే యిక్కడకు తీసుకువస్తే సరి!" అన్నారు."సరేఅయితే, ఎడారినుండి యిసుకను తేవడానికి ఒంటెలను పంపండి". "ఒంటెలను పంపడమెందుకు? ఢిల్లీ బజారులో దొరకనిదేమున్నది? ఇసుకను యిక్కడే కొందాము"

"ఏమిటి? ఢిల్లీ బజారులో యిసుకను అమ్ముతున్నారా?

"అవును. నేనిక్కడ ఒక దుకాణంలో యిసుకను కుప్పలుగా పోసి అమ్మకానికి ఉంచడం చూశాను."

"అవునా! చాలాబాగుంది. వెంటనే యిసుకను తెప్పించండి". రాజాధికారులు ఈవిధంగా తర్జనభర్జనలు చేసుకొని, ఢిల్లీ బజారులో యిసుక కొనడానికి సంసిద్ధులయ్యారు.

రాజుగారి మనుషులు బజారుకు వచ్చి, యిసుక వెల యెంతో అడిగారు. వ్యాపారి - "యిసుకైనా, మట్టి అయినా ఒకే ధర" అని చెప్పాడు. రాజపురుషులు వ్యాపారి అడిగినంత ధర చెల్లించి మొత్తం యిసుకను కొన్నారు. వ్యాపారి రెట్టింపు లాభాలు ఆర్జించాడు.

ఒకవేళ వ్యాపారి దారిలో ఎదురైన అపరిచితుని సలహాను పాటించినట్లైతే, పైసా ఖర్చులేకుండా రెట్టింపు లాభాలను సంపాదించగలిగేవాడా? దీనినిబట్టి వ్యాపారి సరైన నిర్ణయమే తీసుకున్నాడని అర్థమవుతోంది.

ఈ కథ ద్వారా తెలుసుకోవలసిన నీతి ఏమంటే - నిజంగా ఉన్నతిని సాధించినవారు, జ్ఞానాన్ని సంపాదించినవారు, తత్త్వాన్ని అర్థంచేసుకున్నవారు, దుఃఖాన్ని, కోరికలను జయించిన మహాత్ములు మొదలైనవారి ఆలోచన పరిపూర్ణమైనది. అలాంటివారు ఒకమంచిమాట చెబితే దానిని తప్పక ఆచరించాలి. ఎంతో ధనాన్ని సంపాదించిన వ్యాపారిలాంటి వారు ఎవరైనా సలహాను యిచ్చినప్పుడు, దానిని పాటిస్తే మనం కూడా ఆ లాభాలను పొందగలుగుతాము. అలానే సాధువులు, సర్వసంగపరిత్యాగులైన సన్యాసుల ఉపదేశాలను శిరసావహించడం వల్ల ఆత్మోన్నతి లభిస్తుంది. మహాత్ముల ఉపదేశంలోని గూఢార్థం మనకు తెలియక పోయినప్పటికీ, దానిని పాటించి తీరాలి. ఇన్ని రోజులు మనం మన సొంతవివేచనతో ఎంత ఉన్నతిని సాధించగలిగాం? జ్ఞానస్వరూపులైన గురువుల ఉపదేశాన్ని తు॥చ॥ తప్పక పాటించడం వల్ల నిస్సందేహంగా ఆత్మోన్నతి సాధ్యమవుతుంది.

# చల్ది అన్నం

ఒకగ్రామంలో ఒక తల్లి కొడుకు, కోడలితో నివసించేది. ఆమె కొడుకు పెద్దవాడయినా, ఏసంపాదనా లేకుండా జులాయిగా తిరుగుతుండేవాడు. ఎక్కడ తిరిగినా భోజనంవేళకు మాత్రం యింటికి వచ్చేవాడు. రోజూ తల్లి వాడికి అన్నంపెడుతూ - "నాయనా! యీ చద్ది అన్నం తిను" అంటూ ఉండేది. వేడివేడి అన్నం పెడుతూ, తల్లి రోజూ అలా ఎందుకు అనేదో కుమారునికి అర్థం అయ్యేది కాదు.

ఒకరోజు తల్లి యేదోపనిమీద బయటకు వెడుతూ, కోడలికి వంట చెయ్యమని చెప్పింది. కొడుక్కు అన్నం పెడుతున్నప్పుడు మాత్రం చద్ది అన్నం తినమని చెప్పటం మర్చిపోవద్దని మరీమరీ హెచ్చరించింది.

కోడలు తన భర్తకు అన్నం వడ్డించి, అతను తినబోయేముందు "చద్ది అన్నం తినండి" అంది. దానితో అతనికి చాలా కోపం వచ్చింది. "అన్నం కూరలు అన్నీ వేడిగానే ఉన్నాయి కదా. మా అమ్మలానే నువ్వు కూడా చద్దిఅన్నం తినమంటావేమిటి?" అని భార్యను కోపగించుకున్నాడు. ఆ అమ్మాయి బిక్కమొహం వేసుకొని "అత్తగారు నన్ను తప్పకుండా యిలా అనమన్నారు" అని సమాధానం యిచ్చింది. అతడు కోపంతో అన్నం తిననే లేదు. తల్లి యింటికి తిరిగివచ్చి, "నాయనా! అన్నం తిన్నావా?" అని కుమారుణ్ణి ఆపేక్షగా అడిగింది. అతడు చిరాగ్గా "అమ్మా! రోజు నువ్వు వేడి అన్నం వడ్డించి, చద్దన్నం తినమని చెప్తుంటావు. ఇవాళ నీకోడలు కూడా అలానే అంది. వేడివేడి అన్నం కూరలు చద్దివి ఎలా అవుతాయి?" అన్నాడు.

తల్లి "చద్దన్నం అంటే ఏమిటి?" అని ప్రశ్నించింది. "ఉదయం వండిన అన్నం రాత్రికి చల్లబడుతుంది. ఈ రోజువండిన అన్నం రేపటికి చద్దిఅన్నం అవుతుంది. ఇప్పుడే వండినది వేడిఅన్నం అవుతుంది" అని సమాధానమిచ్చాడు. "ఇప్పుడు నువ్వే ఆలోచించి చూడు. నువ్వు మీ నాన్నగారు సంపాదించి నిల్వచేసిన దానినేగా తింటున్నావు. అందుకే దాన్ని చద్దన్నం

అంటున్నాను. నువ్వు కష్టపడి సంపాదించిన దానితో తినేతిండి వేడివేడి అన్నంతో సమానం అవుతుంది. అర్థమయ్యిందా!" అని తల్లి కుమారునికి వివరించి చెప్పింది. అప్పుడు అతడు తన తప్పుకు పశ్చాత్తాపపడి, యికపై కష్టపడి సంపాదించిన దానితోటే తృప్తిగా తింటానని తల్లికి వాగ్దానం చేశాడు.

ఈ కథలోని నీతి ఏమిటంటే ఎవరి రెక్కలకష్టం మీద వారు బ్రతకాలి. పెళ్ళయినవాడు తన సంపాదనతో కుటుంబపోషణ చెయ్యాలి. అంతేగాని, పూర్వులు సంపాదించినదానిని తినడం మొదలుపెడితే 'కూర్చుని తింటే కొండలైనా కరుగుతాయి' అన్న చందాన తయారవుతుంది.

రావణాసురుడు సీతాదేవిని అపహరిస్తే, శ్రీరాముడు భరతుని తనకు సహాయం చేయమని అడగలేదు. ఎందుకంటే తన భార్య పోషణ, రక్షణ తన కర్తవ్యమని రాముడికి బాగా తెలుసు. అందుచేతనే రాముడు, తన బుద్ధి, భుజ బలాలతో సుగ్రీవుడికి సహాయం చేసి, తిరిగి అతడినుండి ప్రత్యుపకారాన్ని పొందాడు. సుగ్రీవుడికి అధికారం, సంపద, రాజ్యం, స్త్రీ అనే నాల్గింటిని యిచ్చి తను మాత్రం సీత ఒక్కదానికోసమే సహాయాన్ని పొందాడు. ఈ దృష్టాంతం వలన తెలిసేదేమంటే కుటుంబాన్ని పోషించగలవాడు, రక్షించగలవాడు మాత్రమే వివాహం చేసుకోవాలి. ఈ సామర్థ్యం లేనివారికి వివాహం అనవసరం.

# సాధువుల ఆశ్రయము

ఒకగ్రామంలో ఒక జమీందారు నివసించేవాడు. ఆయన కుటుంబంలో ఎవరూ బ్రతికిలేరు. ఆయన ఒంటరిగా ఉండేవాడు. జమీందారువద్ద ఒక పాలేరుకుర్రాడు ఉండేవాడు. వాడికీ ఎవరూలేరు. వాడు పశువులను మేపేవాడు. ప్రతీరోజు ఉదయాన్నే పశువులను మేతకు తీసుకువెళ్ళి, మధ్యాహ్నం దాకా వాటిని బాగామేపి తీసుకువచ్చేవాడు. జమీందారుగారి వంటమనిషి వాడికి అన్నం పెట్టేది. ఇది వారికి నిత్యకృత్యం. రోజులు యిలానే సాగిపోతుండేవి. ఒకరోజు ఆ కుర్రాడు పశువులను బాగామేపి మధ్యాహ్నమవుతుండగా తిరిగివచ్చాడు. ఆరోజు చాలా ఎండగా ఉంది. ఆకలితో నకనకలాడుతున్నాడు. రోజులానే భోజనం చేయడానికి సిద్ధంగా కూర్చున్నాడు. వంటమనిషి ఎప్పట్లానే అతనికి చద్దిఅన్నం పెట్టింది. అతడు కొంచెం మజ్జిగగాని, జావగాని పొయ్యమన్నాడు. దానికి ఆపనిమనిషి - "నీకోసం నేను జావ కాచాలా? తింటే తిను. లేకపోతే పో!" అని విసుక్కుంది.

వంటమనిషి మాటలతో ఆ బాలుడి హృదయం గాయపడింది. తిరిగితిరిగి, అలసిపోయి ఆకలితో అన్నం పెట్టమని వస్తే నన్ను విసుక్కుంటుందా అని బాధపడి అన్నం తినకుండానే వెళ్ళిపోయాడు. అలా నడుస్తూ నడుస్తూ, దగ్గరలోని పట్టణానికి వెళ్ళాడు. ఆ నగరంలో ఒక సాధువుల మఠం ఉంది. ఆ మఠంలోని సాధువులు ఆ కుర్రాణ్ణి చేరదీసి, అన్నంపెట్టి, ఏ ఊరినుంచి వచ్చావని అడిగారు. అతడు తాను అనాథనని, తనకు ఎవ్వరూలేరని బదులిచ్చాడు. సాధువులు "నువ్వుకూడా సాధువుగా మారిపోయి యిక్కడే ఉండిపో" అన్నారు. ఆ బాలుడు అలానే సాధువుగా మారిపోయి, మఠం ఆశ్రయాన్ని పొందాడు. విద్యాభ్యాసం కోసం కాశీకి వెళ్ళాడు. అక్కడ బాగా చదువుకొని గొప్ప పండితుడయ్యాడు. కొంత కాలానికి అతడే ఆ మఠానికి అధిపతి అయ్యాడు.

కొన్నిరోజులకు అతని స్వగ్రామానికి రమ్మని, అతనికి ఆహ్వానం లభించింది. మఠాధిపతి కావడంతో తన పరివారాన్ని తీసుకుని అతడు

గ్రామానికి బయలుదేరాడు. పూర్వం అతడు పాలేరుగా పనిచేసిన జమీందారు అప్పటికి బాగా వృద్ధుడయ్యాడు. ఆయనే ఈ కొత్తమఠాధిపతికి ఆతిథ్యం యిచ్చాడు. సన్యాసి పూర్వాశ్రమంలోని తన యజమానిని గుర్తుపట్టాడు గాని, వృద్ధుడైన జమీందారు తనవద్ద పనిచేసిన బాలుడే, ఈ మఠాధిపతిగా మారాడని గుర్తుపట్టలేకపోయాడు. జమీందారు యింటిలో మఠాధిపతికి, అతని పరివారానికి భోజనాలు ఏర్పాటుచేయబడ్డాయి. సాధువులందరూ భగవద్గీతలోని 15వ అధ్యాయాన్ని (పురుషోత్తమ ప్రాప్తి యోగము) పారాయణ చేసి, భోజనానికి ఉద్యుక్తులయ్యారు. మఠాధిపతి ఎదుట రకరకాల భోజనపదార్థాలు అమర్చబడి ఉన్నాయి. ఇంతలో జమీందారు సాధువును సమీపించి - "స్వామీ! నా స్వహస్తాలతో మీకు వడ్డించనివ్వండి. నామీద దయయుంచి నా చేతులతో యిస్తున్న ఈ మిఠాయిని స్వీకరించండి" అని ప్రార్థించసాగాడు. ఇదంతా చూసి ఆ సాధువుకు నవ్వు వచ్చింది. అతడు చిరునవ్వు నవ్వసాగాడు. జమీందారు వినయంగా - "స్వామి! మీరెందుకు నవ్వుతున్నారు?" అని అడిగాడు. సాధువు చిరునవ్వుతో "ఏమీలేదు. ఏదో పాతసంగతి జ్ఞాపకం వచ్చి నవ్వు వచ్చింది" అన్నాడు. జమీందారు ఆ సంగతి ఏమిటో చెప్పమని అడిగాడు.

సాధువు తోటిసన్యాసులతో - "అందరూ ఒకసారి ఆగండి. ఈ జమీందారుగారు నేనెందుకు నవ్వుతున్నానో అడుగుతున్నారు. నేను ఆయనకు సమాధానం చెబుతున్నాను" అని జమీందారుని యిలా అడిగాడు.

"మీ యింటిలో చాలాకాలం క్రితం ఒక పాలేరుపిల్లవాడు ఉండేవాడుకదా. అతడు ఏమయ్యాడు?"

"ఆ పిల్లవాడు పశువులను మేపేవాడు. అతడు ఎప్పుడో యిల్లువదిలిపెట్టి వెళ్ళిపోయాడు. ఎక్కడకు వెళ్ళాడో, యిప్పుడెక్కడ ఉన్నాడో తెలియదు" అన్నాడు - జమీందారు.

ఆ కుర్రవాడిని నేనే. ఆ రోజు కోపంతో యిల్లు విడిచిపెట్టి వెళ్ళిపోయాను. తిన్నగా పట్టణంలోని సాధువుల మఠానికి వెళ్ళాను. వారు నన్ను ఆదరించి ఆశ్రయమిచ్చారు. అక్కడనుండి కాశీకి వెళ్ళాను. అక్కడ చదువుకొని తిరిగివచ్చి మఠాధిపతి నయ్యాను.

ఇదే ఆ యిల్లు. అదే మీరు అదే నేను. ఆ రోజు ఆకలితో అల్లాడుతుంటే గుక్కెడుగంజి పొయ్యాడానికి మీ వంటమనిషి నిరాకరించింది. ఈ రోజు మీరు మీ స్వహస్తాలతో వడ్డిస్తానని నన్ను ప్రాధేయపడుతున్నారు. ఇదంతా చూసి నాకు నవ్వు వచ్చింది.

**మాంగే మిలే న రాబడీ, కరూం కహాఁ లగి వరణ్ ।**
**మోహన్‌భోగ్ గలే మే అటక్యా, ఆ సన్తోంకీ శరణ్ ॥**

సాధువుల ఆశ్రయం దొరకగానే, గంజినీళ్ళు కూడా దొరకనివాడికి రాజభోగాలు లభిస్తున్నాయి. భగవంతుని శరణుపొందినవాడు సన్యాసులకు సైతం ఆదరణీయుడవుతాడు. లక్షాధికారో, కోటీశ్వరుడో అవడంకంటె, భగవంతుని శరణుజొచ్చి ఆయన భక్తుడయినవాడే స్వతంత్రంగా జీవించగలడు. ఇలాంటి అవకాశం కేవలం మానవుడిగా జన్మించినవారికి మాత్రమే లభిస్తుంది.

# మరణించినవారు ఎక్కడకు వెడతారు ?

ఒక గ్రామంలో పండితుడైన బ్రాహ్మణుడు నివసించేవాడు. అతడు కాశీలో సమస్త విద్యలను, శాస్త్రాలను అభ్యసించాడు. ఒకరోజు ఏదో పనిమీద దగ్గరలో ఉన్న పట్టణానికి వెళ్ళాడు. తిరిగివస్తుండగా పెద్దవాన పడింది. తన వద్ద గొడుగు కూడా లేకపోవడంతో, అతడు దగ్గరలోని ఓ యింటి అరుగుమీదకు వెళ్ళాడు.

అది ఒక వేశ్యయిల్లు. వర్షం తగ్గగానే ఆ యింటిముందునుంచి ఒక మరణించిన వ్యక్తి యొక్క శవాన్ని అంతిమయాత్రకు తీసుకువెడుతున్నారు. ఆ వేశ్య తన కుమార్తెను పిలిచి ఆ చనిపోయిన వ్యక్తి స్వర్గానికి వెళ్ళాడో, లేక నరకానికి వెళ్ళాడో తెలుసుకుని రమ్మని పంపింది. ఆ మాటలు విన్న పండితుడు ఆశ్చర్యపోయాడు. మరణించివారు ఎక్కడకు వెడతారో, తెలుసుకునే విద్య గురించి తనకు తెలియనందుకు చింతించి, ఆ విషయమేమిటో తెలుసుకునేందుకు మరికొంతసేపు అక్కడే ఉండాలని నిశ్చయించుకున్నాడు. ఆ అమ్మాయి తిరిగివచ్చి చనిపోయినవ్యక్తి నరకానికి వెళ్ళాడని చెప్పింది.

ఇంతలో మరికొందరు యింకో శవాన్ని తీసుకు వెడుతుండడం చూసి ఆవేశ్య - ఈసారి చనిపోయిన వ్యక్తి ఎక్కడకు వెళ్ళాడో కనుక్కొని రమ్మని కుమార్తెను పంపింది. ఆ అమ్మాయి తిరిగివచ్చి ఈ వ్యక్తి స్వర్గానికి వెళ్ళాడని చెప్పింది. వారి మాటలు విని ఆశ్చర్యపోయిన బ్రాహ్మణుడు ఎలాగైనా ఈ విద్యను నేర్చుకుని తీరాలని నిశ్చయించుకున్నాడు. ఆ యింటి తలుపు తట్టగా వేశ్య తలుపుతీసి "ఎవరు మీరు?" అని అడిగింది.

బ్రాహ్మణుడు "అమ్మా! నేను..." అని చెప్పునంతలో వేశ్య అతనిని చూసి "నేను వేశ్యను నన్ను అమ్మా!" అని పిలవవద్దు అని చెప్పింది. బ్రాహ్మణుడు "నాకు పరస్త్రీలందరూ మాతృసమానులేనని చెప్పి తన సందేహాన్ని నివృత్తి చేయ"మని అడిగాడు.

వేశ్య - "ఏమిటి మీ సందేహం?"

బ్రాహ్మణుడు - "తల్లీ! నీవు నీ కుమార్తెను మరణించినవారు ఎక్కడకు

వెళ్ళారో తెలుసుకురమ్మని పంపావు. ఆ అమ్మాయి అలానే కనుగొని, "ఒకడు నరకానికి వెళ్ళాడు. ఒకడు స్వర్గానికి వెళ్ళాడు" అని చెప్పింది. ఇదెలా సాధ్యం? చనిపోయినవారు ఎక్కడకు వెళ్ళారో మనకెలా తెలుస్తుంది?" అని ప్రశ్నించాడు.

వేశ్య తన కుమార్తెను పిలిచి, బ్రాహ్మణునికి సమాధానం చెప్పమన్నది. ఆ అమ్మాయి యిలా చెప్పింది.

"ముందుగా నేను మొదట మరణించిన వ్యక్తి యొక్క శవయాత్రలో పాల్గొన్నవారివద్దనుండి, అతడు ఏవీధిలో నివసించేవాడో తెలుసుకున్నాను. అతని ఇంటివద్దకు వెళ్ళి ఇరుగుపొరుగువారితో మాట్లాడగా, వారందరూ యితని మరణానికి ఎంతో ఆనందిస్తున్నారు. "హమ్మయ్య! ఒక పీడ విరగడ అయ్యింది. ఇతడు అందరి వస్తువులు దొంగిలించేవాడు. అందరినీ తిడుతుండేవాడు. అందరితోనూ దెబ్బలాడేవాడు. అబద్ధపు సాక్ష్యాలు చెప్పి అందరినీ ఇరికించేవాడు. అందరినీ కష్టపెట్టేవాడు. వీడు పోవటం వల్ల ఇబ్బందులన్నీ తీరినట్లే" అని సంతోషిస్తున్నారు. వారి మాటలను బట్టి అతడు నరకానికి వెళ్ళాడని చెప్పాను. అలానే రెండవసారి మరణించిన వ్యక్తి చిరునామా తెలుసుకొని, అక్కడకు వెళ్ళగా ఇరుగుపొరుగు వారందరూ మిక్కిలి దుఃఖిస్తున్నారు. "అయ్యోరామా! ఎంత విపరీతం జరిగింది? ఈయన అందరికీ తలలో నాలుకలా ఉండేవాడు. ఎప్పుడూ సాధువులను, మహాత్ములను ఆదరించేవాడు. సత్సంగం చేసేవాడు. అనారోగ్యంతో ఉన్నవారికి ఆపద ఘటిల్లితే భౌతికంగానూ, ఆర్థికంగానూ సహాయం చేసేవాడు. మానసిక ధైర్యాన్ని ఇచ్చేవాడు. ఇతడు మరణించడం వల్ల మేమంతా దిక్కులేని వాళ్ళమయ్యాము". అని విలపిస్తున్నారు. వారి మాటలు విని అతడు స్వర్గానికే వెళ్ళాడని నిశ్చయించాను అని చెప్పింది.

ఆ అమ్మాయి మాటలు విని పండితుడు అరే, మా గ్రంథాలలోనూ ఈ విషయం ప్రస్తావింపబడి ఉంది. మంచి పనులు చేసేవారికి సద్గతులు, చెడుపనులు చేసేవారికి దుర్గతులు ప్రాప్తిస్తాయని పెద్దలు చెప్పారు. నేనే ఈ విషయాన్ని విస్మరించాను అనుకున్నాడు.

పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనమ్

# నలుగురు సాధువులు - ఒక దొంగ

ఒక అరణ్యంలో నలుగురు సాధువులు నివసించేవారు. వారు తమతమ మార్గాలలో భగవంతుని ఆరాధించేవారు. ఆ ప్రాంతపురాజుకు ఒక కుమారుడు ఉన్నాడు. అతనికి విద్యాభ్యాసం చేసే వయసు వచ్చింది. ఒకరోజు మహారాజు రాణితో - "మన కుమారుని మంచి సాధువుగా తయారుచేద్దాము. తర్వాత అతడు రాజ్యం చేసినా, సన్యాసం స్వీకరించినా అది వాడి యిష్టం" అన్నాడు. రాణి - "మహారాజా! మన ప్రయత్నం ఎంత వరకు సఫలమవుతుందో నేను చెప్పలేను, ఎందుకంటే ఒకరు తయారుచేస్తే ఎవరూ సాధువుగా మారరు. స్వతహాగా సాధు స్వభావాన్ని కల్గివుండి, అంతఃప్రేరణ కల్గినవారే సాధువుగా తయారవుతారు" అంది. రాజు దీనికొక ఉపాయముంది. సత్సంగప్రభావం చాలా గొప్పది.

"సర్ సుధారహి సత్సంగతి పాయీ! పారస్ పరస్ కుధాత్ సుహాయీ"!

*(రామచరితమానస్ బాల 3-4)*

అందువల్ల ఒక మంచి సాధువు దగ్గర శిక్షణ యిప్పిద్దామన్నాడు. రాణి - "సరే బాగుంది. కాని అలాంటి సాధువు ఎవరున్నారు?" రాజు - "సమీపంలోని అరణ్యంలో నలుగురు సాధువులున్నారు. వారి దగ్గరకు మన బిడ్డను పంపుదాం".

రాజు, రాణి ఈవిధంగా మాట్లాడుకుంటున్నారు. దైవయోగం వల్ల ఆరోజు రాజభవనంలో దొంగతనం చేద్దామని వచ్చిన దొంగ, చాటుగ దాక్కొని వీరిద్దరి మాటలు విన్నాడు. అతనికొక ఆలోచన వచ్చింది. ఇలా దొంగతనాలు చేస్తూవుంటే, ఎప్పుడో ఒకప్పుడు నేను పట్టుబడిపోతాను. అదే సాధువు వేషం వేసికొని, రాజకుమారునికి గురువునైతే నాపంట పండినట్లే" అనుకున్నాడు. వెంటనే అక్కడనుండి అడవికి వెళ్లిపోయాడు.

కాషాయవస్త్రాలను ధరించి, సాధువులా వేషం వేసుకున్నాడు. కాని రాకుమారుడు వస్తే ఏం బోధించాలో వాడికి తెలియలేదు. అందుకని ఆ దొంగ, నలుగురు సాధువులలో మొదటి సాధువు దగ్గరకు వెళ్ళి - "స్వామీ!

సద్గతి కలిగే ఉపాయం చెప్పండి" అని ప్రార్థించాడు. సాధువు - "ఎవరి మనసు కష్టపెట్టకు. ఎవరినీ నొప్పించకు. అందరి మనసుల్లోనూ భగవంతుడు ప్రకాశిస్తుంటాడు" అని ఉపదేశించాడు. దొంగ "యింకేమైనా చెప్పండి స్వామీ!" అని అడిగాడు. సాధువు - "ఇంకేమీ అక్కరలేదు. కేవలం ఇతరులను బాధపెట్టకపోవడం ద్వారా భగవదనుగ్రహాన్ని పొందవచ్చని" వివరించాడు.

దొంగ రెండవ సాధువు దగ్గరకు వెళ్ళి - "స్వామీ! నాకు ఉత్తమగతి లభించాలంటే ఏం చెయ్యాలో ఉపదేశించండి" అని ప్రార్థించాడు. సాధువు - "ఎప్పుడూ సత్యమునే పలుకు. ప్రాణాలు పోయేపరిస్థితి వచ్చినా ఎప్పుడూ అబద్ధం చెప్పవద్దు.

**"సాంచ్ బరాబర్ తప్ నహీ, ఝూట్ బరాబర్ పాప్**
**జాకే హిరదై సాంచ్‌హై, తాకే హిరదై ఆప్"**

సత్యంతో సమానమైన తపస్సులేదు. అసత్యంతో సమానమైన పాపం లేదు. స్వచ్ఛమైన హృదయంలో భగవంతుడు కొలువుంటాడు." అని చెప్పాడు. దొంగ మరేదైనా సెలవీయండి స్వామీ! అనగా సాధువు "మరేమీ అవసరం లేదని" చెప్పాడు.

దొంగ మూడవ సన్యాసి దగ్గరకు వెళ్ళి, "సద్గతులు కలగాలంటే ఏం చెయ్యాలని" ప్రశ్నించాడు. సన్యాసి - "నిరంతర రామనామ జపమే సద్గతిని ప్రసాదిస్తుంది.

**"జుగతి బతావో 'బాలాజీ' రామ్ మిలన్ కే బాత్**
**మిల్ జాసీ ఓ మాలాజీ 'రామ్' రటో దిన్‌రాత్"**

రాత్రింపగలు రామనామజపం చేయడమే, రాముణ్ణి పొందడానికి సరైన దారి." అని వివరించాడు. దొంగ ఇంకా ఏమైనా సెలవీయమనగా సాధువు "ఇంకేమీ అవసరం లేదని" చెప్పాడు.

దొంగ నాలుగవ సన్యాసి దగ్గరకు కూడా వెళ్ళాడు. మిగిలినవారిని అడిగినట్లే ఆయనను కూడా అడిగాడు. ఆ సాధువు "భగవంతుని శరణు పొందడమే ఉత్తమగతికి ఏకైకమార్గం. వివాహమైన స్త్రీ ఏవిధంగా భర్తే తన సర్వస్వం అనుకుంటుందో, అలానే ఆ పరమాత్మనే సమస్తంగా భావించాలి.

"మేరే తో గిరిధర్ గోపాల్, దూసరోం న కోయీ"
కృష్ణుడే నాకు సర్వం. ఇంకేమీ లేదు అనుకోవడమే సద్గతికి సోపానం." అనిచెప్పాడు. దొంగ ఇంకేమైనా చెప్పమనగా సాధువు "ఇంతకుమించి ఏమీ అవసరం లేదని" చెప్పాడు. దొంగ నలుగురు సాధువులనుండి నాలుగు మంచి విషయాలను నేర్చుకుని, ముందుగానే ఎన్నుకున్న ప్రదేశానికి పోయి, సన్యాసిలా కూర్చున్నాడు. మహారాజు అరణ్యానికి వచ్చి, నలుగురు సాధువులను కలుసుకున్నాడు. నలుగురు ఒక్కొక్క సూక్తిని చెప్పారు. రాజుకు అరణ్యంలో కొత్తగా ఐదవ సాధువు కన్పించాడు. రాజు అతనిదగ్గరకు వెళ్ళి - "స్వామీ! సద్గతిని కలుగచేసే మార్గాల్ని ఉపదేశించ"మన్నాడు. ఆ దొంగ సాధువు మాట్లాడకుండా, ధ్యానం చేస్తున్నట్టు నటించసాగాడు. మహారాజు మరీమరీ ప్రార్థించిన తరువాత నోరు విప్పాడు. "నేను చెప్పినట్లు చేస్తావా?" అని అడిగాడు. రాజు "మీ ఆజ్ఞప్రకారమే నడుచుకుంటాను స్వామీ!" అన్నాడు. దొంగ తాను ఇంతకుముందు నలుగురు సాధువులు దగ్గర నేర్చుకున్న సూక్తుల్ని రాజుకు చెప్పసాగాడు.

దొంగ - "ఎవరి మనసును నొప్పించకు"

రాజు "అలానే గురుదేవా!

"ఎప్పుడూ సత్యమునే పలుకు"

"తప్పకుండా స్వామీ!"

భగవంతుని శరణుకోరు. ఆయన అనుగ్రహిస్తాడు"

"సరేనండి"

"నిరంతరం భగవన్నామస్మరణ చెయ్యి"

"ఇంకా ఏం చెయ్యాలి గురువర్యా?"

"ఇంకా సాధువులు, మహాత్ములు చేసిన బోధలను తు॥చ- తప్పక పాటించు."

రాజు దొంగ చేసిన ఉపదేశాన్ని విని, ముందరి సాధువులు ఒక్కొక్కసంగతినే బోధించారు. కాని ఈ స్వామి ఐదు విషయాలను బోధించారు. ఈయన తప్పకుండా, ఆ నలుగురు సాధువులకంటే గొప్పజ్ఞాని అయిఉంటారనుకున్నాడు. సరళస్వభావుడు, స్వచ్ఛహృదయం

గలవాడవటంచేత, రాజు, దొంగసన్యాసిని గుర్తించలేకపోయాడు. అతనికి నమస్కరించి రాజభవనానికి తిరిగివెళ్లాడు.

చీకటి పడునప్పటికి దొంగ రాజమహలుకు చేరుకున్నాడు. రాజు మనసులో ఏమనుకుంటున్నాడో తెలుసుకోవాలని ఉత్సుకత కలిగింది. మహారాజు, మహారాణిల సంభాషణను దొంగచాటుగా వినాలని, తలుపువెనుక నక్కి ఉన్నాడు. మహారాజు, రాణితో యిలా చెప్పసాగాడు. - "ఈరోజు అరణ్యానికి వెళ్ళి సాధువులను దర్శించుకొని వచ్చాను. నాకు నలుగురు సాధువులే తెలుసు కాని అక్కడ మరొక కొత్త సాధువు కూడా ఉన్నాడు. ఆయన మహాజ్ఞాని, పండితుడు" అనగా రాణి - "మీరు ఆ సన్యాసులను ఏమని ప్రశ్నించారు ?" అని అడిగింది.

"నేను భగవత్ప్రాప్తికి మార్గమును ఉపదేశించమని ప్రార్థించగా మొదటిసాధువు "ఎవరినీ నొప్పించవద్దు" అని ఉపదేశించారు. రెండవసాధువు "సత్యమునే పలుక"మని బోధించారు. మూడవఆయన "భగవన్నామస్మరణమే ముక్తిదాయక"మని తెలిపారు. నాల్గవసాధువు "భగవంతుని శరణు వేడుట వలననే, ఆయన లభిస్తాడని" తెలిపారు. కొత్తగా వచ్చిన ఐదవ సాధువు - పై నలుగురు చెప్పిన నాలుగు విషయాలతోపాటు, సాధువులను సేవించాలనే కొత్తవిషయాన్ని కూడ చెప్పారు" అని రాజు చెప్పగా, రాణికూడా అతడెవరో పెద్ద పండితుడనుకొన్నది. వారిద్దరూ తమ బిడ్డను ఐదవస్వామి వద్దకే పంపాలని నిశ్చయించుకున్నారు.

దొంగ వీరిద్దరిమాటలను తలుపుచాటున నిలబడి విన్నాడు. నేను దొంగసాధువు వేషం వేసికొని, వారివద్ద, వీరివద్ద విన్న నాలుగుమంచిమాటలు చెప్తేనే రాజు,రాణి నన్నింతగా పొగుడుతున్నారు. నేను నిజంగా మంచివాడినైతే, నిజమైన సన్యాసిగా మారితే ఇంకెంత ఫలితముంటుందోననుకున్నాడు. రాజు, రాణిల స్వచ్ఛహృదయం దొంగలో మార్పును తీసుకువచ్చింది. అతడు వెంటనే నిజమైన సాధువుగా మారి, ఎవరి కంటా పడనిచోటికి వెళ్ళిపోయాడు. నలుగురు సాధువుల దగ్గర నేర్చుకున్న నాలుగు విషయాలను శ్రద్ధగా ఆచరిస్తాను. నిజమైన గురువు లభించినపుడు ఐదవ విషయాన్ని పాటిస్తాను అనుకొని, సద్గురువును అన్వేషించడం ప్రారంభించాడు.

సహజంగా ఎంతో తెలివైనవాడు అవటం వల్ల కన్పించిన ప్రతీసాధువును నమ్మేవాడు కాదు. మంచి గురువును వెదకటంలోనే అతడిబుద్ధి లగ్నమయ్యింది.

భగవంతుడు ఆ దొంగ యొక్క శ్రద్ధను గమనించి, సాధువువేషంలో దర్శనమిచ్చాడు. దొంగ భగవంతుని చూసి "ఈయనే నాగురువు" అని నిశ్చయించుకుని, అతణ్ణే శరణుజొచ్చాడు. సాధువురూపంలో ఉన్న భగవంతుడు "నేనేం చెప్పినా చేస్తావా?" అని ప్రశ్నించాడు. దొంగ సరేనన్నాడు. భగవంతుడు ముందుగా నేనొక పనిచెప్తాను. దాన్ని పూర్తిచెయ్యి. తర్వాత నీకు మంత్రమును ఉపదేశిస్తాను. "ఎప్పుడూ ఎవరినీ నొప్పించనివాని శిరస్సును, ఎప్పుడూ అబద్ధం చెప్పనివాడి శిరస్సును, ఎప్పుడూ భగవంతుని నామాన్ని జపించేవాడి శిరస్సును, భగవంతుని శరణువేడినవాని శిరస్సును ఖండించి, ఆ నాలుగు శిరస్సులను నావద్దకు తీసుకునిరా" అని ఆదేశించాడు.

దొంగ ఈ నాలుగు లక్షణాలు గలవారు ఒక్కచోటనే ఉన్నారంటే నాపని మరింత సులభమవుతుంది. అనుకొని పెద్దకత్తిని తీసుకొని బయలుదేరాడు. దారిలో దొంగకు ఒక ఆలోచన వచ్చింది. నేనెప్పుడూ ఎవరినీ బాధించరాదని నిర్ణయించుకున్నానే. ఇప్పుడు ఏకంగా ప్రాణం తియ్యడానికి వెడుతున్నాను. ఛీ! నేనిలాంటిపని చేయలేను అని నిశ్చయించుకున్నాడు.

దొంగలో సద్బుద్ధి జాగృతమయింది. అతడు వెనుకకు తిరిగివచ్చి, భగవంతునితో యిలా అన్నాడు. "గురుదేవా! మీరు చెప్పిన నాలుగు లక్షణాలు నాలోనే ఉన్నాయి. నేను ఎవరినీ నొప్పించను. ఎప్పుడూ అబద్ధమాడనని ప్రతిజ్ఞ చేసాను. ఇక్కడ ఒంటరిగా జీవిస్తూ, నిరంతరం భగవన్నామ జపం చేస్తూ ఆయననే శరణు వేడినవాడిని. మీరు కోరిన నాలుగు లక్షణాలు నాలోనే ఉన్నాయి కనుక నాశిరస్సును తీసుకోండి" అంటూ పెద్దఖడ్గముతో తన శిరాన్ని ఛేదించుకోవడానికి సిద్ధమయ్యాడు. భగవంతుడు సంతోషించి - "ఓయీ! ఆగు. నీ సద్బుద్ధికి మెచ్చాను" అని మంత్రదీక్షను ఇచ్చాడు. అప్పటి నుంచి దొంగ అసలైన సాధువుగా పరివర్తన చెందాడు.

# నిజమైన వేషం

అనగనగా ఒక ఊరిలో ఒక పగటివేషగాడు ఉండేవాడు. అతడు జగన్మాత యొక్క అనుగ్రహాన్ని పొందినవాడు. అతడు ఏ వేషాన్ని ధరిస్తే దానిలో లీనమైపోయేవాడు. ఎవ్వరూ అది కేవలం వేషమని గుర్తించలేకపోయేవారు. చివరికి అతడు కూడా తను నటిస్తున్నాననే సంగతిని మర్చిపోయేవాడు. ఆ పగటివేషగాడు ఒకరోజు ఆ ఊరి రాజుగారి వద్దకు వెళ్ళాడు. మహారాజు అతనిని "త్యాగశీలి, విరక్తుడు అయిన మహాత్ముని వేషం ధరించమన్నాడు. పగటివేషగాడు సరేనని, మహారాజు వద్ద సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు.

తర్వాత కొన్నిరోజుల వరకు వేషగాడు ఎవరికీ కనబడలేదు. బాగా గెడ్డం పెరిగిన తర్వాత ఒక సన్యాసి వేషం వేసుకొని రాజధానిలో ప్రవేశించాడు. అందరూ సాధువులలానే ప్రవర్తించడం మొదలుపెట్టాడు. రాగద్వేషాలను జయించి, భిక్షగా లభించిన దానితోనే సంతృప్తిగా జీవించడం ప్రారంభించాడు. ప్రజలకు మంచి మంచి విషయాలు తెలియజెప్పేవాడు. నగరంలో మహాత్ముడైన సన్యాసి ఎవరో వేంచేసారని కోలాహలం మొదలైంది. మహారాజు మంత్రిని పిలిచి - ఆ వచ్చినది నిజమైన సన్యాసా? లేక పగటివేషగాడా? తెలుసుకురమ్మని పంపించాడు. మంత్రి అతడు వేషగాడేనని గుర్తించాడు.

మహారాజు స్వయంగా సన్యాసి వద్దకు బయలుదేరాడు. ఒక సంచి నిండా బంగారు నాణెములు, ఎన్నో విలువైన కానుకలు, పూజాసామాగ్రి తీసికొని ఎంతో ఆట్టహాసంగా సన్యాసి వద్దకు బయలుదేరి వచ్చాడు. రాజు సన్యాసి వద్ద ఈ బంగారునాణేలను, కానుకలను ఉంచగా, సన్యాసి ఇవేమీ పట్టనట్టు శివశివా! అనుకుంటూ అక్కడనుండి లేచివెళ్ళిపోయాడు. ప్రజలందరూ సాధువు ఎక్కడికో వెళ్ళిపోయినందుకు ఖిన్నులయ్యారు.

వేషగాడు తన అసలురూపంతో మహారాజు ముందుకు వచ్చి, "మహారాజా! నాబహుమతిని నాకు ఇప్పించండి" అని అడిగాడు. రాజు

ఈ కానుకలన్నీ నీకు నిజంగా ఇస్తాననుకున్నావా? అనగా వేషగాడు "ప్రభూ! తమ యిష్టప్రకారమే చేయండి. దానితోనే నేను సంతృప్తుడనౌతాను అన్నాడు. రాజు - "ఓ మూర్ఖుడా! బంగారు నాణెముల సంచీ నీ ఎదురుగా ఉంచితే దానిని వదిలిపెట్టావు. నీకిప్పుడు బహుమతి కావాలా?" అని ఎకసెక్కమాడాడు. వేషగాడు - "ప్రభూ! నేను సర్వసంగపరిత్యాగి అయిన సన్యాసి వేషాన్ని ధరించాను. నేను ద్రవ్యాన్ని ఎలా స్వీకరిస్తాను? నేను లోభంతో ఆ కానుకలను స్వీకరించినట్లైతే నావేషం అభాసు పాలవుతుంది. అప్పుడు జగన్మాతకు ఆగ్రహం కలుగుతుంది. అందుచేతనే నేను మీరిచ్చిన కానుకలను తిరస్కరించాను" అని వివరించాడు. వేషగాని పలుకులు ఆలకించిన మహారాజు ఎంతగానో సంతోషించి, బహుమతులతో సత్కరించాడు.

కొన్నిరోజులు గడిచిన తర్వాత మహారాజు మరల వేషగాడిని రప్పించి సింహం వేషమును ధరించమని ఆజ్ఞాపించాడు. వేషగాడు - "మహారాజా! నేను ఏ వేషాన్ని ధరించినా, దానిలో పూర్తిగా లీనమవుతాను. అలాంటప్పుడు నేనేం చేస్తానో నాకే తెలియదు. సింహం వేషమును ధరించడం ప్రమాదకరమైనది. కనుక మరేదైనా వేషాన్ని ధరిస్తాను" అని విన్నవించుకున్నాడు. మహారాజు అందుకు అంగీకరించక సింహం వేషమునే ధరించమని ఆజ్ఞాపించాడు. వేషగాడు - "ప్రభూ! వేషమును ధరించిన తరువాత నేనేమైనా ప్రమాదకరమైన పనిచేస్తే నా తప్పును క్షమించి నాకు దండన విధించనని ఈ సభాముఖంగా వాగ్దానమిమ్మని" ప్రార్థించాడు. రాజు అలానే వేషగానికి అభయమును ఇచ్చాడు.

వేషగాడు సింహమువలె తయారయి, సభామధ్యమున అటుయిటు చూస్తూ కూర్చున్నాడు. సరిగ్గా అదే సమయానికి విధివశాత్తు రాజకుమారుడు పసిబాలుడు ఆడుకుంటూ అక్కడకు వచ్చాడు. వచ్చి సభామధ్యలో ఉన్న సింహాన్ని చూసి చేతిలోని బెత్తంతో దాన్ని కొట్టాడు. ఆ సింహం క్రోధంతో గాండ్రించి, పంజా విసిరి బాలుణ్ణి హతంచేసింది. అది చూసిన రాజు అయ్యో! ఇదేం వేషం వెయ్యమన్నాను. చేజేతులా నా కుమారుణ్ణి నేనే చంపుకున్నాను అని దుఃఖించాడు.

మరుసటిరోజు వేషగాడు రోదిస్తూ మహారాజు దగ్గరకు వచ్చి, "ప్రభూ! నన్ను క్షమించండి. ముందుగానే, నాచేత ప్రమాదకరమైన వేషములను వేయించవద్దని మీకు మనవి చేసుకున్నాను. నేను వేషమును పాడుచేస్తే అమ్మవారికి కోపం వస్తుంది. ముందుగానే నావలన ఏదైనా అపరాధం జరిగితే మన్నించమని తమరిని ప్రార్థించాను" అంటూ నమస్కరించాడు.

మహారాజుకు ఏంచెయ్యాలో పాలుపోలేదు. ఎలాగైనా తన కుమారుణ్ణి చంపినవాణ్ణి సంహరించాలని ఉంది. కాని తానుగా వాడికి ఏహాని చెయ్యనని ప్రమాణం చేశాడు. వీడిని ఏవిధంగా అంతం చెయ్యాలా? అని ఆలోచించసాగాడు. రాజుగారి వద్ద ఒక క్షురకుడు ఉండేవాడు(మంగలి). వాడికి మహారాజు దగ్గర చనువు ఎక్కువ. వాడు మహారాజుతో - "ప్రభూ! ఆ వేషగానిచేత చనిపోయిన భర్తతోపాటు సహగమనం చేసే సతివేషాన్ని వేయించండి. వాడు తప్పక చితిమంటలలో పడిచస్తాడు రాజకుమారుని హత్య చేసినందుకు అదే వాడికి సరైన శిక్ష అవుతుంది. మీరు శిక్షవేసినట్టు అవదు" అని సలహా యిచ్చాడు.

మహారాజుకు ఈ సలహా బాగా నచ్చింది. వేషగాడిని పిలిపించి మంగలి చెప్పినట్టు వేషం వెయ్యమన్నాడు. వేషగాడు సరేనని ప్రభువు వద్ద సెలవుతీసుకొని వెళ్ళిపోయాడు. దారిలో అతనికి ఓ అనాథశవం కనబడింది. వెంటనే వేషగాడు ఆ చనిపోయినవాని భార్యలా అలంకరించుకుని శవం వద్ద కూర్చుని ఏడ్వనారంభించాడు. దారిన పోయేవారు ఆమె నిజంగా స్త్రీయేనని భావించి, ఆమె దశకు జాలిపడి, ఆ శవానికి అంత్యక్రియలు చేయడానికి సిద్ధపడ్డారు. ఆ స్త్రీ (వేషగాడు) తానుకూడ భర్తతో పాటే సహగమనం చేస్తానని చెప్పింది.

మహారాజు ఈ విషయం తెలుసుకుని, కాటికాపరిని పిలిచి శవంతోపాటు ఆ స్త్రీకూడా పూర్తిగా దగ్ధమయ్యేదాకా తగులబెట్టమని చెప్పాడు. ఊరిచివర, నదిఒడ్డున ఉన్న శ్మశానానికి శవాన్ని తీసుకువెళ్ళారు. అక్కడ ఆ అనాథశవం తలను ఒడిలో పెట్టుకుని కట్టెలపై

కూర్చున్నాడు వేషగాడు. అనాథశవానికి దహనసంస్కారం చేయడానికి ఎవరో ముందుకు వచ్చారు. చితి అంటించగానే అన్నివైపులనుండి మంటలు చుట్టుముట్టాయి.అయినా వేషగాడు ఏమాత్రం జంకలేదు. ఇదంతా చూసి జగన్మాతకు వేషగానిపై అనుగ్రహం కలిగింది.

చూస్తుండగానే నలుదిక్కులా చీకట్లు కమ్మాయి. అంతలోనే పెద్దగాలి, వాన వచ్చాయి. శవ దహనానికి వచ్చిన వారందరూ భయపడి ఎవరిదారిన వారు పారిపోయారు. చివరిదాకా ఉండడానికి అయినవారెవరూ లేరుకదా. వేషగాడు మాత్రం కొంచెంకూడా కదలలేదు. పెద్దవాన పడటం వల్ల చితిమంటలు ఆరిపోయాయి. వర్షం వల్ల వరద వచ్చింది. నది పొంగి, కట్టెలపై ఉన్న వేషగాడు అలానే కొట్టుకుపోయాడు. జగన్మాత కృప వల్ల వేషగాడు బ్రతికిబయటపడ్డాడు.

కొంతకాలం గడిచిన తర్వాత వేషగాడు రాజువద్దకు వచ్చి తన బహుమతిని యిప్పించవలసిందిగా కోరాడు. మహారాజు అతడిని చూసి ఆశ్చర్యపోయి నువ్వెలా బ్రతికివచ్చావని ప్రశ్నించాడు. వేషగాడు నేను మరణించాను గాని జగన్మాత కృప వల్ల బ్రతికివచ్చానని చెప్పాడు. రాజు "నువ్వు పైలోకంలో మరణించిన మా తాతముత్తాతలను పితృదేవతలను చూసావా? తాత, తండ్రులు సుఖంగానే ఉన్నారా?" అని అడుగగా వేషగాడు - "రాజా! మీ పూర్వులందరూ బాగానే ఉన్నారుగాని వారి జుట్టు, గెడ్డాలు, గోళ్ళు బాగా పెరిగిపోయాయి. అందుచేత వారు మీ ఆస్థానక్షురకుని తమ వద్దకు పంపమని సందేశం పంపారు." అని చెప్పాడు. మహారాజు క్షురకుని చంపమని సైనికులను ఆదేశించాడు. క్షురకుడు వేషగాని పాదాలపై పడి "నన్ను క్షమించి రక్షించు. నా కుటుంబమంతా నామీదనే ఆధారపడి ఉంది. నేను చచ్చిపోతే వారందరూ దిక్కులేనివారయిపోతారు. నన్ను కాపాడు" అని ప్రార్థించాడు.

వేషగాడు వానిపై జాలిపడి, నీకు ఏ అపకారం చెయ్యని నన్ను హతమార్చడానికి మహారాజును ప్రేరేపించావు. జగన్మాత దయవల్ల నేను బయటపడ్డాను. నీకు గుణపాఠం నేర్పడానికే ఈనాటకం ఆడాను. అని మహారాజువైపు తిరిగి రాజా! నేను నిజంగా మరణించలేదు అని జరిగిన

వృత్తాంతమంతా వివరించాడు. నేను ఏ వేషం ధరించినా అది పూర్తి అయ్యేవరకూ దానిలో లీనమవుతాను. మృత్యువుకు భయపడి నావేషాన్ని పాడుచెయ్యను. అని చెప్పాడు. ముందుగా మీరు ప్రకటించిన బహుమతిని యిప్పించండి అని కోరగా మహారాజు తన తప్పును గ్రహించి వేషగాణ్ణి సత్కరించాడు.

ఈకథద్వారా తెలుసుకోవలసిన నీతి ఏమిటంటే ఈ ప్రపంచంలోకి అందరం ఏదో ఒక పాత్రను ధరించేవచ్చాము. తల్లిగా, తండ్రిగా, కూతురిగా, కొడుకుగా, అన్నదమ్ములుగా, అక్కచెల్లెళ్ళుగా, అత్తగా, మామగా, కోడలిగా, అల్లుడిగా ఏపాత్రను ధరిస్తే దానికి సంపూర్ణన్యాయం చెయ్యాలి. ఫలితాన్ని ఆశించకుండా, తన కర్తవ్యాన్ని నిర్వహించేవారికి భగవదనుగ్రహం సంపూర్ణంగా సిద్ధిస్తుంది.

# రాజమహలులో లోటు

అనగనగా ఒక రాజు ఉండేవాడు. ఆయనకు ఎన్నో భవనాలు ఉన్నాయి. వాటన్నిటికంటే ఎంతో విలాసవంతంగా హంగు ఆర్భాటాలతో మరొక పెద్దభవనాన్ని నిర్మింపచేశాడు. ఆ భవనంలో లేని సౌకర్యం లేదు. రాజు గురువు దగ్గరకు వెళ్ళి తన నూతన గృహాన్ని పావనం చేయమని ఎన్నోసార్లు ప్రార్థించాడు. రాజు ఎన్నిసార్లు అభ్యర్థించినా గురువు తిరస్కరించాడు. చివరకు ఒకరోజు గురువు రాజమహలుకు రావడానికి అంగీకరించాడు.

మహారాజు స్వయంగా రాజభవనమంతటినీ గురువుకు చూపించాడు. ఇది దర్బారు. ఇది భోజనశాల. ఇది విశ్రాంతిగది.... అంటూ భవనమంతా చూపించాడు. సర్వసంగపరిత్యాగి, సన్యాసి అయిన ఆ గురువు మౌనంగానే అంతా తిలకించాడు. ఆయన ఆ భవననిర్మాణసౌందర్యాన్ని ఏమీ మెచ్చుకోలేదు. ఎందుకంటే ఒక భవనాన్ని నిర్మిస్తే ఎంతో జీవహింస జరుగుతుంది. ఎన్నో ప్రాణులు చనిపోతాయి. ఎలుకలు, పాములు, ఉడుతలు మొదలైన ఎన్నో జీవులు స్వేచ్ఛగా తిరగడానికి అవకాశముండదు. అవి నివసించే ప్రాంతాన్ని ఆక్రమించుకుని భవనాన్ని నిర్మించడం వల్ల వాటి స్వేచ్ఛ దెబ్బతింటుంది. నిర్మాణానికి ముందు ఆ ప్రాంతంపై ఎన్నో జీవులకు హక్కు ఉంటుంది. కాని యిప్పుడు ఒక్కడే ఆ స్థలానికి యజమాని అయ్యాడు. ఇదంతా ఆలోచిస్తూ సాధువు మహారాజు భవనాన్ని ప్రశంసించలేదు.

మహారాజు గురువు తన భవనాన్ని మెచ్చుకోలేదని కొద్దిగా నొచ్చుకొన్నాడు. రాజభవనంలో లోటు ఏమిటని ప్రశ్నించాడు. గురువు చాలాపెద్ద లోపమే ఉన్నదని బదులిచ్చాడు.

రాజు - మంచికుశలులైన పనివాళ్ళచేతనే ఈ భవనాన్ని నిర్మింపజేశాను. ఎక్కడా ఏ లోటూ లేదు. కాని గురువుగారు పెద్దలోపమే ఉన్నదంటున్నారు. ఇదంతా ఆశ్చర్యంగా ఉంది అనుకుంటూ ఆ లోపమేమిటో చెప్పమని ప్రార్థించాడు. గురువు ఆ భవనానికి అమర్చిన తలుపులే పెద్దలోపమన్నాడు. మహారాజు ఆశ్చర్యపడి తలుపులు లేకపోతే యిక భవనమెందుకు? ఎవరైనా

తలుపులు లేకుండా యిల్లు కట్టుకుంటారా? అన్నాడు. గురువు నువ్వీ భవనాన్ని ఎందుకు నిర్మింపజేసావని ప్రశ్నించాడు. నివసించడానికని మహారాజు జవాబు చెప్పాడు. గురువు - "రాజా! నువ్వు యిందులో నివసించేందుకు ఈ భవనాన్ని నిర్మింపజేసావు. కాని ఒకరోజు నిన్నే యిందులోంచి బయటకు (శ్మశానానికి) తీసుకుపోతారు. అప్పుడు నిన్నిక్కడ ఉండనివ్వరు. అందువల్ల నువ్వు యిక్కడ ఉండాలి అనుకుంటే ఈ యింటికి తలుపులు ఉండకూడదు. అప్పుడు యిక బయట, లోపల అన్న ప్రశ్నే ఉండదుకదా" అని వివరించాడు.

ఈ కథ అర్థమేమిటంటే ఈ లోకం మన సొంతయిల్లుకాదు. ఎప్పుడో ఒకప్పుడు వీటన్నిటినీ విడిచిపెట్టి, వెళ్ళిపోక తప్పదు. ఎక్కడకు వెడితే మనం మళ్ళీ తిరిగిరామో అదే మన అసలైన నివాసం.

**యద్గత్వా న నివర్తతే తద్ధామ పరమం మమ ॥**

*(గీత 15-6)*

ఎక్కడకు చేరుకుంటే తిరిగి అక్కడ నుండి తిరిగి రారో, అదే భగవంతుని శాశ్వత నివాసస్థానమైన పరమపదము.

# వజ్రం విలువ

ఒక ఊళ్ళో ఒక నిపుణుడైన వజ్రాల వ్యాపారి ఉండేవాడు. దైవయోగం వల్ల అతడు యౌవనంలోనే మరణించాడు. అతని భార్య, వారి పసిబిడ్డ అతని మరణంతో దిక్కులేనివారయ్యారు. కంసాలి మరణించగానే బంధువులు అతని ఆస్తినంతా అపహరించారు. అయితే కంసాలిభార్య తనభర్త బ్రతికి ఉండగా తనకు యిచ్చిన ఒక అమూల్యమైన వజ్రాన్ని మాత్రం భద్రంగా దాచిఉంచింది. ఆమె కుమారునికి ఇరవైయేళ్ళు వచ్చాక, ఒకరోజు ఈ వజ్రాన్ని చూపించి బాబూ! ఈ వజ్రాన్ని మీనాన్నగారు నాకు యిచ్చారు. దీని విలువ ఎంతో చెప్పలేదుగాని, చాలా అమూల్యమైనదని చాలాసార్లు అనేవారు. ఎవరైనా వారివారి జ్ఞానాన్నిబట్టి దీని విలువను నిర్ణయిస్తారు. నువ్వు ఈ వజ్రాన్ని తీసుకువెళ్ళి, దీనికి విలువ కట్టి తీసుకురా. దీనిని మాత్రం ఎవరికీ యివ్వవద్దు అని చెప్పింది.

కొడుకు సరేనని ఆ వజ్రాన్ని బజారు(అంగడి)కు తీసుకువెళ్ళాడు. ముందుగా ఒక కూరలు అమ్మేస్త్రీ దగ్గరకు వెళ్ళి, ఈ వజ్రాన్ని చూపించి "దీనికి ఎంత ధర యిస్తావు?" అని అడిగాడు. ఆమె దాన్ని చూసి, "పిల్లలు ఆడుకోవడానికి బాగుంటుంది. దీనికి రెండుముల్లంగి దుంపలు యిస్తాను" అంది. కంసాలికొడుకు "దీనిని నీకు అమ్మను" అనిచెప్పి ముందుకుపోయాడు. "ఈ వస్తువుకు ఎంత వెల యిస్తారు?" అని ఎందరినో అడిగాడు. "కొందరు రెండురూపాయలు, కొందరూ మూడురూపాయలు" అనిచెప్పారు. కంసాలికొడుకు దానిని ఒక బంగారం పనివాడు దగ్గరికి తీసుకువెళ్ళి చూపిస్తే, అతడు దానికి యాభైరూపాయలు యిస్తానన్నాడు. చివరకు ఒక కంసాలి దగ్గరకు వెడితే దాని విలువ అయిదువందలు, వెయ్యిదాకా పెరిగింది. ఆ అబ్బాయి వజ్రాన్ని పసిగట్టడంలో నిపుణులైనవారి దగ్గరకు వెళ్ళేకొద్దీ దాని విలువ మరింత పెరగసాగింది. అతడు వజ్రాలపరీక్షకుని దగ్గరకు వెళ్ళి, ఈ వజ్రాన్ని చూపించగా, అది ఒకలక్షరూపాయల విలువ చేస్తుందని ఆ పరీక్షకుడు చెప్పాడు. రత్నాల వర్తకుని కుమారునికి ఈ

వజ్రం ఎంతో ఆశ్చర్యాన్ని కల్గించింది. అతడు ఒక ముసలివాడైన పెద్ద వజ్రాలవ్యాపారి దగ్గరకు వెళ్ళాడు. ఆ ముసలివాడు ఎంతో నిజాయితీపరుడు. వజ్రాల విలువను చక్కగా గుర్తించగలిగినవాడు. ఆయన ఈ వజ్రాన్ని చూసి - "బాబూ! ఈ వజ్రం నీకు ఎక్కడనుండి వచ్చింది?" అని అడిగాడు. అబ్బాయి - "దీనిని నాతండ్రి నాతల్లికి బహుమతిగా యిచ్చాడ"ని చెప్పాడు.

"నీతండ్రి ఎవరు?"

"నేను ఫలానా వజ్రాల వ్యాపారి కుమారుణ్ణి"

"నీతండ్రి పేరు చాలాసార్లు విన్నాను కాని ఈమధ్య అతని గురించి ఏమీ వినలేదు. ఇప్పుడు నీతండ్రి ఏమి చేస్తున్నాడు?"

"ఆయన ఈ లోకాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోయారు"

"అయ్యో! అతడు గొప్పగా వజ్రాలను పరీక్షించేవాడు".

"నేను ఆయన బిడ్డను. ఈ వజ్రానికి ఎంత విలువనిస్తారు?"

"ఇది యెంతో అమూల్యమైనది. నాదగ్గరున్న సంపద మొత్తం యిచ్చినా కూడా, అది ఈ వజ్రపు విలువకు సాటిరాదు."

"అయ్యో! ఇప్పుడు నేనేం చెయ్యను? మాకు రోజు గడవడమే కష్టంగా ఉంది."

"బాబూ! ఈ వజ్రం విలువను నేను లెక్కకట్టలేను. అలా లెక్కకడితే ఈ వజ్రాన్ని అవమానపరచినట్లు అవుతుంది. కనుక మనం ఒకపని చేద్దాం"

"ఏం చేద్దాం"

"నాకు మూడు దుకాణాలున్నాయి. మొదటి దుకాణంలో నీకు పదిహేను(15)నిముషాల సమయమిస్తాను. ఆ సమయంలో నువ్వు ఎన్ని వస్తువులు తీసుకుంటే అవన్నీ నీకే. సామాను బయటకు తెచ్చిపెట్టడానికి నీకు పనివాళ్ళను యిస్తాను."

వ్యాపారి కొడుకు అందుకు అంగీకరించాడు. ఆ యువకుని దుకాణంలోకి తీసుకువెళ్ళారు. అక్కడ ఎంతో విలువైన వజ్రాలు అందమైన డబ్బాలలోంచి మెరుస్తున్నాయి. ఇతనివెంట సమయాన్ని లెక్కిస్తూ ఒక మనిషికూడా ఉన్నాడు. అతడు ప్రతీ అయిదునిముషాలకు ఎంత కాలం

గడిచింది, ఎంతకాలం ఉందో చెబుతూ, యువకుని హెచ్చరిస్తూ ఉన్నాడు. అయితే ఆ అబ్బాయి మాత్రం కళ్ళింతలు చేసుకొని దుకాణమంతా సరిగ్గా చూడనివ్వు అంటూ, అవి అన్ని చూస్తూ పావుగంట గడిపేసాడు. పదిహేను నిముషాలు గడిచిన తర్వాత పనివాడు - "అబ్బాయీ! నీకిచ్చిన సమయం అయిపోయింది. ఇక నువ్వు ఏ వస్తువునూ తాకడానికైనా వీలులేదు." అని చెప్పి బయటకు తీసుకువచ్చాడు.

ముసలివ్యాపారి యువకుని తన రెండవదుకాణానికి తీసుకువెళ్ళాడు. బాబూ! నీకిక్కడ ఇరవై అయిదునిముషాలు సమయమిస్తున్నాను. ఈలోపు నువ్వెన్ని వస్తువులు బయటకు తీసుకువస్తే అవన్నీ నీసొంతమవుతాయి. అని చెప్పి, పనివాళ్ళను, సమయాన్ని తెలియజేసే వ్యక్తిని యిచ్చి రెండవదుకాణంలోకి పంపాడు. ఆ దుకాణం మొదటిదానికంటె ఎన్నోరెట్లు సుందరంగా అలంకరింపబడి ఉంది. అక్కడ ఎన్నో విచిత్రమైన వస్తువులు ఉన్నాయి. యువకుడు పనివాడిని - "ఈ దుకాణం యింకా లోపలకు కూడా ఉందా?" అని అడిగాడు. పనివాడు లోపల యింకా పెద్దగా మరింత అందంగా ఉంటుందని చెప్పాడు. యువకుడు కుతూహలంతో దుకాణమంతా తిరగనారంభించాడు. అతడికి అది వస్తుప్రదర్శనశాల(మ్యూజియం)లా అనిపించింది. పనివాడు సమయమైపోతోందని హెచ్చరించినా, యువకుడు వాడి మాటలను లెక్కపెట్టకో మరల ఈ అవకాశంరాదు" అనుకుంటూ వస్తువులన్నిటినీ చూడసాగాడు. ఇరవై అయిదు నిముషాలు గడవగానే పనివాడు విసుగ్గా "నీ సమయం అయిపోయింది ఇక బయటకు నడు. ఇప్పిక ఏ వస్తువునూ తాకరాదు" అని యువకుని బయటకు పంపించివేసాడు.

ముసలి వజ్రాలవ్యాపారి జరిగినది తెలుసుకుని యువకునికి మూడవదుకాణం చూపించి, ఒక గంట సమయమిచ్చి ముందు చెప్పినట్లుగానే ఆ గంటలో ఎన్ని వస్తువులు బయటకు తేగలిగితే అవన్నీ నీవజ్రానికి బదులుగా ఇస్తానని చెప్పాడు.

మూడవ దుకాణం ఎన్నోమైళ్ల వరకూ విస్తరించి ఉంది. మొదటిదుకాణం చిన్నది. అయితే అందులోని వస్తువులు ఎంతో విలువైనవి. అవి ఎక్కువగా అలంకరింపబడిలేవు. అయినప్పటికీ వాటి సహజశోభతో ప్రకాశిస్తున్నాయి.

రెండవదుకాణంలో అలంకారం ఎక్కువగా ఉన్నా వస్తువులు ఎక్కువ విలువగలవి కావు. ఇక ఈ మూడవ దుకాణంలో ఆహారపానీయాలు, వస్త్రాభరణాలు, నిత్యావసర వస్తువులు, గృహాలంకరణాలు, కార్లు, స్కూటర్లు వంటి విలాసాలు వందలకొద్దీ రకరకాలైన వస్తువులున్నాయి. ఆ దుకాణం నృత్యగీతాలతో అలరింపజేస్తోంది. ఆ దుకాణంలో పంచేంద్రియగుణాలైన శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలను రంజింపజేసే ఎన్నోరకాల వస్తువులు అక్కడ లభిస్తున్నాయి. యువకుడు వాటి వ్యామోహంలో పడిపోయాడు. ఒకసారి కారు నడుపుతాడు. కాసేపు ఊయలలూగుతాడు. కాసేపు నాటకం చూస్తాడు. ఇంకొంతసేపు సినిమా చూస్తాడు. అంతకు ముందెన్నడూ చూడని, వినని వింతవింత లెన్నిటినో చూసి ఆనందిస్తున్నాడు.

కాలగణన చేసే వ్యక్తి - "బాబూ! నువ్వు మొదటి దుకాణంలో ఏమీ తీసుకోలేదు. రెండవ దుకాణంలో ఏమీ తీసుకోలేదు. ఇప్పటిదాకా ఈ మూడవదుకాణంలో కూడా దేనినీ తీసుకోలేదు. నీకిచ్చిన సమయం గడిచిపోతోంది. ఇక ఎంతోసేపు లేదు. మనం తొందరగా వెనక్కువెళ్ళాలి" అని హెచ్చరించాడు. తిరిగి వెళ్ళిపోతూ ఆ యువకుడు ఒక నారసంచీ తీసుకున్నాడు. దుకాణం బయటకు వచ్చి ఆ సంచిని తీసిచూస్తే, అందులో కొన్ని చెల్లని నాణెములు, రాళ్ళు, యినుపగుళ్ళు ఉన్నాయి.

ఆ యువకుడు ఏ ఏ వస్తువులను తీసుకున్నాడో చెప్పమని ముందుగానే ముసలివ్యాపారి పనివాళ్ళను ఆదేశించాడు. ఆ ప్రకారమే వారు తమ యజమానికి - ఆ యువకుడు ఒక పనికిమలిన నారసంచి తప్ప మరిదేనినీ తీసుకోలేదని చెప్పారు. ముసలి వ్యాపారి కోపంతో "వాడి ముఖం నేను చూడను. వాడు ఎందుకూ పనికిరానివాడు. వాడిని దూరంగా పంపించివెయ్యండి" అని పనివాళ్ళకు చెప్పి వెళ్ళిపోయాడు. ఆ యువకుడు ఏం చెయ్యాలో పాలుపోక, ఖాళీచేతులతో యింటికి తిరిగివెళ్ళాడు.

ఈ పరిస్థితే కనుక మనకు ఎదురైతే, ఎంతో విలువైన వస్తువులెన్నిటినో తీసుకునే వారమని మీలో చాలామంది అనుకుంటారు. కాని నిజానికి అలా జరుగదు. ఎందుకంటే మానవ జీవితానికి ప్రతీక ఆ మూడు దుకాణాలు. జీవితంలోని మొదటి పదిహేను సంవత్సరాలు ఆటపాటలతో గడిచిపోతుంది.

తరువాతి పాతికసంవత్సరాలు మనిషి కామినీ కాంచనాల భ్రమలో చిక్కుకుంటాడు. భగవంతుని ధ్యానించడానికి అతడికి సమయమే చిక్కదు. ఒకవేళ ఎవరైనా గాఢమైన భక్తితో ఈ సమయాన్ని భగవత్సాధనకు వినియోగిస్తే అది అత్యంత ఫలప్రదమవుతుంది. ఈ పాతిక సంవత్సరాలు ఎవరైతే వృథా చేస్తారో, వారు వృద్ధాప్యంలో సైతం భగవంతుడి గురించి సాధన చెయ్యలేరు. నలభై ఏళ్ళు వచ్చేటప్పటికి సంసారము, కుటుంబబాధ్యతలు మనిషిని చుట్టుముడతాయి. పిల్లల పెళ్ళిళ్ళు, వారి పిల్లలు.... యిలా కుటుంబం పెరుగుతుంది. బాధ్యతలు ఎక్కువవుతాయి. వయస్సు పెరిగేకొద్దీ శరీరంలో శక్తి తగ్గుతుంది. ఇక భగవంతుని స్తుతించడానికి సమయం ఎలా చిక్కుతుంది? ఈవిధంగా ఈ మాయా ప్రపంచంలో మానవుడు తన అమూల్యమైన సమయాన్ని, జీవితాన్ని నష్టపరుచుకుంటున్నాడు.

# దేవతా వస్త్రాలు

అనగనగా ఒకరాజు ఉండేవాడు. ఆయన ఎంతో అమాయకుడు. సరళమైన హృదయం గలవాడు. ఒకరోజు అతనివద్దకు ఒకవ్యక్తి వచ్చాడు. అతడెంతో తెలివైనవాడు. అతడు మహారాజుతో - "ప్రభూ! మీరు మామూలు పట్టువస్త్రాలు ధరిస్తున్నారు. కాని మీరు మహారాజులు. అందుచేత మీరు సాధారణ పట్టువస్త్రాలు కాక, దేవతావస్త్రాలు ధరించాలని విన్నవించుకుంటున్నాను." అన్నాడు. మహారాజు ఆశ్చర్యంతో, "దేవతా వస్త్రాలా? అవేమిటి?" అని అడిగాడు. అందుకు ఆ తెలివైన వ్యక్తి - "అవును ప్రభూ! మీరు ధరిస్తానంటే నేనే స్వయంగా తీసుకువచ్చి సమర్పించుకుంటాను" అన్నాడు. మహారాజు - "సరే తీసుకురమ్మన్నాడు. తెలివైనవాడు మహారాజుతో "ప్రభూ! ఒక లక్షరూపాయలు దయచెయ్యండి. మిగతావి వస్త్రాలు తెచ్చిన అనంతరం యిప్పించండి" అని అడిగాడు. మహారాజు అలానే లక్షరూపాయలు యిచ్చాడు.

మర్నాడు తెలివైనవాడు మిలమిలా మెరిసిపోతున్న ఒక అందమైన పెట్టెను తీసుకువచ్చి సభామధ్యంలో ఉంచాడు. అందరూ కుతూహలంతో దానినే చూస్తున్నారు. అప్పుడు తెలివైనవాడు లేచి, "మహారాజా! ఇవి దేవతావస్త్రాలు. ఇవి అందరికీ కనబడవు. శీలవంతులైన తల్లిదండ్రులకు జన్మించినవారికి మాత్రమే యివి గోచరిస్తాయి. ఎవరికైతే వేరే తండ్రి ఉంటాడో, వారికివి కనిపించవు" అని చెప్పి ఆ పేటికను తెరచి, అందులోంచి దేవతా వస్త్రాలను తీస్తున్నట్లుగా చేతులు కదపసాగాడు. "ఇదుగో చూడండి! ఇది తలపాగా! ఎంత గొప్పగా ఉందో! ఈ ధోవతి ఎంత అందంగా ఉందో!" అంటూఉంటే, సభలోని వారందరూ కూడ "అవునవును. ఎంత చిత్రంగా ఉన్నాయో" అంటున్నారు. నిజానికి అక్కడ ఎవరికీ ఏ వస్త్రాలు కనబడటం లేదు. అసలక్కడ వస్త్రాలే లేవు. ఇక ఎవరికి మాత్రం ఏం కన్పిస్తాయి? కాని ఎవరూ మాకు వస్త్రాలు కనిపించటం లేదు అని చెప్పలేదు. ఎందుకంటే అలా చెప్తే వాడు తన తల్లిదండ్రులకు పుట్టలేదని అందరూ

అనుకుంటారేమోనని, ఎవరూ ఆ మాట చెప్పడానికి సాహసించలేకపోయారు. చాలామందికి తమ తల్లితండ్రుల శీలంపై అనుమానం కూడా వచ్చింది. ఎందుకంటే ఆ వస్త్రాలు తమకు తప్ప అందరికీ కనబడుతున్నాయికదా. అందరూ వాటిని మెచ్చుకుంటున్నారు. అందుచేత వారు కూడా అవునవును. వస్త్రాలెంతో దివ్యంగా ఉన్నాయి అంటూ అందరితోనూ మాటకలుపుతున్నారు. మహారాజు కూడ నోరు మెదపలేకపోయాడు.

తెలివైనవాడు రాజుగారి దుస్తులు తీసివేసి దేవతావస్త్రాలను ధరింపజేసాడు. మహారాజా! ఈ ధోవతిని కట్టుకోండి. ఈ అంగీని ధరించండి. ఈ తలపాగాను పెట్టుకోండి. అంటూంటే రాజు కూడ అవి ధరిస్తున్నట్లు అభినయించసాగాడు. చివరికి మహారాజు పుట్టినవెంటనే ఎలా ఉన్నాడో అలా దిగంబరంగా తయారయ్యాడు. అలానే అంతఃపురానికి బయలుదేరాడు.

అంతఃపురంలో రాణులు రాజును చూసి ఆశ్చర్యపోయారు. "ఈరోజు ఈయన మద్యాన్ని ఎక్కువ సేవించారా? బట్టలన్నీ తీసిపారేశారు" అన్నారు. వెంటనే మహారాజు - "మీరు మీ తల్లితండ్రులకు జన్మించలేదు. అందుకే మీకు నా వస్త్రాలు కనబడటం లేదు. ఇవి సాధారణమైన వస్త్రాలుకావు. దేవతా వస్త్రాలు" అన్నాడు. రాణులు - "ప్రభూ! మీరు మీ చిత్తం వచ్చినట్లు దేవతా వస్త్రాలు ధరించండి. కాని కనీసం ధోవతి మాత్రం మనదేశంలోనే తయారయినది ధరించండి" అంటూ నవ్వుకున్నారు.

# నిజమైన ఆభరణం

పూర్వకాలంలో చక్రవేణుడనే పేరుగల మహారాజు ఉండేవాడు. ఆయన గొప్ప ధర్మాత్ముడు. ఆయన తన సంపదనంతటినీ పేదప్రజలకు దానం చేసి, వ్యవసాయం చేసుకుంటూ జీవించేవాడు. మహారాణికూడా దొడ్డ యిల్లాలు. ఆమె అన్నిపనుల్లోనూ భర్తకు సహకరించేది. వారు వ్యవసాయంపై తామెంత సంపాదిస్తే, అంత తోటే జీవితాన్ని సాగించేవారు. రాజకోశాగారానికి చెందిన డబ్బును సొంత ప్రయోజనాలకు కాక ప్రజోపయోగమైన పనులకు మాత్రమే ఉపయోగించేవారు. రాజవంశీకులు అయినప్పటికీ సాధారణదుస్తులనే ధరించేవారు. సాధారణమైన భోజనమే చేసేవారు.

ఒకరోజు రాజధానిలో ఉత్సవం జరిగింది. నగరంలో ప్రముఖులస్త్రీలందరూ ఖరీదైన పట్టువస్త్రాలు, విలవైన రత్నాలు, బంగారు ఆభరణాలు ధరించి రాణిగారి వద్దకు వచ్చారు. వారు మహారాణిని చూసి మీరు మాఅందరికీ యజమాని. మాకంటె గొప్పవారు. మీకు మా అందరికంటె విలువైన వస్త్రాలు భూషణాలు ఉండాలి. కాని మీరుమాత్రం సాధారణమైన వస్త్రాలు ధరించి ఉన్నారు. ఇదేమి చిత్రం!" అన్నారు. వారిమాటలు కోమలమైన మహారాణి హృదయాన్ని గాయపరిచాయి. ఆనాటి రాత్రి మహారాణి రాజుగారితో "ప్రభూ! ఈరోజు నాకు పెద్దఅవమానం జరిగింది. మన పాలనలోని స్త్రీలందరూ విలువైన వస్త్రాభరణాలును ధరిస్తున్నారు. మనం మాత్రం యిలాంటి స్థితిలోనే ఉన్నాము" అన్నది.

మహారాజు "చూడుదేవీ! మనం వ్యవసాయం చేస్తున్నాము. దానిమీద ఎంత డబ్బు వస్తుందో, అంతా ఖర్చు అయిపోతోంది. మరింత ఎక్కువ పంట పండకపోతే నేనేం చెయ్యను? ప్రజల డబ్బును మనసొంత అవసరాలకు ఎలా ఉపయోగిస్తాం? అయినప్పటికీ నీకోసం ఆభరణాలను తీసుకువస్తాను. నువ్వు ఏమాత్రం చింతించకు" అని ఓదార్చాడు.

మరుసటిరోజు మహారాజు ఒక రాజాధికారిని పిలిచి "నువ్వు లంకాపతి రావణుని వద్దకు వెళ్ళి మాకు రావలసిన కప్పం కట్టమని, దానిని

బంగారంరూపంలో ఇవ్వమని మా ఆజ్ఞగా చెప్పు." అని చెప్పి లంకానగరానికి పంపించాడు. రాజాధికారి లంక చేరుకుని రావణుని సభకు వెళ్ళాడు. రావణుడు నువ్వెవరివని ప్రశ్నించాడు. రాజాధికారి తను వచ్చినపని చెప్పాడు. అది విని రావణుడు అట్టహాసం చేస్తూ - "నన్ను కప్పం కట్టమనడానికి నువ్వు, మీరాజు ఎంతటి మూర్ఖులు! మీ మతులు చెడిపోయాయి. రావణుడు కప్పం కట్టడమా? అహహహ... అంటూ అపహాస్యం చేసాడు. రాజాధికారి - "నువ్వు మర్యాదగా కప్పం కట్టితీరవలసినదే. లేకపోతే అనర్థం జరుగుతుంది" అని హెచ్చరించాడు. రావణుడు తిరస్కారంగా "నాముందు నిలబడి యిలా మాట్లాడడానికి ఎంత ధైర్యంరా నీకు. వెంటనే యిక్కడినుంచి వెళ్ళిపో!" అని గద్దించాడు.

రాత్రి రావణుడు అంతఃపురంలో మండోదరితో జరిగినదంతా చెప్పగా, ఆమె - "ప్రభూ! మీరు వెంటనే కప్పం చెల్లించండి" అంది. రావణుడు "ఓ పిచ్చిదానా! నువ్వుకూడా యిలానే మాట్లాడుతున్నావా? నువ్వు నా ప్రభావాన్ని గుర్తించలేవా?" అంటే మండోదరి "ప్రభూ! నామీద దయుంచి ఆ కప్పాన్ని చెల్లించండి. లేకపోతే పెద్ద అనర్థమే జరుగుతుంది. అంటూ రావణుని బ్రతిమాలింది.

పతివ్రత అయిన మండోదరి చక్రవేణుని ప్రభావాన్ని గుర్తించింది. కాని మదోన్మత్తుడైన రావణునికి మండోదరి మాటలు చెవికి ఎక్కలేదు. తెల్లవారిన తరువాత రావణుడు అంతఃపురంనుండి వెళ్ళబోతుంటే, మండోదరి అతనిని వారించి, "స్వామీ! కాసేపు యిక్కడే ఉండండి మీకు చక్రవేణుని మహిమను చూపిస్తాను" అన్నది. అదేమిటో తెలుసుకోవాలని రావణుడు అక్కడే ఆగిపోయాడు.

మండోదరి రోజూ రాజమహలు మేడపై పావురాలకు మేతపెట్టేది. ఈ రోజు రావణుని వెంటబెట్టుకుని, మేడపైకి వెళ్ళి, పావురాలకు గింజలు వేసింది. అవి గింజలు ఏరుకుతింటున్నాయి. మండోదరి పావురాలతో - "ఇకపై మీరు ఒక్క గింజ కూడ తినరాదు. మహారాజు రావణుని ఆజ్ఞ" అంది. పావురాలు ఆమె పలుకులను పట్టించుకోకుండా గింజలు తింటూనే ఉన్నాయి. మండోదరి రావణునివైపు తిరిగి - "చూశారా! మీ ప్రభావం!"

అంది. రావణుడు - "పిచ్చిదానా! రావణుని మహిమను ఈ పక్షులు ఏమి అర్థం చేసుకుంటాయి?" అన్నాడు.

మండోదరి - "మీకిప్పుడే చూపిస్తాను ప్రభూ!" అని పావురాలతో - "మీరు ఒక్కగింజ కూడా ముట్టరాదు. ఇది చక్రవేణుమహారాజు ఆజ్ఞ" అనగానే పావురాలన్నీ గింజలు తినడం మానివేసాయి. ఒక చెవిటిపావురం సగం కొరికిన గింజను పూర్తిగా మింగగానే దాని తల తెగిపడింది. పాపం! మండోదరి మాటలను వినలేకపోవడం వలన, ఆ పావురం ప్రాణాలను కోల్పోయింది. రావణుడు - "నువ్వేదో మాయ చేస్తున్నావు. నేను యిదంతా నమ్మను" అని మండోదరి సలహాను తిరస్కరించి, అక్కడనుండి రాజసభాభవనానికి వెళ్ళిపోయాడు.

చక్రవేణుని రాజాధికారి మరల రావణుని సభకు వచ్చి "రాత్రంతా ఆలోచించి సరైన నిర్ణయం తీసుకున్నావా?" అని అడిగాడు. రావణుడు గట్టిగా నవ్వి - "నువ్వేం మనిషివయ్యా? దేవతలే నా ఆజ్ఞలను మీరక యిక్కడ పనులు చేస్తుంటారు. నన్ను కప్పం కట్టమనే సాహసం నీకెక్కడిది?" అని ప్రశ్నించాడు. రాజాధికారి - "అయితే నాతో ఒకసారి సముద్రతీరానికి రండి." అని రావణుని సముద్రతీరానికి తీసుకువెళ్ళాడు. అక్కడ యిసుకతో లంకాపట్టణ నమూనాను తయారుచేశాడు. లంకకు ఉన్న ద్వారాలలానే ఇసుకతో నాలుగుద్వారాలు తయారుచేశాడు. రాజాధికారి రావణునితో "నీలంక యిలానే ఉంటుందా?" అని అడిగాడు. సమాధానంగా రావణుడు - "అవును లంక యిలానే ఉంటుంది. నువ్వు మంచిశిల్పివి." అని మెచ్చుకోలుగా అన్నాడు. "రాజా! సావధానంగా చూడు. మహారాజు చక్రవేణుని ఆజ్ఞ అంటూ ఒకవైపున ఉన్న నగరద్వారాన్ని పడగొట్టాడు. వెంటనే యిసుకతో చేసిన లంకానగర ద్వారంతో పాటు, నిజంగా లంకానగర ప్రధానద్వారం కూడా నాశనమైపోయింది. రాజాధికారి రావణునితో యిప్పుడైనా కప్పం చెల్లిస్తావా? లంకను పూర్తిగా నాశనం చెయ్యనా?" అని అడిగాడు. రావణుడు భయంతో కప్పం చెల్లించడానికి ఒప్పుకున్నాడు. రాజాధికారి అడిగినంత స్వర్ణాన్ని కప్పంగా చెల్లించాడు.

రాజాధికారి కప్పాన్ని తీసుకువచ్చి, చక్రవేణమహారాజు ఎదుట ఉంచి

వినయంగా నమస్కరించాడు. మహారాజు రాణితో - దేవీ నీకు కావలసినంత బంగారాన్ని తీసుకుని కావలసిన ఆభరణాలను చేయించుకో" అన్నాడు. రాణి - "ఇంత బంగారమెక్కడిది?" అని అడిగింది. ఈ బంగారాన్ని లంకాధిపతి రావణుడు కప్పంగా చెల్లించాడు అని చెప్పాడు. అహంకారి అయిన రావణుడు యింత కప్పమెలా చెల్లించాడని ఆశ్చర్యపడి, ఆ రాజాధికారిని రప్పించి వివరాలు అడిగింది. అతడు జరిగిన వృత్తాంతమంతా వివరించగా, విని రాణి చకితురాలయ్యింది. నాకు అమూల్యమైన ఆభరణం నాభర్తేనని గ్రహించింది. ఇతర ఆభరణాలతో నాకు పనిలేదు. ఈ అలంకరణమంతా నాభర్తకోసమే కదా. లోకకంటకుడైన రావణాసురుణ్ణే భయభీతుణ్ణి చేసిన నా భర్తకంటె విలువైన ఆభరణం యింకెక్కడ ఉంటుంది నాకు ఈ స్వర్ణంతో పనిలేదు అనుకొని, రాజాధికారితో - "నాకు ఈ స్వర్ణంతో పనిలేదు. దీనిని తీసుకువెళ్ళి రావణునికే యిచ్చివెయ్యి. చక్రవేణుమహారాజు నీ కప్పాన్ని స్వీకరించలేదని అతని స్వర్ణాన్ని అతనికే యిచ్చివెయ్యి" అని చెప్పింది.

# లోభఫలితము

పూర్వకాలం ఒక ఊరిలో ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. ఆయనకు పెళ్ళికి ఎదిగిన కూతురు ఉంది. ఆమెకు వివాహం చేయడానికి సంకల్పించాడు. అయితే అతనివద్ద అంత ధనం లేదు. హరికథలు చెప్పి, వచ్చిన ధనంతో కుమార్తె వివాహం చేయాలనుకున్నాడు.

ఒకరోజు ఆ ఊరి రామాలయంలో హరికథ చెప్పడం ప్రారంభించాడు. నాకథను శ్రోతలెవరు విన్నా, లేకున్నా, శ్రీరామచంద్రప్రభువు వింటాడన్న ఆశతో కథ చెప్తున్నాడు. నెమ్మదినెమ్మదిగా హరికథ వినే శ్రోతలు పెరగసాగారు.

ఆ ఊరిలో ఒక పిసినారి కోమటి ఉండేవాడు. అతడు కూడా ఆరోజు గుడికి వచ్చాడు. ఆలయంలో ప్రదక్షిణ చేస్తుండగా, అతడికి గర్భగుడిలోంచి ఏదో శబ్దం వినిపించింది. జాగ్రత్తగా వింటే ఎవరో యిద్దరు మాట్లాడుకుంటున్నట్టు అన్పించింది. కోమటి గోడకు చెవి ఆనించి ఆ మాటలను ఆలకించాడు. గర్భాలయంలో శ్రీరాముడు, హనుమంతుడు మాట్లాడుకుంటున్నారు. శ్రీరాముడు హనుమంతుని - "ఈ బ్రాహ్మణుడి కుమార్తె వివాహానికి కావలసిన ధనాన్ని ఏర్పాటు చెయ్యి" అని ఆదేశించాడు. హనుమంతుడు "అలానే ప్రభూ! ఈ బ్రాహ్మణునికి వంద రూపాయలు అందజేస్తాను" అని చెప్పాడు. కోమటి వీరిద్దరి మాటలు విన్నాడు. అతనికొక దుర్బుద్ధి పుట్టింది.

హరికథ ముగిసిన తర్వాత బ్రాహ్మణుని కలుసుకొని, 'స్వామీ! మీకు భూరిదక్షిణ లభించిందా.' అని అడిగాడు. బ్రాహ్మణుడు - "ఈరోజు కథ వినడానికి ఎక్కువమంది రాలేదుకదా. మరి డబ్బు ఎలా వస్తుంది?" అన్నాడు. కోమటి - "స్వామీ! నాదగ్గర ఒక ఉపాయముంది. రేపు మీకు ఎంత దక్షిణ లభిస్తే, అంతా నాకు యివ్వండి. నేను మీకు యాభైరూపాయలు యిస్తాను" అని ప్రతిపాదించాడు. బ్రాహ్మణుడు అందుకు అంగీకరించాడు. "హరికథ చెబితే ఎలానూ అంత డబ్బురాదు. ఈ కోమటి యాభై రూపాయలు యిస్తానన్నాడు కదా." అని సంతోషించాడు. ఆ రోజుల్లో యాభై రూ॥లకు

ఎంతో విలువ ఉండేది.

"హనుమంతుడు ఎలాగైనా శ్రీరామచంద్రప్రభువు ఆజ్ఞను అనుసరించి, ఆ బ్రాహ్మణునికి వంద రూపాయలు యిస్తాడు కదా. ఆ వంద రూపాయలు నేను తీసికొని, బ్రాహ్మణునికి యాభైరూపాయలు యిచ్చేస్తాను. నాకింకా యాభైరూపాయలు మిగులుతాయి" అని కోమటి ఆనందించాడు. లోభి దృష్టి ఎప్పుడూ డబ్బుమీదే ఉంటుంది కదా! శ్రీరాముని దయాళుత్వము, ప్రభువు హనుమంతునితో అన్న మాటలు విన్నా అతడికి భగవద్భక్తి జాగృతం కాలేదు. సరికదా, భగవంతుడు బీదబ్రాహ్మణునికి అనుగ్రహించిన ధనాన్ని తస్కరించాలనే దుర్బుద్ధి పుట్టింది.

మరునాడు హరికథ ముగిసిన తరువాత కోమటి బ్రాహ్మణుని వద్దకు వచ్చాడు. అతడి మనసులో వందరూపాయలు సొంతం అవుతున్నాయి కదా అనే ఉత్సాహం ఉరకలు వేస్తోంది. బ్రాహ్మణుడు కోమటితో - అయ్యా! ఈరోజు దక్షిణ బాగా తక్కువ వచ్చింది. ఆరేడు రూపాయలు మాత్రమే వచ్చాయి. వాటిని తీసికొని, మీమాటప్రకారం నాకు యాభైరూపాయలు యివ్వండి. అన్నాడు. కోమటి చేసేది లేక బ్రాహ్మణునికి యాభైరూపాయలు యిచ్చాడు. అతనికి యాభైరూపాయలు నష్టం వచ్చింది.

కోమటికి హనుమంతునిపై పట్టరాని కోపం వచ్చింది. హనుమంతుడు భగవంతుడైన శ్రీరామునికి అబద్ధం చెప్పాడని అనుకున్నాడు. గుడిలోకి వెళ్ళి కోపంతో హనుమంతుని విగ్రహాన్ని కొట్టబోయాడు. అంతే కోమటి చెయ్యి హనుమంతుని విగ్రహానికి అతుక్కుపోయింది. కోమటి భయపడిపోయాడు. ఎంతలాగినా అతనిచెయ్యి విగ్రహం నుండి ఊడటం లేదు. హనుమంతుడు పట్టినపట్టును విడిపించగలవాడెవ్వడు? ఇంతలో అతనికి కొన్ని మాటలు విన్పించాయి. అతడు శ్రద్ధగా విన్నాడు. శ్రీరాముడు - "బ్రాహ్మణునికి ద్రవ్యం ఏర్పాటు చేసావా?" అని హనుమంతుని అడిగాడు. హనుమంతుడు - "రామచంద్రా! యాభైరూపాయలు అతనికి అందజేసాను. మరొక యాభైరూపాయల కోసం కోమటిని పట్టుకున్నాను. ఆ డబ్బు యివ్వగానే అతణ్ణి వదిలేస్తాను" అని సమాధానం చెప్పాడు. వారిద్దరి మాటలు విన్న కోమటి తనను ఈ స్థితిలో ఎవరైనా చూస్తే పరువు

పోతుందనుకుంటూ, "ఆంజనేయా! నన్ను క్షమించివదిలిపెట్టు. మిగిలిన యాభైరూపాయలు ఆ బ్రాహ్మణునికి సమర్పించుకుంటాను" అని గట్టిగా అన్నాడు. అలా అనటంతోటే అతని చెయ్యి ఊడివచ్చింది. కోమటి తన లోభానికి తగిన శాస్తి జరిగిందని పశ్చాత్తాపపడి, బ్రాహ్మణునికి మరొక యాభైరూపాయలను ఇచ్చివేసాడు.

*నీతి : అత్యాశ అనర్థానికి దారి తీస్తుంది. సజ్జనులను మోసం చేస్తే భగవంతుడు క్షమించడు.*

# సన్యాసి రాజు అయితే?

ఒక సన్యాసి ఉండేవాడు. ఆయన దేశసంచారం చేస్తూ ఒకరోజు ఒక నగరానికి వెళ్ళాడు. అప్పటికే చీకటి పడటం వల్ల ఆ నగరద్వారం మూసివేశారు. సన్యాసి తెల్లవారిన తరువాతే పట్టణంలోకి వెళ్ళవచ్చుననుకొని, ఆ రాత్రికి, అక్కడే నిద్రించాడు.

దైవయోగం వల్ల ఆ రాజ్యాన్ని పాలించే రాజు, ఆరోజు స్వర్గస్థుడయ్యాడు. అతనికి సంతానం లేకపోవడం వల్ల, బంధువులు దాయాదులు ఈ రాజ్యం నాకు చెందుతుందంటే నాకు చెందుతుంది అని తగవులాడుకున్నారు. చివరకు రేపు ఉదయం నగరప్రధానద్వారం తెరవగానే మొట్టమొదట ఎవరైతే పట్టణంలోకి ప్రవేశిస్తారో అతడినే మహారాజుగా చేయాలని నిర్ణయించుకున్నారు. అప్పటికి ఆ వివాదం సమసింది.

తెల్లవారగానే నగరప్రధానద్వారం తెరుచుకుంది. సాధువు నిద్రలేచి నగరంలోకి ప్రవేశించాడు. వెంటనే పట్టపుటేనుగు సన్యాసిని తొండంతో పైకెత్తి, అంబారీలో కూర్చోబెట్టింది. ప్రజలందరూ జయజయధ్వానాలు చేసారు. సన్యాసిని బాజాభజంత్రీలతో ఉరేగిస్తూ రాజసభకు తీసుకువచ్చారు. సన్యాసి ఆశ్చర్యంతో - 'యిదంతా యేమటి?' అని అడిగాడు. వారు "మహారాజా! ఈరోజు నగరంలోకి మొట్టమొదట ఎవరు అడుగుపెడతారో వారినే మా ప్రభువుగా భావించి, రాజ్యాధికారాన్ని వారికి అప్పగించాలని నిర్ణయించుకున్నాం. ఈ రోజు ముందుగా నగరంలోకి మీరే ప్రవేశించారు. అందుచేత మీరే మా మహారాజు" అన్నారు.

సన్యాసి నవ్వుమోముతో అందుకు అంగీకరించాడు. సన్యాసి స్నానసంధ్యాదికములు పూర్తిచేసుకుని, సేవలను పిలిచి ఒకపెట్టె తెమ్మన్నాడు. సేవకులు పెట్టె తేగానే తన కాషాయ వస్త్రాలను, ఏకతారను అందులో ఉంచి రాజోచితమైన వస్త్రాలను ధరించాడు. ఆపెట్టెకు తాళం వేసి, దాన్ని భద్రపరిచాడు. ఆనాటినుండి సన్యాసి రాజ్యాన్ని ఎంతో ప్రజారంజకంగా పాలించసాగాడు.

సన్యాసికి ఏ కోరికలు, ఏచింతలు లేవు. అలానే ఏ భోగాలు

అనుభవించాలనే తాపత్రయం లేదు. రాజ్యపాలనను భగవత్కార్యంగా భావించి శ్రద్ధగా చేయసాగాడు. ఫలితంగా రాజ్యం ఎంతో అభివృద్ధిని సాధించింది. ప్రజల ఆదాయం పెరిగింది. రాజకోశాగారం సమృద్ధిగా నిండింది. ప్రజలు ఎంతో సుఖంగా ఉన్నారు. పొరుగుదేశపురాజు యీవిషయాలన్నీ తెలుసుకొన్నాడు. సన్యాసికి రాజ్యాన్ని పాలించడం తెలుసుగాని, యుద్ధం చెయ్యడం చేతకాదుకదా అనుకున్నాడు. రాజ్యాన్ని ఆక్రమించుకుందామని దండెత్తివచ్చాడు. సైనికులు సన్యాసికి పొరుగురాజు యుద్ధానికి వస్తున్నాడని చెప్పారు. సన్యాసి - "సరే, రానీయండి. యుద్ధం జరగదు" అని చెప్పాడు. శత్రుసైన్యం మరింత దగ్గరకు వచ్చిందని సైనికులు చెప్పారు. సన్యాసి నిశ్చింతగా ఉన్నాడు. కొంతసేపటికి తర్వాత శత్రురాజు రాజమహలు సమీపానికి వచ్చాడని తెలియజేశారు. సన్యాసి ఆ రాజు వద్దకు దూతను పంపి, అతడు వచ్చిన కారణాన్ని తెలుసుకు రమ్మన్నాడు. యుద్ధంలో రాజ్యాన్నిజయించి, వశం చేసుకోవడానికి వచ్చామని శత్రురాజు సమాధానం పంపాడు.

సన్యాసి రాజ్యాన్ని సాధించడానికి యుద్ధమే చేయవలసిన పని లేదన్నాడు. సైనికులను పిలిచి తనపెట్టెను తీసుకురమ్మన్నాడు. వారు అలానే తీసుకువచ్చారు. సన్యాసి ఆ పెట్టెను తెరిచి, అందులోని కాషాయవస్త్రాలను తీసుకున్నాడు. రాజయోగ్యమైన వస్త్రాభరణాలను త్యజించి, కాషాయవస్త్రాలను ధరించాడు. ఏకతారను చేతిలోకి తీసికొన్నాడు. శత్రురాజును రాజసభకు పిలిపించి - యింతకాలం యీ రాజ్యాన్ని నేను పరిపాలించాను. ఇప్పుడు నీవంతు. ఇంతకాలం ఈరాజ్యాన్ని పాలించేవారు లేరు కనుక నేను రాజుగా ఉన్నాను. ఇప్పుడు నువ్వు ఈ సింహాసనాన్ని స్వీకరించు. వ్యర్థంగా యుద్ధాల పేరుతో అమాయకుల ప్రాణాలను తీయాల్సిన అవసరం ఏముంది? అంటూ నవ్వుమోముతో అలా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

శత్రురాజులకు రాజ్యాన్ని అప్పగించమని ఈ కథ ఉద్దేశ్యం కాదు. సన్యాసిలాగ మనకు ఎదురైన పనిని భగవత్కార్యంగా భావించి, ఫలాపేక్ష లేకుండా పనిచెయ్యాలి? స్వార్థాన్ని త్యజించాలి. అహంకార, మమకారాలను వర్జించాలి అని ఈకథ సందేశమిస్తుంది.

# మోక్షాన్ని ఎవరు యిప్పించగలరు?

ఒకానొక రాజు ఉండేవాడు. ఆయన - భాగవతాన్ని విన్నంతమాత్రం చేతనే పరీక్షిత్తుకు పరమపదం ప్రాప్తించిందని విన్నాడు. మనసులో "నేను కూడా భాగవతాన్ని వింటే, నాకు కూడా ఉత్తమగతి కల్గుతుంది కదా" అని భావించాడు. వెంటనే ఒక పండితుని పిలిపించి భాగవత పారాయణ చెయ్యమని కోరాడు. రాజు ఏడురోజులు నియమబద్ధంగా భాగవతకథను ఆలకించి, పరిసమాప్తి చేశాడు.

మరుసటిరోజు కథాగానం చేసిన పండితుని పిలిచి - "స్వామీ! మీరు భాగవతాన్ని ఎంతో శ్రద్ధగా విన్పించారు. నేను కూడ ఎంతో శ్రద్ధగా ఆలకించాను. మరి నాకెందుకు ఉత్తమగతులు కలుగలేదు?" అని ప్రశ్నించాడు. ఆ పండితుడు - "ప్రభూ! మీప్రశ్నకు నావద్ద సమాధానం లేదు. బహుశా నా గురువు మీ సందేహాన్ని తీర్చగలరు" అన్నాడు. మహారాజు గురువుగారిని సాదరంగా రాజసభకు తీసుకురమ్మని చెప్పాడు. పండితుడు తన గురువును తీసుకువచ్చాడు. మహారాజు గురువుకు నమస్కరించి, అతిథి సత్కారాలు నెరపి తన సందేహాన్ని ఆయన ముందుంచాడు. "గురువర్యా! భాగవతాన్ని విన్నా నాకెందుకు ముక్తి లభించలేదు?" అని ప్రశ్నించాడు.

గురువు రాజుతో - "ప్రభూ! కాసేపు మీ అధికారాన్ని నాకు యివ్వండి." అని అడిగాడు. రాజు అలానే చేశాడు. గురువు రాజును, పండితుణ్ణి బంధితులను చేశాడు. అప్పుడు పండితునితో - "ఓయీ! రాజును బంధవిముక్తుణ్ణి చెయ్యి" అని ఆదేశించాడు. పండితుడు - ఆచార్యా! స్వయంగా నేను బంధితుణ్ణై ఉన్నాను. మహారాజును నేనెట్లు బంధవిముక్తుణ్ణి చెయ్యగలను? అని తన అశక్తతను తెలియజేశాడు. గురువు నవ్వి "మహారాజా! మీ ప్రశ్నకు సమాధానం లభించిందా?" అన్నాడు.

రాజు సంభ్రమంతో - "గురుదేవా! నాకేమీ అర్థంకాలేదు" అన్నాడు. గురువు - "రాజా! స్వయంగా బంధితుడైఉన్న వ్యక్తి ఎదుటి వారిని బంధాలనుండి ఎలా తప్పించగలడు? అలానే ముక్తుడు కానివాడు మరొకరికి

ముక్తిని ఎలా ప్రసాదించగలడు. సిద్ధుడు, ముక్తసంగుడైనవాడే, శ్రద్ధాళువుకు ఉత్తమగతిని కల్పించగలడు. అని వివరించాడు. శుకమహర్షి వంటి ముక్తసంగుడు, పరీక్షిత్తు వంటి శ్రద్ధాళువు ఉన్నప్పుడే ముక్తి లభిస్తుందని భావము.

*నీతి : జ్ఞానియైన గురువు, శ్రద్ధగల శిష్యుడు సమకూరినప్పుడే మోక్షం లభిస్తుంది.*

# పొదుపు మహిమ

ఒక నగరంలో పెద్ద వర్తకుని యిల్లు ఉంది. అతనింటికి ప్రక్కనే ఒకపేదవాని యిల్లు ఉంది. ఆ రెండిళ్ళ ఆడవాళ్ళు కలుసుకున్నప్పుడల్లా - 'ఈవేళ ఏం వండారు?'' అని అడిగేవారు. ధనవంతుడైన వ్యాపారి భార్య ఈవేళ పప్పు వండాననో లేక ఏదో కూర చేశాననో చెప్పేది. బీదవాని భార్యమాత్రం ఎప్పుడూ - "ఇవాళ హల్వా చేశాననో, పూరీ చేసాననో పాయసం చేసాననో చెప్పేది. ఒకరోజు వ్యాపారి భార్య, తన భర్తతో - "ఇంత డబ్బుండి మనమేమో సాధారణమైన భోజనం చేస్తున్నాము. కాని పక్కింటివాళ్ళు ఎక్కువడబ్బు లేకపోయినా నవకాయ పిండివంటలతో భోజనం చేస్తుంటారు. ఇదేం చిత్రమో!'' అంది. వ్యాపారి - "వారికింకా పొదుపు మహిమ తెలియదు. అందుచేత వారు అలాంటి భోజనం చేస్తున్నారు'. అన్నాడు. అతని భార్య ఆశ్చర్యంగా 'పొదుపు మహిమ' ఏమిటని అడిగింది. వ్యాపారి "నేనంతా వివరిస్తాను. నువ్వు చూస్తుండు.'' అన్నాడు.

మరునాడు వ్యాపారి తన భార్యను తొంభైతొమ్మిది రూపాయలు తీసుకురమ్మన్నాడు. ఆమె తీసుకువచ్చింది. వ్యాపారి ఆ డబ్బును గుడ్డసంచిలో మూటగట్టి దాన్ని రాత్రిపూట ఎవరూ చూడకుండా ప్రక్కయింటిలోకి విసిరివేయమని చెప్పాడు. ఆమె అలానే చేసింది. తెల్లవారగానే బీదవాడు తన ముంగిట్లో ఏదో సంచీ పడిఉండటం చూసాడు. దాన్ని లోపలకు తీసుకువెళ్ళి, విప్పిచూడగా దానిలో తొంబది తొమ్మిది రూపాయలు ఉన్నాయి. ఆత్రుతతో మరల లెక్కపెట్టగా అంతే ఉన్నాయి. వందకి ఒక్క రూపాయి తక్కువగా ఉంది. బీదవాడు, వానిభార్య- "ఎలాగైనా రెండు, మూడు రోజులు కష్టపడి ఖర్చుతగ్గించుకుంటే ఒక రూపాయి దాచవచ్చు. అప్పుడు వందరూపాయలు అవుతాయి'' అనుకున్నారు. అలానే రెండురోజులు కొంచెం పొదుపుగా వండి, రూపాయిని దాచగలిగారు. వారి కళ్ళముందు రూపాయినాణెం తళతళలాడుతూ కనబడింది. వారిద్దరూ "పొదుపుతో రెండుమూడు రోజులలో ఒక రూపాయి సంపాదించగలిగాము. మనం

ముందునుంచీ యిలా పొదుపుగా ఉంటే ఎన్ని రూపాయలు దాచేవాళ్ళమో. ఇప్పటిదాకా ఎలానూ ఏమీ సంపాదించలేదు. ఇప్పటినుంచైనా పొదుపుగా ఉండి కొంచెం కొంచెం డబ్బు దాచుకుందాం' అనుకున్నారు.

కొన్నిరోజులు పోయిన తర్వాత, వ్యాపారి తన భార్యతో "నువ్వు పక్కింటి ఆవిడ దగ్గరకు ఏదో పనిమీద వెళ్ళినట్టుగా వెళ్ళి, ఇవాళ ఏం వండుకున్నారో అడిగిరా" అని చెప్పి పంపించాడు. ఆమె అలానే అడుగగా, బీదవాని భార్య - "ఇవాళ పచ్చడి చేసాను. దానితోనే చపాతీలు తినేస్తాము" అని చెప్పింది. అప్పుడు వ్యాపారి భార్యకు, తన భర్త చెప్పిన "పొదుపు మహిమ" అర్థమయ్యింది.

**"గ్యాన్ బఢై గుణవాన్ కే సంగతి, ధ్యాన్ బఢై తపసీసంగ్ కీన్హై ।**
**మోహ్ బఢై పరివార్‌కీ సంగతి, లోభక్ష్ బఢై ధన్ మే చిత్ దీన్హై**
**క్రోధ్ బఢై నర్ మూఢ్ సంగతి, కామ్ బఢై తియ్ కో సంగ్ కీన్హై**
**బుద్ధి బిబేక్ బిచార్ బఢై 'కబి దీన్' సుసజ్జన్ సంగతి కీన్హై ॥**

గుణవంతునితో స్నేహం వల్ల జ్ఞానము, తాపసి సాంగత్యం వల్ల ధాన్యము, కుటుంబంతో ఉండటం వలన మోహము, ధనచింతనతో మునిగి ఉండటం వల్ల లోభము(పిసినారితనం) మూఢులతో ఉండటం వలన కోపము, స్త్రీల వలన కామము సజ్జన సాంగత్యం వల్ల, బుద్ధి, వివేకము, ఆలోచన వృద్ధిచెందుతాయి.

# గాడిదలను మనుషులుగా మార్చుట

ఒక ఊరిలో ఒక వైద్యుడుండేవాడు. అతడు ఎల్లప్పుడూ తనతో ఉండేలా ఒక సహాయకుని ఏర్పాటు చేసుకున్నాడు. ఒకరోజు ఏదో పనిమీద పొరుగూరు వెడుతుండగా ఏదో కారణంమీద వైద్యుడు సహాయకుని తిట్టడం మొదలుపెట్టాడు. "ఒరే, నీకు తెలియడం లేదు. నువ్వెవరివో తెలుసా? మొదట్లో నువ్వు గాడిదలా ఉండేవాడివి. నేను నిన్ను మనిషిలా చేశాను. నేను నీకింత ఉపకారం చేసినా, నువ్వు నా మాట వినడంలేదు...." అంటూ తిడుతున్నాడు.

ఆ దారిలోనే వెడుతున్న ఒక చాకలి, ఆ వైద్యుడి మాటలన్నీ విన్నాడు. అతడు వైద్యుని దగ్గరకు వెళ్ళి - "అయ్యా! నావద్ద ఎన్నో గాడిదలు ఉన్నాయి. మీరు గాడిదలను మనుషులుగా తయారుచేస్తారా? నేను రెండు గాడిదలను తీసుకువస్తాను. దయచేసి మీరు వాటిని మనుషులుగా మార్చండి" అని అడిగాడు. వైద్యుడు ఆ చాకలివాడు అమాయకుడని గ్రహించాడు. వాణ్ణి తెలివిగా మోసం చేయాలనుకున్నాడు. బాగా ఆలోచించుకుని, చాకలివాడితో, - "సరే కానీ అందుకు బాగా ఖర్చు అవుతుంది. ఒక గాడిదను మనిషిగా మార్చడానికి వందరూపాయలు అవుతాయి" అన్నాడు. అమాయకుడైన చాకలివాడు. "సరేబాబూ! ఇప్పుడే యిస్తాను" అంటూ రెండువందల రూపాయలు తీసి యిచ్చాడు. వైద్యుడు ఆ రెండు గాడిదలను తీసుకువెళ్ళిపోయాడు.

వైద్యుడు ఆ గాడిదలను మంచి లాభానికి అమ్మివేసాడు. చాకలి వచ్చినప్పుడు అతనితో నీ గాడిదలు మనుషులుగా మారుతున్నాయి. ఇప్పుడు వాటికి మందుపెట్టాను. నువ్వు చూడడానికి వీలులేదు అన్నాడు. చాకలి వెళ్ళిపోయాడు. అతడు తన పనులతో వీలుచిక్కక రెండు మూడు నెలల తర్వాత వైద్యుడి దగ్గరకు వచ్చాడు. వైద్యుడు కొత్త పన్నాగం పన్నాడు. "నువ్వు ఇన్ని రోజులు రాలేదేమిటి? నీ గాడిదలు ఎప్పుడో మనుషులుగా మారిపోయాయి. మందు మోతాదు ఎక్కువ అవడం వల్ల వాటికి బాగా గర్వం పెరిగిపోయింది. నువ్వు వచ్చేదాకా నాదగ్గర ఉండకుండా, తమబ్రతుకు

తాము బ్రతుకుతామని చెప్పి వెళ్ళిపోయాయి. ఒంటినిండా ఎక్కువరోమాలు ఉన్న గాడిద మౌల్వీగా మారిపోయి పాఠశాలలో పిల్లలకు పాఠాలు చెప్తూంటే, రెండవగాడిద స్టేషన్‌మాష్టరుగా పనిచేస్తోంది. కావలిస్తే నువ్వే వెళ్ళిచూడు'' అన్నాడు.

అమాయకుడైన చాకలి ముందుగా పాఠశాలకు వెళ్ళాడు. దారిలోనే కొంచెం గడ్డికూడా కొనుక్కువెళ్ళాడు. వైద్యుడు చెప్పినట్లు పెద్దగెడ్డం ఉన్న మౌల్వీ దగ్గరకు వెళ్ళి, గడ్డి చూపిస్తూ "దూ..దూ..దూ..దా..దా.. ఈ గడ్డి తిను" అన్నాడు. మౌల్వీకి చాలా కోపం వచ్చింది. "ఎవరురా నువ్వు? ఏం చేస్తున్నావ్? వీడెవడో పిచ్చివాడిలా ఉన్నాడు. వీడిని బయటకు తోసేయండి" అని గెంటసాగాడు. చాకలి - "నేను వందరూపాయిలు ఖర్చుపెట్టి గాడిదలా ఉండే నిన్ను మనిషిలా మార్చాను. నన్ను పిచ్చివాడినంటావా?'' అన్నాడు. మౌల్వీ పట్టరానికోపంతో చాకలిని బయటకు తోసివేశాడు.

చాకలి స్టేషనుమాస్టరు దగ్గరకు వెళ్ళి, ముందు చేసినట్టే గడ్డి చూపించి "దూ..దూ..దూ..దా..దా.. ఇదిగో ఈ గడ్డి తిను'' అన్నాడు. స్టేషన్‌మాస్టరు "వీడెవడు? ఇలా చేస్తున్నాడు?" అంటే, చుట్టుప్రక్కలవారు ఇతడు పాఠశాలకు కూడా వెళ్ళాడు. అక్కడా ఇలానే చేశాడు. అని చెప్పారు. స్టేషన్‌మాస్టరు కూడా చాకలిని పిచ్చివాడుగానే భావించి అక్కడనుండి వెళ్ళగొట్టాడు.

పాపం. ఆ చాకలి ఏమీ తోచక, తిరిగి వైద్యుని దగ్గరకు వచ్చి వారిద్దరూ నన్ను పిచ్చివాడంటున్నారు. ఇప్పుడు నేనేం చెయ్యను అని లబోదిబోమన్నాడు. వైద్యుడు - నేను ముందే చెప్పాను కదా. నువ్వు చాలా ఆలస్యం చేశావు. అందుకే వారు నిన్ను గుర్తుపట్టలేదు. వారు నా అదుపులో లేరు. నేనేం చెయ్యను? అని తప్పించుకున్నాడు.

ఈవిధంగానే మానవుడు అహంకారంతో ప్రవర్తిస్తాడు. నేనే గొప్పజ్ఞానిని. నేనెంతో తెలివైనవాడిని. ఎంతో చదువుకున్నాను. అని గర్విస్తాడు. కాని అతనికి తను పూర్వజన్మలో ఎవరో తెలియదు. వచ్చేజన్మలో ఏమవుతాడో తెలియదు. కాని ఇప్పుడు మాత్రం ఎంతో అహంకారాన్ని ప్రదర్శిస్తాడు. 'ఎవరికీ ఏమీ తెలియదు. అన్నీ నాకే తెలుసు' అని భ్రమిస్తాడు. ఎవరి మాటా విన్పించుకోడు. కథలోని గాడిదలలానే గర్వం ఎక్కువైతే మనిషి ఎవరినీ లక్ష్యపెట్టడు.

# సుఖనిద్ర

ఒక సాధువు లోకసంచారం చేస్తూ, ఒక పట్టణం దగ్గరకు వచ్చాడు. అప్పటికి బాగారాత్రి అయ్యింది. పట్టణద్వారాలు మూసివేయబడ్డాయి. రాత్రి అవటం చేత బాగా చల్లగాలి వీస్తోంది. సన్యాసి వద్ద ఉన్నిదుస్తులు లేవు. అతడు చలికి వణికిపోతున్నాడు. అతడు నిద్రపోవడానికి స్థలం వెతుక్కుంటున్నాడు. అతనికి ఒక ఇటుకల బట్టీ కనిపించింది. దానిలోపల యింకా కొంచెం వేడిగానే ఉంది. సన్యాసి - "ఆహా! ఈ రాత్రి నిద్రపోవడానికి నాకు మంచిచోటు దొరికింది. అని సంతోషిస్తూ, బట్టీలోకి దూరి, హాయిగా నిద్రపోయాడు.

తెల్లవారింది. సన్యాసి నిద్రలేచాడు. ఆ బట్టీ ఒక రాజభవనానికి సమీపంలో ఉంది. మహారాజుగారు నిద్రలేచి తనతో ఉన్నవారిని "రాత్రి ఎలా గడిచింది?" అని అడిగారు.సన్యాసి బట్టీ లోపల కూర్చుని, ఎవరో తననే అడిగారనుకుని "ఆహా! కొంచెం నీకు గడిచినట్టు, కొంచెం నీకంటే బాగాను గడిచింది" అని చెప్పాడు. రాజుగారు ఎవరిదో కొత్తగొంతును విని ఆశ్చర్యపోయారు. మళ్ళీ అలానే ప్రశ్నించారు. అదే సమాధానం వచ్చింది. రాజుగారు సైనికులను పిలిచి ఆ సమాధానం ఎవరు చెప్పారో, వాడిని పట్టి తీసుకురమ్మని ఆజ్ఞాపించారు. వారికి కనుచూపుమేరలో ఎక్కడా మనిషి జాడ అగుపడలేదు. వారు "రాత్రి ఎలా గడిచింది?" అని ప్రశ్నిస్తే, పాత సమాధానమే వస్తోంది. సమాధానం వచ్చిన దిక్కుకుపోగా, అక్కడ ఒక ఇటుకబట్టీ కనబడింది. దాని లోపల ఎవరో ఉండిఉంటారని అనుకొని, లోపలకు పోయిచూడగా, అక్కడ ఒక సన్యాసి కూర్చుని ఉన్నాడు. ఆయనే రాజుగారికి సమాధానం చెప్పిన వ్యక్తి అని నిర్ధారించుకుని, సన్యాసితో - "నిన్ను తీసుకురమ్మని మహారాజు ఆజ్ఞాపించారు" అని చెప్పారు. సన్యాసి - "నేనేం అపరాధం చేసాను? మీరాజుగారు నన్నెందుకు తీసుకురమ్మన్నారు?" అని అడిగాడు. సైనికులు - "మీరు ఏదో అపరాధం చేశారని కాదు. మీతో కొంచెం మాట్లాడాలనుకుంటున్నారు" అని వివరించారు.

ఇటుకబట్టీలో నిద్రపోవడం వల్ల సన్యాసి ఒంటినిండా దుమ్ము పేరుకుపోయింది. అక్కడక్కడా మసి అంటుకుంది. అతడు అలానే రాజాగారి దగ్గరకు వెళ్ళాడు. సైనికులు సన్యాసిని మహారాజు ఎదురుగా నిలబెట్టారు. మహారాజు సింహాసనంపై నుండి లేచి, సన్యాసికి నమస్కరించి నా ప్రశ్నకు సమాధానమిచ్చింది మీరేనా? అని అడిగాడు. సన్యాసి - "నాకు ఏదో ప్రశ్న వినబడింది. ఎవరో నన్నే అడిగారనుకుని బదులిచ్చాను. ఆ అడిగినది మీరని నాకు తెలియదు" అన్నాడు.

మహారాజు - "రాత్రి ఎలా గడిచిందని అడిగితే కొంచెం నీకు గడిచినట్టు, కొంచెం నీకంటె మెరుగ్గాను గడిచింది. అని మీరు బదులిచ్చారు. రాత్రి నాకు గడిచినట్లుగానే, మీకూ ఎలా గడుస్తుంది? నేను సకలసౌకర్యాలు ఉన్న రాజభవనంలో నిద్రించాను. మీరేమో ఇటుకల బట్టీలో పడుకున్నారు. మనిద్దరికీ రాత్రి ఒకేవిధంగా ఎలా గడుస్తుంది" అని ప్రశ్నించాడు.

సన్యాసి - "మహారాజా! మీరు రాజభవనంలో మెత్తటిశయ్యపై నిద్రపోయారు. నేను మెత్తటి మట్టిలో నిద్రపోయాను. నిద్రపోయాక మీకు రాజభవనం గుర్తులేదు. నేను నిద్రపోయాక, నాకు ఇటుకలబట్టీ గుర్తులేదు. మరి మనిద్దరికీ రాత్రి ఒకలానే గడిచింది కదా" అన్నాడు.

మహారాజు - 'మరి నాకన్నా హాయిగా రాత్రి గడిపానన్నారు కదా! అదెలా?' అన్నాడు. సన్యాసి చిరునవ్వు నవ్వుతూ - "నిద్ర లేవగానే రాజ్యపాలనకు సంబంధించిన వంద సమస్యలు మిమ్మల్ని చుట్టుముట్టాయి. కాని నాకు ఏచింతా లేదు. అందువల్ల రాత్రి నిశ్చింతగా, సుఖంగా గడిచింది" అని వివరించాడు.

**"చాహ్ గయీ చింతా మిటీ, మనువా బేపర్‌వాహ్ ।**
**జిన్ కో కుఛ్ న చాహియే, సో సాహన్ కే సాహ్ ॥**

కోరికలు, చింతలు లేని మనిషి నిశ్చింతగా గడుపుతాడు. ఏకోరికలు అక్కరలేనివాడు గొప్పవారికన్నా గొప్పవాడు."

# అత్తవారింటి పద్ధతి

ఒక అమ్మాయికి కొత్తగా పెళ్ళి అయ్యింది. ఆమె ఎంతో మంచిది. సుగుణాలప్రోవు. ఆమెను అత్తవారింటికి తీసుకువెళ్ళారు. ఆ ఇంటిలో ఆమెభర్త, అత్తగారు, అత్తగారి అత్తగారయిన ఓ ముసలి బామ్మ ఉండేవారు. కొత్తకోడలు అత్తగారింటిలో అందరినీ గమనించింది. తన అత్త, ఆమె అత్తగారిని రాచిరంపాన పెడుతుండేది. 'ఇంటికి పెద్ద' 'ముసలి ఆవిడ' అనయినా చూడకుండా అవమానపరిచేది. కొట్టేది, తిట్టేది, తిండికూడ సరిగా పెట్టేది కాదు. ఇదంతా కొత్తకోడలికి నచ్చలేదు. మామ్మమీద జాలిపడింది. అత్తగారికి ఎలాగైనా నచ్చచెబుదామనుకుంది. కాని నిన్నుగాక మొన్న వచ్చిన పిల్ల నాకు పాఠాలు చెప్తుందా అని అత్తగారు కోపగించుకుంటుందేమోనని ఆలోచించింది. చివరికి ఒక ఉపాయం తోచింది. ఆమె అత్తగారికి ఏమీ చెప్పలేదు. రోజూ ఇంటిపని అంతా అయిపోయాకా, బామ్మగారి దగ్గరకు వెళ్ళి కూర్చొని, ఆవిడకు కాళ్ళునొక్కేది. కావలసిన ఉపచారాలన్నీ చేసేది. కొత్తకోడలు బామ్మ దగ్గర ఎక్కువసేపు ఉండడం అత్తగారికి నచ్చలేదు. ఒకరోజు అత్తగారు కోడలిని పిలిచి - "నువ్వు ఆ ముసలిదాని దగ్గర ఎక్కువసేపు ఎందుకుంటున్నావు? అక్కడ నీకేం పని?" అని నిలదీసింది. కోడలు - "ఏమండీ! ఏమైనా పని ఉన్నదా?" అని అడిగింది. అత్తగారు - పనుల సంగతి పక్కనపెట్టి నువ్వు అక్కడకు ఎందుకు వెడుతున్నావో వెంటనే చెప్పమని గద్దించింది.

గడుసుదైన కొత్తకోడలు - "మా నాన్నగారు నన్ను అత్తవారింటికి పంపుతూ - "ఆ యింటి పద్ధతులు తెలుసుకుని జాగ్రత్తగా మసులుకో తల్లీ! ఎప్పుడూ చిన్నవాళ్ళ దగ్గర ఉండకు. ఇంటిలోని వృద్ధులకు సేవలు చేస్తూ వారివద్దనుండి అన్నీ నేర్చుకో" అని చెప్పి పంపారు. మన ఇంటికి బామ్మగారే పెద్దకదా. అందుకని ఆవిడని అడిగి, అన్ని విషయాలు తెలుసుకుందామని, ఆవిడ దగ్గరకు వెడుతున్నాను". మా నాన్నగారు - మనయింటి పద్ధతులు వేరే వారి పద్ధతులు వేరని చెప్పారు. ఇక్కడి పద్ధతులు తెలుసుకోవడానికి బామ్మగారి దగ్గరకు వెడుతున్నాను. ఆవిడని

మా అత్తగారు మీకు ఎలాసేవ చేసేవారని అడిగాను. నేను కూడ మీకు అలానే సేవ చెయ్యాలి కదా. బామ్మగారు అత్తను కొట్టకుండా, తిట్టకుండా ఉండడమే గొప్పసేవ" అని చెప్పారు." అంది. అత్తగారు తత్తరపాటుతో "నువ్వు కూడా నాకు అలానే సేవ చేస్తావా?" అనడిగింది. కోడలు - "మానాన్న నన్ను అత్తవారింటి పద్ధతులు పాటించమని చెప్పారు కదా!" అని గడుసుగా సమాధానమిచ్చింది.

తన ముసలి అత్తను తాను కష్టపెడుతున్నట్లే, అవమానిస్తున్నట్లే, తనకోడలు కూడ తనను అవమానిస్తుందేమోనని అత్తగారు భయపడింది. కోడలు ఒక పగిలిపోయిన రాతిచిప్పను ఒకమూల జాగ్రత్తచెయ్యడం చూసింది. అదెందుకని అడిగింది. కొత్తకోడలు - "మీరు మీ ముసలి అత్తగారికి పగిలిపోయిన రాతిచిప్పలోనే అన్నం పెడతారు కదా. నేను కూడా మీకు అన్నం పెట్టడానికి పగిలిపోయిన రాతిచిప్పను జాగ్రత్త చేస్తున్నాను" అంది.

"నాకు పాతరాతి చిప్పలో అన్నం పెడతావా?"

"రాతిచిప్పలో అన్నం పెట్టడం పద్ధతి కాదు".

"మరి బామ్మగారికి మీరెందుకు రాతిచిప్పలో అన్నం పెడుతున్నారు?"

"ఆవిడకు కంచంలో పెడితే, కంచం ఎవరు కడుగుతారు?"

"నేను కడుగుతాను".

"అయితే కంచంలోనే అన్నంపెట్టు. ఆ రాతిచిప్పను బయట పారెయ్యి." అయితే అందరూ తినగా మిగిలిపోయినవి పాచిపట్టినవాటిని ఆవిడకు పెట్టేవారు. కొత్తకోడలికి ఇది ఎంతమాత్రం నచ్చలేదు. ఆమె తెలివిగా ఒక పని చేసింది. ఒకరోజు బామ్మగారికి పెట్టే అన్నాన్ని పరీక్షగా పరిశీలించసాగింది. అదిచూసి అత్తగారు - "ఏమమ్మా? ఏంటలా చూస్తున్నావ్" అంది. కోడలు "ముసలివాళ్ళకు ఎలాంటి అన్నం పెట్టాలో తెలుసుకుంటున్నాను" అంది.

అత్తగారు - "పెద్దవాళ్ళకు మంచి ఆహారం ఇవ్వాలి".

"మరి మీరెందుకు అందరూ తినగా మిగిలిన అన్నం పెడుతున్నారు"

"ఆవిడకు వేడివేడి అన్నం పట్టుకువెళ్ళి ఎవరు పెడతారు?'

"మీరు అనుమతిస్తే రోజూ వంటకాగానే ఆవిడకు అన్నం నేను పెడతాను".

"సరే. అలానే చెయ్యి."

"అలాగే అత్తయ్యగారూ!"

అప్పటినుంచి కొత్తకోడలు బామ్మగారికి వేడిఅన్నం పెట్టేది. బామ్మ కొత్తకోడలిని మనసులోనే ఆశీర్వదించింది.

ముసలావిడ ఎప్పుడూ ఓ కుక్కిమంచంలో పడిఉండేది. దాని నవారు చీకిపోయి, చిరిగిపోయింది. మంచం విరిగిపోయింది. కొత్తకోడలు ఆ మంచాన్ని తదేకంగా చూడసాగింది. అత్తగారు ఏం చూస్తున్నావని అడిగింది.

"పెద్దవారికి మంచం ఎలా సిద్ధం చెయ్యాలో చూస్తున్నాను".

"వృద్ధులకు ఇలాంటి మంచం ఇవ్వరు. విరిగిపోవడం వల్ల ఈ మంచం యిలా తయారయ్యింది."

"అయితే దీన్నెందుకు బాగు చేయించలేదు."

"నువ్వు బాగు చేయించి, కొత్త నవారు నేయించు"

"మీరు చెప్తే అలానే చేస్తానండి."

బామ్మగారికి కొత్తమంచం తయారయ్యింది.

కొత్తకోడలు మామ్మగారి బట్టలు చూసింది. అవి చిరిగిపోయి ఉన్నాయి. ఆమె వాటివంకే తదేకంగా చూస్తుంటే, అత్తగారు ఎందుకలా చూస్తున్నావని అడిగింది.

"ముసలివాళ్ళకి ఎలాంటి దుస్తులివ్వాలో చూస్తున్నాను"

"అబ్బే, ఈ బట్టలు పాతవవటం వల్ల చిరిగిపోయాయి. ఎవరైనా శుభ్రమైన బట్టలే ధరించాలి." కోడలు తనకు ముసలితనం వచ్చాక మంచిబట్టలు కొనదేమోనని భయపడింది. "నువ్వే ఆవిడకు కొత్తచీరలు కొనిపెట్టు." అంది.

ఇప్పుడు బామ్మగారికి మంచిభోజనం, మంచి బట్టలు, మంచం పరుపు, అన్నీ అమరాయి. కొత్తకోడలు చిన్నపిల్ల అయినా తెలివిగా బామ్మగారి పరిస్థితిని చక్కదిద్దింది. ఒకవేళ అత్తగారికి మాటలతో చెప్తే ఆవిడ అర్థం చేసుకునేది కాదేమో, ఆచరణలో చేసి చూపడం వల్ల మంచి ఫలితం వచ్చింది.

అమ్మాయిలందరూ చక్కటి తెలివితేటలతో, వినయ,విధేయలతో పెద్దవారిని సేవించుకోవాలి. ఇంటిలో ఉండే అందరినీ చక్కగా సమన్వయపరచగలగాలని ఈ కథ చక్కటి సందేశమిస్తుంది.

# దుఃఖించడం దేనికి?

ఒక రాజకుమారుడు ఉండేవాడు. అతడు ఒకరోజు తన ఐదారుగురు మిత్రులతో కలసి గుర్రపుస్వారీ చేస్తున్నాడు. దారిలో కొందరు గొల్లపడుచులు పాలు, పెరుగు మొదలైనవి పట్టణంలో అమ్ముకోవడానికి వెడుతుండడం చూసాడు. రాజకుమారునికి శ్రీకృష్ణుని చిలిపిచేష్టలు గుర్తుకువచ్చాయి. ఆయనలానే గోపస్త్రీల పాలు, పెరుగులను దొంగతనం చేసి, పగులకొట్టాలని సరదాపుట్టింది. కాసేపు వారిని ఆటపట్టించి, తరువాత వాటి ఖరీదు వారికి ఇచ్చివేయాలని అనుకున్నాడు.

రాజకుమారుడు, ఆయన మిత్రులు, గొల్లపడుచుల కుండలను పగులకొట్టసాగారు. ఆ స్త్రీలు భయపడి ఏడ్వసాగారు. కాని రాజకుమారుడు ఎవరి కుండలను పగులకొట్టాడో, ఆమె మాత్రం ఏమాత్రం బాధపడలేదు సరికదా జరిగే విడ్డూరాన్ని చూస్తూ చిరునవ్వు నవ్వసాగింది. రాజకుమారుడు ఆశ్చర్యంతో "ఓసీ! నీవు తప్ప అందరూ ఏడుస్తున్నారు. నువ్వెందుకు భయపడటం లేదు?" అని అడిగాడు. ఆమె - "యువరాజా! నాకథ తెలిస్తే, నేనెందుకు బాధపడటంలేదో తెలుస్తుంది. చల్లకుండలు పగిలిపోయాయనే చిన్నకారణానికి భయపడటం దేనికి? నేను యింతకంటె పెద్ద సమస్యలెన్నిటినో ఎదుర్కొన్నదాన్ని" అంది. యువరాజు ఆమెకథ వినడానికి కుతూహలపడ్డాడు. ఆమె తన కథ చెప్పసాగింది.

నేను ఒకవ్యాపారి భార్యను. ఎంతో అందగత్తెను నాకొక కుమారుడు ఉండేవాడు. నాభర్త వ్యాపారనిమిత్తం పరదేశం వెళ్ళగా, దుర్మార్గుడైన మా రాజు నా సౌందర్యానికి వ్యామోహితుడయ్యాడు. ఎలాగైనా నన్ను వశపరచుకోవాలని ప్రయత్నించసాగాడు. తనకు లొంగడానికి నాకు కొన్నిరోజులు గడువిచ్చాడు. నేను రహస్యంగా నాభర్తకు ఈ వర్తమానమంతా తెలియజేసాను. తొందరగా రమ్మని కబురుపెట్టాను. నేను, నాభర్త బాగా ఆలోచించి ఒక ఉపాయంతో, ఈ అపాయాన్ని తప్పించుకోవాలని నిశ్చయించుకున్నాము. నేను మా రాజుకు ఫలానారాత్రి ఊరికి దూరంగా

ఫలానాచోట నన్ను కలుసుకోమని కబురు పంపాను. అయితే మైలుదూరం వరకూ ఎవరూ ఉండరాదని షరతు పెట్టాను. రాజు నా షరతుకు అంగీకరించాడు. అనుకున్న సమయానికి ఆ ప్రదేశానికి చేరుకున్నాడు. నేను నాభర్త అతనికన్నా ముందే అక్కడకు చేరుకున్నాము. రాజును చంపి, వేరే దేశానికి పారిపోవాలని నిశ్చయించుకున్నాము. దూరంగా ఉండి నా భర్త అన్నీ గమనిస్తున్నాడు. రాజు వచ్చాకా నేను అతణ్ణికత్తితో నరికివేసాను. వడి వడిగా నా భర్తను సమీపించాను. అయితే దురదృష్టం నన్ను కాటువేసింది. పాడుబడిన యింట్లో దాక్కొని ఉన్న నాభర్తను విషనాగు కాటువేసింది. నేనూ నాభర్తతోపాటే మరణించాలనుకున్నాను. కాని నాబిడ్డను అనాథను చేయలేక, వాడినెత్తుకుని అక్కడనుంచి పారిపోయాను. పరిగెడుతూ, పరిగెడుతూ ఒక అడవిలోకి వెళ్ళిపోయాను.

దురదృష్టం నన్నింకా వెంటాడుతూనే ఉంది. దారిలో దోపిడీదొంగలు నాపై విరుచుకుపడ్డారు. నా నగలన్నీ అపహరించి నన్నొక వేశ్యాగృహానికి అమ్మివేసారు. నాబిడ్డ ఏమయ్యాడో నాకు తెలియదు. దిక్కులేని స్థితిలో నేను వేశ్యాగృహంలోనే నివసించాను. వారి సాంగత్యఫలంగా నేనుకూడ గణికగా మారిపోయాను. అలా ఎన్నో సంవత్సరాలు గడిచిపోయాయి. ఒకరోజు నాబిడ్డే నావద్దకు రాగా వాడితో రమించాను. తెల్లవారిన తరువాత వాడి ఊరుపేరులు అడిగితే వాడు నాకుమారుడేనని తెలిసింది. వాడిని ఆ ఊరిలోనివారే ఎవరో చేరదీసి పెంచారట. వాడక్కడే ఉద్యోగం చేస్తున్నాడట. ఆ సంగతి తెలిసిన నాహృదయంలో అగ్నిపర్వతం బ్రద్దలయ్యింది. నా పాపానికి పరిహారమేమిటని పండితులను అడిగితే, వారు అగ్ని ప్రవేశమే శరణ్యమని చెప్పారు. గంగాతీరంలో కట్టెలతో చితి రగిల్చి అందులో ప్రవేశించాను. దురదృష్టవంతురాలనైన నన్ను భగవంతుడు కరుణించలేదు. గంగానదికి పెద్ద వరద వచ్చి, అందులో కొట్టుకుపోయాను. ప్రవాహంలో మునిగిపోకుండా ఒక దుంగను పట్టుకుని, ఈ గొల్లపడుచులుండే గ్రామానికి చేరుకున్నాను. అప్పటి నుండి ఇలా పాలు, పెరుగులు అమ్ముకుంటూ పొట్టపోసుకుంటున్నాను. ఇన్ని కష్టాలు పడ్డ నేను ఈ పెరుగుకుండలు పగిలిపోతే బాధపడతానా?" అనడిగింది.

హత్వా నృపం పతి మమేక్ష్య భుజంగదష్టం -
దేశాంతరే విధివశాత్ గణికాం చ యాతా ।
పుత్రం ప్రతి సమధిగమ్య చితాం ప్రవిష్టా,
శోచామి గోపగృహిణీ కథ మద్య తక్రం ॥
నృప మార్ చలీ అపనే పివ్ పై,
పివ్ భుజంగ్ డస్యో జో గయో మర్ హై ।
మగ్ చోర్ మిలై ఉన్ లూట్‌గయీ,
పుని బేచ్ దయి గణికా ఘర్ హై ।
సుత్‌సేజ్ రమీ చితాపై ఖడీ,
జల్ ఖూబ్ బహ్యో సరితా తర్ హై ।
మహరాజ్‌కుమార్ భయీగజరీ,
అబ్ ఛాబ్ కో సోచ్ కహా కర్ హై ॥

జీవితంలో ఎన్నిటినో భరించవలసివస్తుంది. ఎన్నో అవస్థలు వస్తాయి. ఒక చిన్నకష్టానికి దుఃఖించవలసిన అవసరమేమున్నది? ఇలాంటి కష్టనష్టాలెన్నో వస్తాయి. ఇప్పుడు చల్ల ఒలికిందని బాధపడాలా? మానవులైన మనందరికీ ఇప్పటికే ఎన్నో జన్మలు గడచిఉంటాయి. ఆయాజన్మల్లో ఎన్నికష్టాలు పడ్డామో ఎవరికి ఎరుక? ఒకసారి బిడ్డపోయి ఉండవచ్చు. ఒకసారి భర్త మరణించవచ్చు. ఒకసారి భార్య పోనూవచ్చు. ఒకసారి సంపదలు వరించవచ్చు. ఒకసారి అష్టదరిద్రాలు అనుభవించి ఉండవచ్చు. ఇలా యిప్పటికి ఎన్నిసార్లు జరిగిందో సుడిగాలి ఎక్కడెక్కడి ఎండుటాకులనో ఒకచోట చేరుస్తుంది. అంతలోనే దూరం చేస్తుంది. ఇందులో కొత్తవిషయమేముంది? ఈ ప్రపంచంలోకి వచ్చినవారందరూ ఎప్పుడో ఒకప్పుడు నిష్క్రమించవలసినవారే కదా. ఈ అశాశ్వతమైనవాటి కోసం దుఃఖం వృథా.

# భ్రమ తొలగిపోయింది

ముకుందదాసు అనే ఒకవ్యక్తి ఉండేవాడు. అతడు ఒక స్వామీజీ వద్ద శిష్యరికం చేసేవాడు. గురువు ఎప్పుడు అతనిని తనవద్దకు వచ్చివేయమన్నా అతడు - "నేను లేకపోతే నా భార్యాపిల్లలు జీవించలేరు. వారందరూ నాపైనే ఆధారపడిఉన్నారు. నేను లేకపోతే వారికెలా సాగుతుంది" అంటూ గురువు ఆహ్వానాన్ని తిరస్కరించేవాడు. గురువు ఇదంతా నీభ్రమ. అని చెప్పేవాడు. ఒకరోజు కావాలంటే పరీక్షించి చూడమని గురువు శిష్యుని సవాలు చేశాడు. ముకుందదాసు అందుకు అంగీకరించాడు. గురువు అతనికి ప్రాణాయామం ద్వారా శ్వాసను బంధించడం నేర్పాడు.

ఒకరోజు ముకుందదాసు తన కుటుంబంతో నదీస్నానానికి వెళ్ళాడు. అక్కడ నదిలో మునిగి, శ్వాసను బంధించి, నీళ్ళలోపలే ఈదుతూ దూరంగా ఉన్న అడవివైపుకు వెళ్ళిపోయాడు. అక్కడ ఎవరూ లేరని నిర్ధారించుకుని, ఒడ్డుకుచేరి, ఎవరికంటా పడకుండా తన గురువు ఆశ్రమానికి వెళ్ళిపోయాడు. ఇక్కడ ముకుందుని కుటుంబసభ్యులు అతని గురించి వెతికివెతికి, ఎక్కడా కనబడకపోవడంతో, అతడు నదిలో కొట్టుకుపోయి మరణించి ఉంటాడని నిర్ధారించుకున్నారు. ముకుందదాసు నదిలో మునిగిపోయాడన్న వార్త ఊరంతా పాకింది. స్వామీజీ శిష్యులైన ముకుందుని స్నేహితులు, తమ మిత్రుని మరణానికి బాధపడి, అతడి కుటుంబాన్ని ఆదుకోవలసిన బాధ్యత తమదేనని నిశ్చయించుకున్నారు. ఎవరు చేయగలిగిన సహాయాన్ని వారు చేయసాగారు. ఒకరు ధాన్యం యిస్తే మరొకరు పప్పులు... ఇలా అందరూ తమకు తోచిన సహాయం చేస్తున్నారు. ఆహారసామాగ్రి అంతా అమర్చి, పాలు, పెరుగు లాంటి నెలసరి ఖర్చులకు ముకుందుని భార్యకు కొంత డబ్బును కూడ సమకూర్చారు. ఈవిధంగా స్వామీజీ శిష్యులందరూ ఆయన ఆజ్ఞ లేకపోయినప్పటికీ ముకుందుని కుటుంబాన్ని ఆదుకున్నారు.

కొన్నిరోజులు గడిచిన తర్వాత ముకుందదాసు భార్య స్వామీజీ దర్శనానికి వచ్చింది. స్వామి ఆమెను ఆశీర్వదించి, ఆమె యోగక్షేమాలు ప్రశ్నించాడు.

ఆమె - "స్వామి! పోయినవారు ఎలానూ తిరిగిరారు. ఆ లోటు ఎవరూ పూరించలేనిది. అయితే జీవితం మాత్రం ఇదివరకటికంటె బాగానే నడుస్తోంది." అని చెప్పింది. స్వామీజీ "ఇదివరకటికంటె బాగా ఎలా జీవిస్తున్నారని" ప్రశ్నించాడు. ఆమె - "స్వామి! మీ దయవల్ల మీశిష్యులందరూ కావలసిన సామాగ్రి అంతా సమకూర్చిపెడుతున్నారు. ఏ అవసరమైనా ఇట్టే తీరుతోంది." అని చెప్పి, స్వామికి నమస్కరించి ఇంటికి వెళ్ళిపోయింది. ఆశ్రమంలో రహస్యంగా ఉన్న ముకుందదాసు ఆమె మాటలన్నీ విన్నాడు.

స్వామీజీ ముకుందుని పిలిచి, ఇప్పుడు మీ యింటికి వెళ్ళి, ఏమి జరుగుతుందో చూడు" అని చెప్పాడు. అతడు అర్ధరాత్రి తన యింటికి వెళ్ళి తలుపుతట్టాడు. అతడి భార్య "ఎవరది?" అంది.

"నేనే తలుపు తియ్యి"

ముకుందుని గొంతువిని అతడు దయ్యమై వచ్చాడనుకొని, ఆమె భయపడింది. ముకుందుడు - "నేను బ్రతికే ఉన్నాను. తలుపు తియ్యి"మన్నాడు.

భార్య - "పిల్లలు చూస్తే జడుసుకుంటారు. ఇక్కడి నుంచి వెళ్ళిపోండి" అంది.

"నేను లేకుండా మీరంతా ఎలా బ్రతుకుతారు?"

"మీస్నేహితుల దయవల్ల మేము బాగానే బ్రతుకుతున్నాం.

మీరు మాగురించి బాధపడనక్కరలేదు. వెంటనే ఇక్కడినుండి వెళ్ళిపోండి".

"నీకేమీ బాధగా లేదా?"

"మీరు తిరిగివచ్చినందుకు బాధపడుతున్నాను. వెంటనే వెళ్ళిపోండి. దయచేసి యింకెప్పుడూ తిరిగిరావద్దు" అని లోపలకు వెళ్ళిపోయింది.

ముకుందదాసుకు భార్యమాటలతో జ్ఞానోదయమయింది. తన గురువు మాటలపై విశ్వాసం కుదిరింది. భగవత్సాధనలో జీవితాన్ని గడపాలని నిశ్చయించుకున్నాడు. ఆశ్రమంవైపు నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

# అతిథి సేవా ఫలము

విష్ణుకంచిలో దామోదరుడనే పేరుగల బీదబ్రాహ్మణుడు ఉండేవాడు. వివాహమైన తరువాత అతడు తనభార్యతో అతిథిసేవయే గృహస్థుల ప్రధానకర్తవ్యం. అందువల్ల నేను ఇంటిలో ఉన్నప్పుడైనా, లేనప్పుడైనా అతిథులెవరైనా వస్తే, వారిని ఆకలితో పంపవద్దు అని చెప్పాడు. ఇంకా గుర్వాజ్ఞను పాలించడం బ్రహ్మచారికి, అతిథిసేవ గృహస్థులకు, తపస్సు వానప్రస్థులకు, భగవచ్చింతన సన్యాసులకు ప్రధాన కర్తవ్యమని వివరించాడు. అతడి భార్య సంతోషంతో అంగీకరించింది. అతడు కాంచీనగరంలో భిక్షాటన చేస్తూ, భిక్షగా లభించిన దానిని తీసుకువచ్చి భార్యకు ఇచ్చేవాడు. అతడు సంపాదించినది వారి భోజనానికే సరిపోయేదికాదు.

భగవంతుడి లీలలు చిత్రంగా ఉంటాయి. ఒకరోజు భగవానుడు వృద్ధసన్యాసి వేషంలో వీరింటికి వచ్చాడు. అరుగుపై కూర్చొని "దామోదరుడు ఇంటిలో ఉన్నాడా?" అని పిలిచాడు. దామోదరుడు బయటకు వచ్చి సన్యాసికి నమస్కరించాడు. సన్యాసి "ఈరోజు మీఇంటిలో భిక్ష స్వీకరించడానికి వచ్చా"నని చెప్పాడు. దామోదరుడు మహదానందంతో సన్యాసి పాదాలు కడిగి, ఇంట్లోకి తీసుకువెళ్ళాడు. దైవయోగం వల్ల, ఆరోజు దామోదరునికి ఎక్కడా భిక్ష దొరకలేదు. దామోదరునికి ఏమి చెయ్యాలో తెలియలేదు. తాను, తనభార్య నిరాహారంగా ఉన్నా పరవాలేదు గాని ఈ ముసలిసన్యాసికి ఏంపెట్టి కడుపునింపాలి? అని ఆలోచించసాగాడు. ఇంటిలో ఏమీ లేవు. చిరిగిపోయిన పాతబట్టలు, పాతసామాను, గోపీచందనం(మంచిగంధం) చింకిచాప తప్ప ఆ యింట్లో ఏమీ లేవు. దామోదరుడు అతనిభార్యతో - ఇదేమి కష్టం సంభవించింది. అతిథిని ఆకలితో ఉంచాలా అంటూ బాధపడ్డాడు. ఆమె - "నేనున్నానుకదా. దిగులు పడవద్దు" అని ధైర్యం చెప్పింది. దామోదరుడు - "నీ దగ్గర ఏమైనా గుప్తధనం ఉందా లేక నీ నగలేమైనా ఉన్నాయా?" అన్నాడు. ఆమె - "మీరు మంగలి దగ్గరికి వెళ్ళి కత్తెర పట్టుకు రండి" అని చెప్పింది. దామోదరుడు వెళ్ళి కత్తెర పట్టుకొచ్చాడు. అతనిభార్య

తనకేశములు కొన్ని కత్తిరించి, వాటిని త్రాడుగా పేనింది. దానిని భర్తచేతికిచ్చి దీనిని అమ్మి, ఆ డబ్బుతో బియ్యం పప్పు, ఉప్పులు తెమ్మంది. అతడలానే చేశాడు. ఆమె వాటితో అన్నం వండింది. దామోదరుడు వృద్ధసన్యాసిని భోజనానికి లెమ్మన్నాడు. పెద్ద అరిటాకు వేసి అన్నం పప్పు వడ్డించాడు. సన్యాసి ఒక్కమెతుకు కూడా వదలకుండా తినేశాడు. దామోదరుడు మిగిలిన మొత్తం అన్నాన్ని విసర్తిలో వడ్డించాడు. వృద్ధసన్యాసి మొత్తం అన్నం తిని తృప్తిగా త్రేన్చాడు. వృద్ధసన్యాసి మీదంపతుల ఆతిథ్యం నాకు బాగా నచ్చింది. ఇప్పుడు నేనెక్కడకూ వెళ్ళలేను. నేనిక్కడే ఉంటాను అన్నాడు. దామోదరుడు మహద్భాగ్యంగా భావించాడు. ఆ సన్యాసి రోజంతా యింట్లోనే ఉన్నాడు. సాయంత్రమయ్యాక "బాబూ! పప్పు అన్నం చాలు. మరేమీ వండద్దు" అని చెప్పాడు. దామోదరుడు సరేనని తన భార్యకు సంగతి చెప్పాడు. ఆమె మిగిలిన తన శిరోజాలను కత్తిరించి, వాటితో త్రాడుపేని, దాన్నిఅమ్మి ఉదయంలానే బియ్యం, పప్పు, ఉప్పులు తెమ్మంది. అలా తెచ్చిన దాన్ని వండి వడ్డించింది. వృద్ధసన్యాసి ఒక్కమెతుకు కూడా వదలకుండా, వండిన మొత్తం తినేసాడు. "బాబూ! బాగా రాత్రి అయ్యింది. నాకు ఇల్లంటూ ఏమీ లేదుకదా. ఈరాత్రికి యిక్కడే ఉంటాను" అన్నాడు. దామోదరుడు "మహద్భాగ్యం" అన్నాడు.

దామోదరుని భార్య ఇంట్లో ఉన్న ఒకేఒక్క చింకిచాపను నేలపై పరిచి, పక్కవేసింది. వృద్ధసన్యాసి దానిపై విశ్రమించాడు. దామోదరుడు ఆయన కాళ్ళు నొక్కుతూ, ఆయన పడుకున్న తర్వాత కటికనేలపై పడుకున్నాడు. అతని భార్య కూడా అలానే నిద్రపోయింది. వారిద్దరూ నిద్రపోయిన తర్వాత సన్యాసి నిద్రలేచి వారిద్దరినీ ఆశీర్వదించాడు. బ్రాహ్మణి శిరోజాలు ఎప్పటిలానే వచ్చేసాయి. *భగవంతుడు వారికి సిరిసంపదలను, ధనధాన్యాలను అనుగ్రహించాడు. వెంటనే అంతర్ధానమైపోయాడు. దామోదరుని భార్య నిద్రలేచేటప్పటికి ఆమె ఒంటినిండా ఆభరణాలున్నాయి. ఆమె కేశాలు ఎప్పటిలానే ఉన్నాయి. ఆమె ఆశ్చర్యంతో భర్తను లేపింది. దామోదరుడు ఎంత వెదికినా వృద్ధసన్యాసి జాడలేదు. అయ్యో! వయసు పైబడినవాడు

* వృద్ధ సన్యాసి వేషంలో ఉన్న

ఎక్కడకు వెళ్ళాడో తెలీదు అనుకుంటూ ఇల్లంతా వెతికాడు. అతనిభార్య - "ఒకసారి నన్ను, మనింటిని పరిశీలనగా చూడండి." అంది. దామోదరుడికి అంతా అర్థమవసాగింది. అతడు నిస్పృహతో కుప్పకూలిపోయాడు. "భగవంతుడే స్వయంగా నా యింటికి వస్తే నేను గుర్తించలేకపోయాను. ఎంతటి అపరాధం చేసాను. అజ్ఞానిని నన్ను కరుణతో క్షమించు స్వామీ!" అని భక్తి విహ్వలతతో ఏడ్వసాగాడు. పరమాత్మ అతడిని అనుగ్రహించి, దర్శనమిచ్చి తరింపజేశాడు. మీరిద్దరూ యిలానే అతిథి అభ్యాగతులను ఆదరించి వారిని సేవిస్తూ సంతృప్తులను చేయండి. అంత్యకాలమున మీరు నన్నే చేరుకుంటారు. అని ఆశీర్వదించి అదృశ్యమయ్యాడు.

నీతి : అతిథిసేవనమే గృహస్థు ప్రథమకర్తవ్యం.
అతిథిసేవతో భగవంతుని కూడ తృప్తిపరచవచ్చు.

# నాలుగు దీవెనలు

ఒక వేటగాడు అడవిలోకి వెడుతున్నాడు. దారిలో అతడికి గుర్రపుస్వారీ చేస్తూ అడవిలోకి వెడుతున్న ఒక రాజకుమారుడు కన్పించాడు. ఇద్దరూ అడవిలోకే వెడుతున్నారు. కనుక, కలసి వెళ్ళసాగారు. వారలా వెడుతుండగా వారికి ఒక తాపసి, ఒక సన్యాసి కనబడ్డారు. వారు కూడ అరణ్యంలోకే వెడుతున్నారని తెలుసుకొని, అందరూ కలిసి ప్రయాణించసాగారు. దారిలో వారికి ఒక కుటీరం కనబడింది. అందులో ఒక వృద్ధసన్యాసి కూర్చుని ఉన్నారు. ఈ నలుగురు ఆ వృద్ధసన్యాసికి నమస్కరించారు. ఆయన నలుగురిని నాలుగు రకాలుగా దీవించారు.

రాజకుమారుని "చిరంజీవివై జీవించు నాయనా!" అని, తాపసిని - "నీకు శీఘ్రమే మృత్యువు ఆసన్నమగుగాక" అని, సన్యాసిని నీ యిష్టానుసారం జీవించు లేదా మరణించు" అని, వేటగాని "నువ్వు చావనూవద్దు, బ్రతుకనూ వద్దు" అని ఆశీర్వదించారు. వృద్ధసన్యాసి ప్రవర్తన ఆ నలుగురినీ ఆశ్చర్యపరిచింది. వారు వృద్ధసన్యాసికి నమస్కరించి - స్వామి! దయతో మీ ఆశీర్వాదంలోని అంతరార్థాన్ని అజ్ఞానులమైన మాకు వివరించండి" అని ప్రార్థించారు.

వృద్ధసన్యాసి చిరునవ్వు నవ్వి - రాజులకు మరణించిన తరువాత నరకం తప్పదు. "రాజ్యాం తే నరకం ధ్రువమ్". పూర్వజన్మలో భోగభాగ్యాలను ఆశించి, తపస్సు చేసినవాడు, రాజుగా జన్మిస్తాడు. కోరుకున్న భోగాలను అనుభవిస్తాడు. మరణించిన తరువాత నరకానికి చేరుకుంటాడు. "తపేశ్వరి రాజేశ్వరి; రాజేశ్వరి నరకేశ్వరి" అందువలననే ఈ రాజును చిరకాలం జీవించమని ఆశీర్వదించాను. బ్రతికినంతకాలం సుఖాలను అనుభవిస్తాడు కదా!

తాపసి బ్రతికి ఉన్నంతకాలం తపస్సు చేస్తూ, శరీరాన్ని కష్టపెడతాడు. మరణించిన తర్వాత తపఃఫలంగా స్వర్గభోగాలను అనుభవిస్తాడు లేదా మరో జన్మలో మహారాజు అవుతాడు. అందువల్ల తాపసిని శీఘ్రంగా

మరణించమని దీవించాను.

సన్యాసి బ్రతికినంతకాలం భగవద్భజనలోనో, తోటివారికి ఉపకారం చేస్తూనో గడుపుతాడు. మరణిస్తే పరమాత్మను చేరుకుంటాడు. సన్యాసి జీవించినా, మరణించినా ఆనందంగానే గడుపుతాడు. అందుచేతనే అతడి చావుబ్రతుకులు అతని యిచ్ఛానుసారమే కలగాలని ఆశీర్వదించాను.

ఇక చివరిగా వేటగాడు. అతడు బ్రతికుంటే మూగజీవులను చంపుతుంటాడు. మరణిస్తే నరకబాధలు అనుభవిస్తాడు. అందువల్ల అతడిని "జీవించనూ వద్దు. మరణించనూ వద్దు" అని దీవించాను.

**"రాజపుత్ర చిరంజీవ, మా జీవ ఋషి పుత్రకః**
**జీవ్ వా మర్ వా సాధు, వ్యాధ్ మా జీవ మా మర."**

మానవుడు తన జీవితాన్ని బ్రతికి ఉన్నప్పుడు, మరణించిన తరువాత కూడ ఆనందాన్ని అనుభవించేలా తయారుచేసుకోవాలి. అందుకోసం సన్యాసాన్ని స్వీకరించాలి. సన్యాసిగా మారడమంటే ఇల్లు, వాకిలీ వదిలిపెట్టి, కాషాయవస్త్రాలను ధరించడమేకాదు. గార్హస్థ్య ధర్మాన్ని పాటిస్తూనే, మనిషి మానసికంగా సన్యసించవచ్చు. నిరంతరం భగవచ్చింతనలో గడపడం, పరోపకారం మొదలైన సత్కార్యాలు ఇహపరాలు రెండిటినీ సుఖదాయకం చేస్తాయి. అందుకనే కబీర్‌దాసు యిలా అంటాడు-

**"సబ్ జగ్ డర్ పే మరణ్‌సే, మేరే మరణ్ ఆనంద్**
**కబ్ మరియే కబ్ భేటియే, పూర్ణపరమానంద్"**

ప్రపంచమంతా మృత్యువుకు భయపడుతుంది. నామృత్యువు మాత్రం నాకు ఆనందాన్ని కల్గిస్తుంది. ఎప్పుడు కలుస్తామో, ఎప్పుడు విడిపోతామో తెలియని ఈ ప్రపంచంనుండి పూర్ణ పరమానందస్థితికి తీసుకువెడుతుంది. నిజమైన సన్యాసి మరణానంతరం పరమపదాన్ని పొందుతాడు.

# గురుసేవా ఫలము

శ్రీకృష్ణునికి విద్యను బోధించిన గురువుగా 'సాందీపని' సుప్రసిద్ధుడు. ఆ మహర్షి తన బాల్యంలో ఒక గురువు వద్ద విద్యాభ్యాసం చేసేవాడు. అప్పుడు తన గురువుకు ఎంతో నమ్రభావంతో సేవ, శుశ్రూషలు చేసేవాడు. తోటి విద్యార్థులందరికంటె సాందీపనికి గురుభక్తి ఎక్కువ. ఒకసారి గురువుగారు సాందీపనిని పరీక్షించదలిచారు.

ఒకరోజు ఆశ్రమంలోని విద్యార్థులందరూ బయటకు వెళ్ళారు. వారు తిరిగివచ్చే సమయానికి గురువు సాందీపనిని దగ్గరకు పిలిచి, ఆశ్రమప్రాంగణంలో ఆడుకుంటున్న, తన కుమారుడైన పసిబాలుణ్ణి చూపించి, వాడిని బావిలో పడేయమని ఆజ్ఞాపించారు. సాందీపని గుర్వాజ్ఞను శిరసావహించి, గురుపుత్రుని నూతిలో పడవేశాడు. అప్పుడే తిరిగివస్తున్న విద్యార్థులందరూ సాందీపని చేసిన అఘాయిత్యాన్ని చూశారు. కొందరు విద్యార్థులు బావిలోకి దూకి బాలుని కాపాడారు. సాందీపని చేసిన అకృత్యానికి కోపగించి, అతనిని చావగొట్టసాగారు. సాందీపని వారి దెబ్బలకు మారుమాటాడకుండా సహించాడేగాని గురువుగారే తనను అలా చేయమన్నారని ఎవరికీ చెప్పలేదు. గురువు సాందీపనిని కొట్టవద్దని మిగిలిన శిష్యులను వారించాడు.

మరల కొన్నిరోజులకు ఆశ్రమవిద్యార్థులు బయటకు వెళ్ళి, తిరిగివచ్చే సమయానికి, - గురువు సాందీపనిని పిలిచి ఆశ్రమానికి నిప్పు పెట్టమన్నాడు. సాందీపని గురువు ఆజ్ఞను ముందు వెనుకలు చూడకుండా పాటించాడు. దూరం నుంచి వస్తున్న విద్యార్థులు సాందీపని ఆశ్రమంలోని కుటీరాలను తగులబెట్టడం చూసి, వెంటనే మంటలను ఆర్పి, అతనిని తన్నసాగారు. సాందీపని మౌనంగానే దెబ్బలన్నీ సహించాడు. పూర్వంలానే గురువు తక్కిన శిష్యులను వారించాడు.

సాందీపని విశేషమైన బుద్ధిగలవాడు కాదుగాని, గురువు ఆజ్ఞను శిరసా వహించేవాడు. మహాత్ముల ఆజ్ఞలను పాటించడమే వారికి చేసే సేవ. "అగ్యాసమ్ న సుసాహిబ్ సేవా రామచరితమానస్ - అయోధ్యా(301-2)

మహాత్ముల ఆజ్ఞలను పాటించడం వల్ల, వారి శక్తియుక్తులు మనకు సంప్రాప్తమౌతాయి. వారి ఆజ్ఞను ఎంత తొందరగా పాటిస్తే, అంత ఎక్కువ శక్తి వస్తుంది. ఆలస్యం చేసినకొద్దీ తక్కువశక్తి లభిస్తుంది. అందువల్లనే సాందీపని, తన గురువు ఎలాంటి పని చెప్పినా, ఏ సంకోచమూ లేకుండా తక్షణమే చేసేవాడు." ఆజ్ఞా గురూణాం హి అవిచారణీయమ్" (రఘువంశం - 14-46)

విద్యాభ్యాసం ముగిసిన తర్వాత విద్యార్థులందరూ తమ తమ గృహాలకు వెళ్ళిపోయారు. వారిలో ఎందరో విద్వాంసులు పండితులు ఉన్నారు. సాందీపని కూడ తన యింటికి వెళ్ళిపోయాడు.

కొన్నిరోజులకు గురువుగారు అస్వస్థులై చావు బ్రతుకుల మధ్యనున్నారని సమాచారం తెలిసింది. విద్యార్థులందరూ ఆయనను దర్శించుకోవడానికి వచ్చారు. సాందీపని కూడ గురువును చూడటానికి వెళ్ళాడు. గురువుకు మృత్యుఘడియలు దగ్గరపడ్డాయి. ఆయన తనవద్దనున్న సామగ్రి నంతటినీ, తన శిష్యులకు ఇచ్చివేస్తున్నారు. ఒకరికి ఆసనాన్ని, ఒకరికి పంచపాత్రను, ఒకరికి ఉద్ధరిణెను, ఒకరికి పవిత్రమును (కర్మకాండలు చేయునపుడు వేలికి ధరించు ఉంగరము) ఒకరికి జపమాలను, ఒకరికి కమండలాన్ని... ఇలా తన సామాగ్రిని ఇచ్చివేస్తున్నారు. శిష్యులందరూ వరుసలో నిలబడి ఎంతో శ్రద్ధగా వారిచ్చే వస్తువులను స్వీకరిస్తున్నారు. సాందీపని వంతు వచ్చింది. అతడు వచ్చి గురువు గారికి ఎదురుగా నిలబడ్డాడు. గురువు సాందీపనిని దగ్గరగా పిల్చి, ఎంతోప్రేమతో - "నీకేమీ ఇవ్వలేను. నీ గురుభక్తికి సాటివచ్చే వస్తువేదీ నాదగ్గరలేదు. నీకొక వరమిస్తాను. త్రిలోకాధిపతి అయిన ఆ భగవంతుడే నీకు శిష్యుడవుతాడు. అతడివల్ల నీకీర్తి చిరకాలముంటుంది" అని దీవించాడు.

గురువు ఆశీర్వాదఫలంగా శ్రీకృష్ణపరమాత్మ సాందీపనివద్ద విద్యను అభ్యసించాడు. జగద్గురువైన శ్రీకృష్ణునికే విద్య బోధించి, సాందీపని చరితార్థుడయ్యాడు. ఇదంతా కేవలం గురువును శ్రద్ధగా సేవించడం వలన కలిగిన ఫలితమేనని గ్రహించాలి.

# అపూర్వమైన సాధన

'శబరి' గొప్ప భక్తురాలు. ఆమె శబర(ఆటవిక) స్త్రీ. బాల్యం నుండి ఎంతో నిర్మలమైన హృదయం గలది. సాధారణంగా శబరులు మోటుగా ఉంటారు. కాని శబరి వారికంటె మోటుగా, అందవిహీనంగా ఉండేది. అందువల్ల శబరులు ఆమెను తమజాతిస్త్రీగా అంగీకరించేవారు కాదు. ఆమెకు పెళ్ళిచేసి పంపటం, ఆమె తల్లితండ్రులకు పెద్దసమస్యగా తయారయ్యింది. ఎట్టకేలకు శబరితండ్రి ఒక సంబంధాన్ని వెదికి పట్టుకున్నాడు. పెళ్ళివారు శబరిని చూస్తే పెళ్ళి మానేస్తారనే భయంతో రాత్రిపూట చీకట్లో ఆమెకు పెళ్ళిచేశారు. వెంటనే శబరిని పెళ్ళికొడుకుకు అప్పగించి ఆమెను తీసుకువెళ్ళిపొమ్మన్నారు. పెళ్ళికొడుకు అలానే చీకట్లో శబరిని తీసుకొని తన గూడేనికి బయలుదేరాడు. శబరి భర్త వెనుకనే నడువసాగింది. రాత్రంతా చీకట్లో వారలా నడుస్తూనే పోయారు. తెల్లవారిన తర్వాత ఆ శబరయువకునికి తన భార్య ఎలా ఉంటుందో చూడాలనిపించింది. అతడు వెనుకకు తిరిగిచూశాడు. శబరి కురూపాన్ని చూసి జడుసుకున్నాడు. ఏదో దయ్యం తనను తినడానికే వచ్చిందనుకుని భయపడిపోయాడు. ఆమెను ఆ అడవిలోనే వదిలేసి పారిపోయాడు. శబరి అటు అత్తవారింటికి దారి తెలియక ఇటు పుట్టినింటికి వెళ్ళలేక, ఆ అరణ్యంలోనే ఒంటరిగా ఉండిపోయింది.

ఆ అరణ్యంపేరు దండకారణ్యం. అక్కడ నివసించే ఋషులు, మునులు శబరిని అంటరానిస్త్రీగా భావించి ఆమెను తిరస్కరించారు. ఆ అరణ్యంలోనే నివసించే మతంగమహర్షి శబరికి ఆశ్రయమిచ్చాడు. ఆయన శబరికి శరణమీయడం తక్కిన ఋషులెవరికీ నచ్చలేదు. మతంగమునికి శబరిని చూడగానే జాలి కలిగింది. శబరితో - "అమ్మాయీ! దిగులు చెందకు. భయపడకు. నీతల్లితండ్రుల వద్ద ఎలా ఉంటావో, అలానే నావద్ద ఉండవచ్చు" అని ధైర్యం చెప్పాడు. శబరి మతంగమహర్షి ఆశ్రమంలోనే నివసించసాగింది.

శబరి మహర్షులకు సేవచెయ్యడమంటే ఎంతో ఆనందించేది.

ఆశ్రమంలోని మిగతా ఋషులు, మునులు తనను తిరస్కరిస్తారని భయపడుతూ, దొంగచాటుగా వారికి కావలసిన పనులు చేసిపెడుతుండేది. రాత్రి అందరూ నిద్రపోయిన తర్వాత, ఋషులు స్నానార్థం పంపాతీరానికి వెళ్ళేదారిని శుభ్రపరిచేది. రాళ్ళున్నచోట అవి గుచ్చుకోకుండా, వాటిపై ఇసుకను పోసేది. హోమాలకు అవసరమైన సమిధలను(పుల్లలను) ఏరి తెచ్చేది. ఒకవేళ తనను ఎవరైనా చూస్తే, వారు అపవిత్రమవుతారేమోనని భావించి, అక్కడినుండి పరిగెత్తుకు పారిపోయేది. ఈవిధంగా ఆమె జీవితాన్ని గడపసాగింది.

కొంతకాలానికి మతంగమహర్షికి అంత్యకాలం సమీపించింది. తనకు తల్లితండ్రులూ, సర్వం ఆ మహర్షేనని భావించిన శబరి కన్నీరు మున్నీరుగా విలపించసాగింది. మతంగమహర్షి శబరిని - చూసి "అమ్మాయీ! నువ్వు దుఃఖించకు. ఒకరోజు సాక్షాత్పరబ్రహ్మ అయిన ఆ శ్రీరామచంద్రమూర్తి నీ దగ్గరకు వస్తాడు. ఆయనను సేవించి నువ్వు తరిస్తావు" అని దీవించి, శరీరాన్ని త్యజించాడు.

అప్పటినుండి శబరి రామునికై ప్రతీక్షించసాగింది. నిరీక్షణ ఎంతో గొప్పసాధన. ధ్యాన, భజనాదులలో మనసు విచలితమయ్యే అవకాశముంది. కాని ప్రభువు తనకోసం వస్తాడనే భావన నిత్య ఏకాగ్రమైనది. రాత్రిపూట ఏ జంతువు అలికిడి చేసినా, గాలికి ఏ ఎండుటాకు కదిలినా, రామచంద్రుడే వస్తున్నాడేమోననుకొని బయటకు వచ్చి చూసేది. ప్రతీరోజూ కుటీరానికి వచ్చే దారి అంతా పూలు పరిచిఉంచేది. పండిన పళ్ళను కోసి, తీసుకువచ్చి, వాటిని రుచి చూసి పక్వములైనవాటిని రామప్రభువుకు నివేదించడానికి సిద్ధంగా ఉంచేది. ఆరోజు రాముడు రాకపోతే, నా ప్రభువు రేపు వస్తాడు' అనుకొని ప్రతీరోజూ అన్న సిద్ధంచేసి, రాముడికోసం నిరీక్షించేది.

సుదీర్ఘమైన నిరీక్షణలో శబరిసాధన సంపూర్ణమయింది. మతంగమహర్షి వచనాలను సత్యం చేస్తూ, ఒకరోజు

**"సబరి దేఖి రామ్‌గృహ్ ఆయే!**
**మునికే బచన్ సముఝి జియా భాయె"**

*(రామచరితమానస్ - అరణ్య్ - 34-3)*

దండకారణ్యంలోని మునులందరూ రాముని తమ తమ ఆశ్రమాలను పావనం చేయమని అర్థించారు. కాని రాముడు శబరిని చూడాలనే ఉత్సుకతతో, శబరి కుటీరం వైపే వడివడిగా వెళ్ళిపోయాడు.

**"మోటా మోటా మునినా ఆశ్రమ్ ముకీనే,**
**సబరీ నే ఘేర్ జాయ్ ఛే రే,**
**వాలో భగతి తణే వశ్ థాయ్ ఛే రే."**

శబరి రామునికోసం ఎంతగా నిరీక్షిస్తుందో, రాముడు కూడ శబరిని చూడటానికి అంతగా ఉత్సుకుడై ఉన్నాడు. నన్ను ఎవరెలా ధ్యానిస్తే, నేను కూడ వారినలానే ధ్యానిస్తానని స్వయంగా భగవంతుడే చెప్పాడుకదా!

**"యే యథా మాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహమ్**

*(గీత:4-11)*

శ్రీరామచంద్రుని కన్నులారా చూసిన శబరి ఆనందానికి హద్దులు లేవు. ఆమె భగవంతుని చరణాలపై వాలిపోయింది. తన్మయత్వం నుండి తేరుకుని, స్వామికి అతిథిపూజ నిర్వహించింది. శ్రీరాముని పాదపద్మాలను కడిగి, ఆ పవిత్రజలాన్ని శిరసున చల్లుకుంది. ఆసనం పరిచి కూర్చుండబెట్టింది. చక్కనిపళ్ళు తీసుకువచ్చి నివేదించింది. ప్రతీపండును తాను కొంచెం కొరికి, రుచిగల వాటినే, రామునికి తినిపించింది. శబరి వృద్ధురాలు. పండుముసలి. రాముడు వయసులో ఎంతో చిన్నవాడు. తల్లి తనబిడ్డకు తినిపించినట్లుగా, శబరి ఎంతోప్రేమతో రామునికి పళ్ళుతినిపించింది. రాముడు అంతకంటే సంతోషంగా వాటిని ఆరగించాడు. సర్వలోకాధినాధుడైన రామప్రభువుకు కడుపుపిండా పళ్ళు తినిపించి చరితార్థురాలయింది. శబరి సాధన రామదర్శనంతో సంపూర్ణమయింది.

**"కందమూల ఫల్ సురస్ అతి దియే రామ్ కహూం ఆని**
**ప్రేమ సహిత్ ప్రభు ఖాయే బరాబర్ బఖాని**

*(రామచరితమానస్ - అరణ్య్ - 34)*

# దుర్లభమైన వస్తువు లభిస్తే ఏంచేయాలి?

ఒక రాజుగారికి అనుకోకుండా ఒకరోజు జ్ఞానోదయం అయింది. ఎంతో దుర్లభమైన జ్ఞానం తనకు లభించినందుకు మహారాజు ఎంతో సంతోషించాడు. మర్నాడు దర్బారులో తన మంత్రులందరినీ సమావేశపరిచి, "అత్యంత దుర్లభమైన వస్తువు దొరికితే ఏమి చెయ్యాలి?" అని ప్రశ్నించాడు. దానికి మంత్రులు రకరకాలైన సమాధానాలు ఇచ్చారు. ఒకరు దాన్ని దాచి ఉంచుకోవాలని, మరొకరు దాన్ని సురక్షితస్థలంలో ఉంచాలని, ఒకరు భోషాణంలో ఉంచాలని ఎవరికి తోచిన సమాధానాలు వారు చెప్పారు. రాజుకు వారి సమాధానాలు తృప్తికల్గించలేదు.

"ధుర్లభమైన వస్తువు లభిస్తే ఏమి చెయ్యాలి? తెలిసినవారెవరైనా చెప్పాల"ని రాజ్యంలో టముకు వేయించాడు. ఎందరో ప్రజలు ఎన్నోరకాల సమాధానాలు చెప్పారు. కాని మహారాజు సంతుష్టుడు కాలేదు. ఆ రాజ్యంలో ఒక వైశ్యుడు ఉండేవాడు. అతడు తత్త్వజ్ఞానం గలవాడు. అతడు - "దుర్లభమైన వస్తువు దొరికనప్పుడు, దాని సంగతి ఎవరికీ తెలియకుండా గోప్యంగా ఉంచాలి" అని రాజాధికారులకు సమాధానం చెప్పి, రాజుకు విన్నవించమన్నాడు. ఈ సమాధానం విన్న మహారాజు సంతుష్టుడయ్యాడు. వైశ్యుడు చెప్పిన మాటలు సత్యమేనని తోచింది. రాజు అతనిని స్వయంగా కలుసుకోవాలనుకున్నాడు. ఫలానారోజు, ఫలానా సమయానికి మహారాజుగారు వేంచేస్తారని వైశ్యునికి వర్తమానం వెళ్ళింది.

అనుకున్న సమయానికి మహారాజు వైశ్యుని ఇంటికి వెళ్లాడు. అది ఒక సాధారణమైన ఇల్లు. ఒక చాప పరిచి దానిమీద మహారాజును కూర్చుండబెట్టాడు. రాజు వైశ్యుడి కుశల సమాచారం అడిగాడు. ఆమాట, ఈమాట మాట్లాడి - "నీ సమాధానం నాకు సంతృప్తినిచ్చింది. నీకు కావలసినది కోరుకో" అన్నాడు. వైశ్యుడు - "ప్రభూ! నేను ఆహ్వానించనిదే మీరెప్పుడూ నా గృహానికి రాకండి. అలానే నన్ను మీ ఆస్థానానికి పిలిపించకండి. ఇది నా అభ్యర్థన" అని మనవి చేసుకున్నాడు. వైశ్యుడి మాటలు విని

మహారాజు ఆశ్చర్యపోయాడు. మహా అయితే నా రాజ్యాన్ని అడుగుతాడు. అంతేకదా! అనుకున్నాడు. కాని అందుకు పూర్తి విరుద్ధంగా వైశ్యుడు పలికిన మాటలు మహారాజుకు అర్థంకాలేదు. నీమాటలకు అర్థమేమిటని ప్రశ్నించాడు.

వైశ్యుడు "మహారాజా! నేను మిమ్మల్ని నా వద్దకు రావద్దన్నాను. అలానే నన్ను మీ వద్దకు పిలిపించవద్దు అన్నాను. అంతేగాని యిక్పై ఎప్పుడూ మీ దర్శనం చేసుకోనని అనలేదు. మీ అనుగ్రహం పొందడమే నాకు భాగ్యం. దుర్లభమైన వస్తువు లభించినప్పుడు దానిని గోప్యంగా ఉంచాలి కదా! నావంటి సామాన్యుడికి మహారాజుల స్నేహం లభించడం ఎంతో దుర్లభమైనదికదా! మరి ఈ విషయాన్ని నేను గోప్యంగా ఉంచాలి. ఎందుకంటే నాకు మహారాజుల అనుగ్రహం లభించిందని ప్రజలకు తెలిస్తే, వారు నన్ను ప్రశాంతంగా బ్రతుకనీయరు. నీకు మహారాజుతో పరిచయం ఉందికదా. నాకు రాజు గారి కొలువులో ఉద్యోగం ఇప్పించు. ఈ వ్యాజ్యం చేయించిపెట్టు. ఆ పని చేయించిపెట్టు"... అంటూ నన్ను ఇబ్బంది పెడతారు. లేనిపోని బెడద తలకు ఎత్తుకున్నట్లు అవుతుంది. అందువల్ల మీరు రావద్దు నన్ను రమ్మనవద్దు. నేనే సమయం సందర్భం చూసుకుని , తమ దర్శనానికి వస్తుంటాను. నిజానికి మీకు నన్ను కలుసుకోవలసిన అవసరం గాని, నాకు మిమ్మల్ని దర్శించుకోవలసిన అవసరంగాని ప్రస్తుతానికి లేవు" అన్నాడు.

# నాలుగు సూక్తులు

ఒక వ్యాపారి ఉండేవాడు. అతడెంతో నిజాయితీ పరుడు. ధార్మికుడు. ఒకరోజు అతడి దగ్గరకు ఓ వృద్ధుడైన పండితుడు వచ్చాడు. వ్యాపారి పండితుణ్ణి యథోచితంగా సత్కరించి, నాలుగు మంచిమాటలు చెప్పమని ప్రార్థించాడు. పండితుడు "నేను మంచిమాటలు చెబుతాను. కాని బాగా ఖర్చు అవుతుంది. ఒక్కో మంచిమాటకు వందరూపాయిలు ఇవ్వాలి" అన్నాడు. వ్యాపారి సంతోషంగా అంగీకరించాడు.

పండితుడు - "సామాన్యుడెవరైనా గొప్పవాడు అయితే అతణ్ణి మహాత్మునిగానే గౌరవించాలిగాని, సామాన్యుడిగా చూడరాదని చెప్పాడు. వ్యాపారి గుమస్తాను వందరూపాయలు ఇవ్వమన్నాడు. గుమస్తా అలానే చేసాడు. వ్యాపారి - "ఇంకో మంచిమాట ఏదైనా చెప్పండి.'

పండితుడు : ప్రక్కవారి తప్పులను ఎప్పుడూ బహిరంగపరచరాదు. వ్యాపారి చెప్పిన మీదట గుమస్తా పండితుడికి మరో వందరూపాయలిచ్చాడు.

వ్యాపారి : గురువర్యా! మరో సూక్తి చెప్పండి.

పండితుడు : పనివాళ్ళు చేసుకురాగల పనులకోసం, నీ సమయాన్ని వృథా చేసుకోవద్దు.

గుమస్తా ఇంకో వంద రూపాయలు ఇచ్చాడు.

వ్యాపారి : మరొక్కమాట చెప్పండి మహానుభావా!

పండితుడు : మనసు విరిగిపోయిన చోట ఒక్కక్షణం కూడా ఉండవద్దు. గుమస్తా ఈ సూక్తికి కూడ వందరూపాయలు ఇచ్చి నమస్కరించాడు.

పండితుడు వెళ్ళిపోయాడు. వ్యాపారి ఈ నాలుగు సూక్తులను తన దుకాణంలోను, ఇంటిలోను గోడలపై వ్రాయించాడు.

కొంతకాలం గడిచింది. వ్యాపారి వ్యాపారం నష్టాలపాలయ్యింది. చివరికి ఆస్తి అంతా హరించుకుపోయింది. పూలు అమ్మిన ఊళ్ళో కట్టెలు అమ్మలేక వ్యాపారి పొరుగురాజ్యానికి వెళ్ళడానికి నిశ్చయించుకున్నాడు. గుమస్తా కూడా వ్యాపారి వెంటే బయలుదేరాడు. వెడుతూ వెడుతూ వారు ఒకనగరం

సమీపానికి చేరుకున్నారు. ఆకలి దప్పులతో అలసిపోయి, అందరూ అక్కడే కూలబడ్డారు. వ్యాపారి గుమస్తాకు కొంత డబ్బు ఇచ్చి, పట్నంలోకి వెళ్ళి, తినడానికి ఏమైనా తెమ్మన్నాడు.

దైవయోగం వల్ల ఆ నగరాన్ని పాలించేరాజు ఆరోజే కాలం చేసాడు.(మరణించాడు). ఆయనకు సంతానం లేదు. మంత్రులందరూ కలసి "ఈరోజు నగరంలోకి బయటనుండి ఎవరైతే ముందుగా ప్రవేశిస్తారో అతడినే మన మహారాజుగా చేసుకుందామని నిర్ణయించుకున్నారు. ఇవేమీ తెలియని గుమస్తా ఆహారపదార్థాలకోసం పట్టణంలోకి ప్రవేశించాడు. గుమస్తా నగరంలోకి ప్రవేశించగానే, ప్రజలు అతడిని పట్టపుటేనుగు ఎక్కించి అట్టహాసంగా రాజమహలుకు తీసుకువెళ్ళి మహారాజసింహాసనంపై కూర్చుండబెట్టారు.

ఇక్కడ వ్యాపారి గుమస్తా ఇంకా రాకపోవడంతో, అతడిని వెదుకుతూ బయలుదేరాడు. రాజధానిలోని ప్రజల మాటల ద్వారా తనగుమస్తా, ఆదేశానికి మహారాజు అయ్యాడని తెలుసుకున్నాడు. అతణ్ణి చూడటానికి రాజదర్బారుకు వెళ్ళాడు. వ్యాపారికి పండితుని సూక్తి గుర్తుకువచ్చింది. సామన్యుడు గొప్పవాడైన తరువాత అతణ్ణి గొప్పవానిగానే చూడాలి గాని పూర్వస్థితిని అనుసరించి కించపరచకూడదన్న సూక్తి జ్ఞాపకం వచ్చింది. కొత్తమహారాజుకు యథోచితంగా నమస్కరించి వినయంగా నిల్చున్నాడు. మహారాజు అతడి ప్రవర్తనకు సంతోషించి అతణ్ణి మంత్రిగా నియమించాడు.

ఆ రాజ్యపు అశ్వశాలాధిపతికి, మహారాణికి అక్రమసంబంధం ఉంది. ఒకరోజు వారిద్దరూ ఏకాంతంలో ఉండగా, మంత్రి(వ్యాపారి) కళ్ళలో పడ్డారు. కాని వారు యితనిని గమనించలేదు. వ్యాపారి పండితుడు చెప్పిన రెండవ సూక్తి గుర్తుకువచ్చింది. పరుల తప్పులను బహిరంగపరచరాదనుకొని, తన శాలువాను, వారిద్దరూ ఎవరికీ కనబడకుండా తెరలాకట్టి, తనదారిని తాను వెళ్ళిపోయాడు. నిద్రలేచిన తర్వాత రాణి తెరగా కట్టిఉన్న శాలువాను చూసి, ఎవరో తన రహస్యాన్ని తెలుసుకున్నారు అనుకుంది. వెంటనే ఆ శాలువా ఎవరిదో వాకబు చెయ్యగా అది కొత్తగా మంత్రి అయిన వ్యాపారిదని తెలిసింది. వ్యాపారి రాజుతో తన అపరాధం గురించి చెబుతాడేమోనని

భయపడింది. కుటిలోపాయంతో ఎలాగైనా వ్యాపారిని హతమార్చాలని నిర్ణయించుకుంది. వెంటనే రాజు దగ్గరకు వెళ్ళి కొత్తమంత్రి దుర్బుద్ధితో తనను సమీపించాడని, తాను అతనిని ప్రతిఘటించగా అతడు పారిపోయాడని చెప్పింది. సాక్ష్యంగా అతడి శాలువాను చూపింది. మహారాజు రాణి చెప్పిన కల్లబొల్లి మాటలన్నీ నిజమేననుకున్నాడు. రాణి ప్రార్థన మేరకు, వ్యాపారిని సంహరించాలని నిశ్చయించాడు.

మరుసటిరోజు రాజు మంత్రిని పిలిచి, కసాయివాడి దగ్గరకు వెళ్ళి మాంసం తీసుకురమ్మని చెప్పాడు. అంతకంటె ముందుగానే కసాయివాడిని పిలిపించి, రేపు నీ దగ్గరకు మాంసం తీసుకునేందుకు వచ్చే వ్యక్తిని కత్తితో నరికివేయమని ఆజ్ఞాపించాడు. వ్యాపారికి ఎంతో ఆశ్చర్యం కల్గింది. మహారాజు మాంసాహారి కాడుకదా. మరి తనను మాంసం ఎందుకు తెమ్మన్నాడో? ఇందులో ఏదో మర్మం ఉంది అని ఆలోచించసాగాడు. అతనికి పండితుడు చెప్పిన మూడవసూక్తి గుర్తుకువచ్చింది. పనివాళ్ళు చేయగల పనులకు నీ సమయాన్ని వృథా చేసుకోవద్దని పండితుడు చెప్పాడుకదా. ఇంత చిన్నపనికోసం స్వయంగా నేను వెళ్ళడమెందుకని, తన సేవకుని మాంసం తెమ్మని పంపించాడు. సేవకుడు దుకాణానికి వెళ్ళి, మాంసం అడగగానే, కసాయి వాడిని కత్తితో పొడిచి చంపేసాడు.

ఇక్కడ మహారాజుకు గూఢచారులద్వారా, రాణి, అశ్వశాలాధ్యక్షుల అనైతికవర్తన గురించి తెలిసింది. అయ్యో! ఎంతో నిజాయితీపరుడైన మంత్రిని అనవసరంగా హత్య చేయించానని బాధపడ్డాడు. తరువాత మంత్రి బ్రతికే ఉన్నాడని తెలుసుకొని ఎంతో సంతోషించాడు. మంత్రి దగ్గరకు వెళ్ళి, తన పొరబాటును క్షమించమని అడిగాడు. రాణి వద్దకు మీ శాలువా ఎలా వచ్చిందని అడిగాడు. వ్యాపారి - "ఇందులో నా ప్రమేయమేమీ లేదు. పూర్వం ఎప్పుడో నాలుగువందల రూపాయలు తీసుకొని, పండితుడు చెప్పిన సూక్తులను అమలుపరిచాను. రాణి తప్పు నాకు తెలిసింది. పండితుడు ఇతరుల తప్పులను బహిరంగపరచవద్దన్నాడు కదా అని, వారి దోషాన్ని దాచేందుకు నా శాలువాను తెరలా కట్టాను. దానినే రాణి మీవద్దకు తీసుకువచ్చింది" అని చెప్పాడు.

రాజు తనను క్షమించమని ప్రార్థించి, మంత్రిగా కొనసాగమని కోరాడు. వ్యాపారికి పండితుడు చెప్పిన నాలుగవ సూక్తి జ్ఞాపకమొచ్చింది. మనసుకు కష్టం కలిగినచోట మరి ఉండరాదని గురువుచెప్పిన మాట ప్రకారం, రాజు కొలువు వదిలిపెట్టి వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాడు. రాజు అతనిని ఎంతవారించినా వినకుండా అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

# మాట్లాడితే మరణమే

ఒకరాజు ఉండేవాడు. ఆయనకు సంతానం లేదు. ఆయన ఎందరో సాధువులను, సన్యాసులను ఆశ్రయించాడు. ఎందరో దేవతలకు మ్రొక్కాడు. అయినా సంతానం కలుగలేదు. ఇలా ఉండగా అతని రాజ్యంలోకి కొత్తగా ఎవరో గొప్పమహత్తు గల సాధువు వచ్చాడు. ఈ సంగతి విని రాజు ఆ సాధువు దర్శనం కోసం వచ్చాడు. తనకు సంతానం కలగాలంటే ఏం చెయ్యాలో చెప్పమని ప్రార్థించాడు. సాధువు బాగా ఆలోచించి - "ఈ విషయంలో నేనేమీ చెయ్యలేను. మహారాజా! మీకు సంతానయోగం లేదు" అని చెప్పాడు. రాజు నిరాశతో తిరిగిపోసాగాడు. దారిలో ఆ సాధువు యొక్క శిష్యుడు ఎదురయ్యాడు. అతడు మహారాజు ఉదాసీనంగా ఉండటం చూసి, 'రాజా! ఎందుకలా ఉన్నారు?' అని అడిగాడు. రాజు - "పుత్రేచ్ఛతో ఇక్కడకు వచ్చాను. కాని నిరాశతో తిరిగివెళ్ళిపోతున్నా"నని బదులిచ్చాడు. రాజుదైన్యాన్ని చూసి, జాలితో ఆ శిష్యుడు - "మహారాజా! బాధపడకండి. మీకు తప్పక సంతానం కలుగుతుంది." అన్నాడు. రాజు సంతోషంతో తిరిగివెళ్ళిపోయాడు. ఈ సంగతి అంతా తెలుసుకున్న గురువు శిష్యునిపై కోపించాడు. "రాజు జాతకంలో సంతానయోగం లేదు. నువ్వేమో సంతానం కలుగుతుందని దీవించావు. ఇప్పుడు ఏం చేస్తావు?" అని గద్దించాడు. శిష్యుడు - "అయ్యో! ఇప్పుడు నేనేం చెయ్యను? అనాలోచితంగా నానోటివెంట అలా వచ్చేసిందే?" అని బాధపడ్డాడు. గురువు - "నీకు అసత్యదోషం రాకుండా ఉండాలంటే నువ్వే రాజుకు పుత్రునిగా జన్మించాలి" అన్నాడు.

విధిలేక శిష్యుడు తన దేహాన్ని త్యజించి, మహారాజుకు పుత్రునిగా జన్మించాడు. అయితే గురుకృప వలన అతనికి పూర్వ జన్మ జ్ఞానం నశించలేదు. రాజకుమారుడికి అన్నీ శుభలక్షణాలే గాని, మాటామంతీ లేకుండా ఉండేవాడు. మూగవాడైన తన కుమారుని ఎందరో వైద్యులకు చూపించాడు మహారాజు. అయినా ఫలితం లేకుండాపోయింది. చివరకు

తన కుమారునికి మాట తెప్పించిన వారికి లక్షరూపాయలు బహుమానం ఇస్తానని రాజ్యంలో దండోరా వేయించాడు. ఎందరోవచ్చి ఏమేమో చేశారు కాని ఫలితం శూన్యం.

రోజులు గడిచిపోతున్నాయి. రాకుమారుడు కొంచెం పెద్దవాడయ్యాడు. ఒకరోజు రాజాధికారులు, రాజకుమారుని వనవిహారం కోసం తీసుకువెళ్ళారు. అక్కడ ఒక బోయవాడు పక్షులను కొట్టడానికి మాటువేసి కూర్చున్నాడు. కాని అతనికి ఒక పిట్ట కూడా కనబడలేదు. ఇంతలో ఒక పిట్ట చెట్టుమీద కువకువలాడింది. అంతే. వేటగాడు పిట్టను గమనించి దాన్ని బాణంతో కొట్టాడు. అది విలవిలలాడుతూ నేలపై పడి చనిపోయింది. ఇదంతా చూసిన రాజకుమారుని నోట అప్రయత్నంగా 'మాట్లాడితే మరణమే' అనే మాటలు వెలువడ్డాయి. అతడి వెంటనున్న రాజాధికారులు, రాజకుమారుడు మాట్లాడటం చూసి ఆశ్చర్యపోయారు. పరుగుపరుగున మహారాజును చేరుకుని జరిగినది వివరించారు. రాజు వారి మాటలను నమ్మలేదు. తన యెదురుగా రాజకుమారుని మాట్లాడిస్తే, మీరు చెప్పినది నమ్ముతానన్నాడు. రాజాధికారులు ఎంత ప్రయత్నించినా, ఎంత బ్రతిమలాడినా రాజకుమారుడు పెదవి కదపలేదు. రాజు వారు చెప్పింది అబద్ధమనుకున్నాడు. డబ్బుకోసం ఆశపడి రాజాధికారులు అబద్ధం చెప్పారనుకొని, వారిని ఉరితీయమని ఆజ్ఞాపించాడు. వెంటనే రాజకుమారుడు 'మాట్లాడితే మరణమే' అన్నాడు. మహారాజు ఎంతగానో ఆశ్చర్యపోయాడు. అతడు రాకుమారుని మరల మాట్లాడమని ఎంతగానో ప్రాధేయపడ్డాడు. చివరకు రాకుమారుడు - "మహారాజా! నేను పూర్వజన్మలో మీకు సంతానం కలుగుతుందని దీవించిన సన్యాసిని. మీ జాతకంలో సంతానయోగం లేకపోయినప్పటికీ నేను మిమ్ములను అలా దీవించాను. దాని ఫలితంగానే ఈ జన్మనెత్తి మీకు పుత్రునిగా పుట్టవలసివచ్చింది. ఒకవేళ ఆరోజు నేనలా మాట్లాడకపోయివుంటే, చక్కగా తపస్సు చేసుకొని(జన్మరాహిత్యాన్ని) ముక్తిని పొందేవాడిని. నాకిక జన్మనెత్తవలసిన అవసరమే ఉండేదికాదు. పక్షి కూడా ఏ శబ్దమూ చెయ్యకుండా, మౌనంగా ఉండి ఉంటే, దాన్ని బోయవాడు చంపేవాడు కాదు. అలానే ఈ అధికారులు నేను మాట్లాడానని మీకు

చెప్పకపోయివుంటే వారికి ఈ మరణశిక్ష ఉండేదికాదు. అన్ని అనర్థాలకు కారణం అనవసరంగా మాట్లాడడమే. అందుకనే 'మాట్లాడితే మరణమే'నని అనుకోకుండా అన్నాను. నేనింతవరకు మాట్లాడాను కనుక నేను కూడా మరణిస్తాను అని చెప్పి తనువు చాలించాడు.

**"జనహరియా సంసార్‌మే, బహుబోల్యాం బహు దుఃఖో**
**చుప్ రహియే, హరి సుమిరిచే, జో జివ్ చాహే సుఖ్ ॥**

ఈ ప్రపంచంలో ఎక్కువ మాట్లాడేవారికి ఎక్కువ కష్టాలు వస్తాయి. అందువల్ల సుఖాల్ని కోరుకునేవారు మౌనంగా ఉంటూ శ్రీహరిని స్తుతించాలి.

# యథార్థ సంఘటనలు

బదరీనారాయణంలో ఒకసాధువు నివసించేవాడు. ఒకసారి ఆయనకు వేలిపై ఒకవ్రణం (కురుపు) వచ్చింది. ఆసుపత్రికి వెళ్తే, ఉచితంగా వైద్యం చేస్తారని, గాయాన్ని శుభ్రం చేసి కట్టుకడతారని కనుక వెంటనే ఆసుపత్రికి వెళ్ళమని ఎవరో సలహా ఇచ్చారు. సాధువు ఈ నొప్పిని ఎలాగైనా భరించగలనుగాని, వేలికి కట్టుకట్టమని ఎవరినైనా అడగడాన్ని అసలు సహించలేను అని బదులిచ్చారు. నిజమైన సాధువుల స్వభావం ఇలా ఉంటుంది.

ఒకసాధువును ఎవరో - "స్వామీ! మీదగ్గర ఒక్కపైసా అయినా లేదే. మరి మీరు భోజనమెలా చేస్తారు?" అనడిగారు. సాధువు భిక్షాటన చేస్తూ దానిద్వారా లభించినదే స్వీకరిస్తానని చెప్పాడు. అవతలి వ్యక్తి - 'మరి భిక్షతో ఏమీ లభించకపోతే ఏం చేస్తారు? అని అడిగాడు. సాధువు అప్పుడు ఆకలినే భోంచేస్తానని బదులిచ్చాడు.

ఒకవ్యక్తి సైకిల్‌మీద ఎక్కడికో వెడుతున్నాడు. అతడు రోడ్డుకు మధ్యగా సైకిల్ తొక్కుతున్నాడు. వెనుకనుండి ఒక లారీవాడు వచ్చి, లారీని ఆపి. "అరే! రోడ్డుకు మధ్యగా సైకిల్ తొక్కుతావేంటి? ఈ ప్రక్కకో, లేక ఆప్రక్కకో వెళ్ళు అన్నాడు. ఆ మాటలు సైకిలు తొక్కుతున్న వ్యక్తిని పరోక్షంగా ప్రభావితం చేసాయి. అతడికి జ్ఞానోదయం అయ్యింది. అతడు - "నేను కూడా ఈ ప్రపంచమనే సముద్రం మధ్యలో ఉన్నాను. నేను ఏదో ఒక ఒడ్డుకు చేరుకోవాలి అనుకున్నాడు. వెంటనే అతడు సమస్తాన్నీ త్యజించి, సన్యాసిగా మారిపోయాడు.

ఒక సాధువు ఉండేవాడు. ఆయన ఎవరినీ ఏదీ అడిగేవాడుకాదు. అది ఆయన నియమం. చివరికి ఎవరైనా "దీనిని స్వీకరిస్తారా" అని అడిగినా వద్దనేవాడు. రెండు మూడు రోజులు తిండితిప్పలు లేకపోయినా కూడా ఎవరినీ ఏదీ అడిగేవాడుకాదు. ఎవరైనా ఒక రొట్టెనో, ఒక తినుబండారాన్నో పట్టుకువచ్చి, దీన్ని స్వీకరించండి స్వామీ! అంటే దాన్ని మాత్రం ఆరగించేవాడు.

సాధువు అయినవాడు ఆ పూట తినడానికి సరిపడా ఆహారాన్ని మాత్రమే స్వీకరించాలి. రేపటికోసం దాచుకోవడమనేది సన్యాసులకు నిషిద్ధం. అలానే ఒక నియమాన్ని ఏర్పర్చుకుంటే, ప్రాణాలు పోయే పరిస్థితి వచ్చినా ఆనియమాన్ని ఉల్లంఘించకూడదు.

ఋషీకేశంలో ఒకసాధువు ఉండేవాడు. ఒకరోజు ఆయన ఏదోపనిమీద బయటకు వెళ్ళారు. ఆయన లేనిసమయంలో ఎవరో, ఆ స్వామి కుటీరంలో తినుబండారాలు ఉంచి వెళ్ళారు. తిరిగి వచ్చిన స్వామికి అక్కడ ఆహారపదార్థాలు కనిపించాయి. వాటన్నిటినీ చీమలు తినేసేదాకా సాధువు ఆ కుటీరంలోకి వెళ్ళనే వెళ్ళలేదు.

ఋషీకేశంలో శ్రీస్వయంజ్యోతీ మహారాజ్ అనే సాధువు ఉండేవారు. ఆయన కౌపీనం చిరిగిఉండటం చూసిన ఒక శిష్యసాధువు సూదీ,దారం తీసుకువచ్చాడు. స్వామి అది చూసి "ఆ సూదీ - దారం అక్కడే పెట్టు. నేనే స్వయంగా కుట్టుకుంటాను" అన్నారు. శిష్యుడు వాటినక్కడే వుంచి వెళ్ళిపోయాడు. స్వామీజీ తన వస్త్రాన్ని తానే స్వయంగా కుట్టుకుని, మరుసటిరోజు ఆ సూదినీ, దారాన్ని శిష్యునికి తిరిగి యిచ్చివేసారు. శిష్యుడు - "స్వామీ! వీటిని మీవద్దనే ఉంచండి. మరల ఎప్పుడైనా ఉపయోగపడతాయి కదా" అన్నాడు. అందుకు స్వామీజీ - ఈ అవసరాలను, కోరికలను తప్పించుకోవడానికే గదా ఈ అరణ్యాలకు వచ్చింది. కనుక ఈ సూదీదారాలను ఇక్కడనుండి పట్టుకుపో. అసలు ఈ "కావాలి" అన్న పదమే మాకు వద్దు" అన్నారు.

ఒక సన్యాసి ఉండేవాడు. ఒకసారి అతడు ఒక ఉత్సవానికి వెళ్ళాడు. అక్కడ అతనికి పూర్వాశ్రమంలోని తన భార్య కనిపించింది. ఆయన ఆమెతో - "నువ్వు ఇక్కడకు ఎప్పుడు వచ్చావు? అనడిగాడు. దానికి ఆ స్త్రీ - మీరు బంధాలన్నింటినీ త్యజించి సన్యాసాన్ని స్వీకరించారుకదా. మీరింకా నన్ను గుర్తుంచుకున్నారా?" అంది. ఆమె మాటలకు సిగ్గుపడి సన్యాసి సిగ్గుతో తలవంచుకున్నాడు. అప్పటినుండి అతడు జీవితాంతం తలవంచుకునే ఉండేవాడు. ఎప్పుడూ తలయెత్తి ఎవరినీ చూడలేదు.

ఒక బ్రాహ్మణుడు కాశీలో విద్యాభ్యాసం చేసి, పెద్ద పండితుడై తన పట్టణానికి తిరిగివచ్చాడు. అతడి ప్రతిభకు ఆకర్షింపబడి, ఆ ఊరిరాజు

బ్రాహ్మణునితో స్నేహం చేయసాగాడు. కొంతకాలానికి వారిద్దరూ మంచి స్నేహితులైపోయారు. రాజు బ్రాహ్మణునికి గృహాన్ని అమర్చాడు. వివాహం చేసాడు. చివరకు అర్ధరాజ్యాన్ని ఇచ్చివేశాడు. ఒకరోజు రాజు బ్రాహ్మణునితో - "నావద్ద ఏమున్నదో, అదంతా నీదగ్గర కూడా ఉన్నదికదా. మరి మనిద్దరికీ తేడా ఏమున్నది? అనడిగాడు. బ్రాహ్మణుడు సమయం వచ్చినప్పుడు చెప్తానన్నాడు. ఒకరోజు వారిద్దరూ నాలుగు గుర్రాలు పూన్చిన రథాన్నెక్కి విహరించడానికి వెళ్ళారు. బ్రాహ్మణుడు రాజుతో - "ప్రభూ! మనిద్దరి మధ్యా అంతరమేమిటని అడిగారు కదా. ఇదుగో. నేను నా సమస్తాన్నీ త్యజించి సన్యాసినై వెళ్ళిపోతున్నాను. మీరిలా నాతో రాగలరా?" అని, రథం దిగి వెళ్ళిపోయాడు. రాజు నిశ్చేష్టుడై, అలా చూస్తూ నిలబడిపోయాడు. ఆ బ్రాహ్మణుడు ఎప్పటికీ తిరిగిరాలేదు. రాజుకు తమమధ్య గల అంతరం అవగతమయింది. బ్రాహ్మణునికి సంసారవ్యామోహం లేదు. తాను వ్యామోహాన్ని జయించలేదు. అనుకున్నాడు.

సముద్రపు ఒడ్డున గల ఒక మొండిగోడపై, ఒక సజ్జనుడు కూర్చుని ఉన్నాడు. అతడు సముద్రాన్నే చూస్తూ కూర్చున్నాడు. ఇంతలో ఒక వ్యక్తి స్నానం చెయ్యడానికి అక్కడకు వచ్చాడు. ఉతికిన దుస్తులు, చెంబు ఒడ్డున పెట్టుకొని, స్నానం చెయ్యడానికి నీళ్ళలోకి వెళ్ళాడు. ఇంతలో పెద్ద అల వచ్చి, అతనిని సముద్రంలోకి ఈడ్చుకుపోయింది. అతని దుస్తులు, చెంబు మొదలైన వస్తువులన్నీ ఒడ్డునే ఉన్నాయి. కాని అవ్యక్తిమాత్రం ఎప్పటికీ తిరిగిరానిచోటుకు వెళ్ళిపోయాడు. గోడపై కూర్చుని ఉన్న సజ్జనుడు ఇదంతా చూశాడు. అతనికి జీవితం ఎంత క్షణభంగురమైనదో తెలిసింది. అతడు వెంటనే గోడదిగి, ఒక అజ్ఞాతప్రదేశానికి వెళ్ళిపోయాడు. మిగిలిన జీవితమంతా భగవద్భజనలోనే గడిపాడు. అతడు ఎప్పుడూ తిరిగి ఈ సంసారమనే మాయలో చిక్కుకోలేదు. ఈ సంసారాన్ని త్యజించడానికి ఆలోచించవలసిన అవసరమేమున్నది? మరణించేవారు ఎవరైనా ముందుగా ఆలోచించుకుని ఈ దేహాన్ని విడిచిపెడతారా!